నమస్తే తెలంగాణ
NAMASTE TELANGANA

మన రాష్ట్రం మన పత్రిక

PUBLISHED FROM HYDERABAD • KARIMNAGAR • WARANGAL • KHAMMAM • NALGONDA • MAHABUBNAGAR • NIZAMABAD

www.ntnews.com /ntdailyonline

మంగళవారం TUESDAY | 17.9.2024

హైదరాబాద్ HYDERABAD

సంపుటి (Volume): 14
సంచిక (Issue): 103
వెల (Price) రూ.6.50

పేజీలు: 12+4 Pages: 12+4



తెలంగాణ తల్లి విగ్రహాలకు

క్షీరాభిషేకాలు

కాంగ్రెస్ సర్కారు చర్యకు
నేడు బీఆర్ఎస్ నిరసన

దివంగత రాజీవ్‌గాంధీ మాజీ ప్రధాని. మహనీయుడు. దేశం కోసం ప్రాణాలర్పించిన నేత. ఆయనను ఇప్పటికే అనేక విధాలుగా గౌరవించుకున్నం. మరింతగా కూడా గౌరవించుకోవచ్చు. అభ్యంతరం లేదు!

కానీ...

రాజీవ్‌గాంధీకి, తెలంగాణకు ఏం సంబంధం? విగ్రహం ఇప్పుడెందుకు? ఇక్కడే ఎందుకు? తెలంగాణ తల్లి విగ్రహం ప్రతిష్ఠించాలని సంకల్పించిన చోటే, పట్టుబట్టి రాజీవ్‌గాంధీ విగ్రహం పెట్టాల్సిన అవసరం ఏమున్నది?

అమ్మా తెలంగాణమా.. అపరాధం మన్నించుమా!

అంబేద్కర్ రచించిన రాజ్యాంగం వల్ల తెలంగాణ రాష్ట్రంగా అవతరించింది. ఆ సమున్నత వ్యక్తిత్వాన్ని ప్రతిఫలించే భారీ విగ్రహం అటువైపు! వందలాది అమరుల ఆకాంక్షల ఫలంగా తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించింది. వారి సముజ్వల త్యాగాన్ని ప్రజ్వలించే అమర జ్యోతి ఇటువైపు! ఆ రెండింటి మధ్యలో... నాలుగున్నర కోట్ల ప్రజల ఆశలను నెరవేర్చాల్సిన పాలకుల కొలువు సచివాలయం. తరతరాలపాటు ఆ సచివాలయంలో కూర్చునే ఏలికలు... అంబేద్కర్ ఆశయాలను, అమరుల త్యాగాలను మరువకుండా, తెలంగాణ స్ఫూర్తి అనే కర్తవ్యం కనుమరుగు కాకుండా పరిపాలించాలనే సందేశం ఇచ్చే సదుద్దేశంతో నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ అక్కడ తెలంగాణ తల్లి విగ్రహాన్ని ప్రతిష్ఠించాలని సంకల్పించారు. కానీ రేవంత్ ప్రభుత్వం హైదరాబాద్‌లో వేరే స్థలమే లేనట్టు, మరే సంస్థకూ రాజీవ్ పేరు లేనట్టు, భాగ్యనగరంలో ఇంకెక్కడా ఆయన విగ్రహం పెట్టలేమన్నట్టు.. సచివాలయానికి-అమర జ్యోతికి నడుమ రాజీవ్ విగ్రహాన్ని ఆవిష్కరించింది.

ఒకప్పుడు తెలుగు తల్లి విగ్రహం ఉన్నచోటు అది. తెలంగాణపై సమైక్య పాలకుల ఆధిపత్య భావజాలానికి నాటి తెలుగు తల్లి ఒక ప్రతీక అయితే, కాంగ్రెస్ ఆధిపత్య భావనకు నేటి రాజీవ్ విగ్రహం ఒక ప్రతీక! తెలంగాణ ఆత్మను అవమానించి, ఆత్మగౌరవాన్ని ఢిల్లీకి తాకట్టు పెట్టి, పదవుల కోసం పాదాలకు మోకరిల్లే మనస్తత్వాల వికృత క్రీడ ఇది.

నిజానికి దివంగత రాజీవ్‌గాంధీయే బతికి ఉన్నా ఈ దుర్మార్గాన్ని సహించేవారు కాదేమో! ఈ విగ్రహావిష్కరణకు చివరికి రాజీవ్ కుటుంబ సభ్యుల ఆమోదమూ ఉన్నట్టు లేదు. అనేకసార్లు ప్రాధేయపడినా వారు కనికరించలేదు. సరికదా కనీసం అభినందన సందేశమైనా పంపలేదు!

మరెందుకీ తాపత్రయం? మరి దేనికోసమీ ఆత్మవంచన? నాలుగున్నర కోట్ల ప్రజల మనస్సంకల్పాన్ని, పోరుగడ్డ తెలంగాణ బిడ్డల గరిమను అవమానించే ఈ ప్రయత్నం ఎందుకు? పదేండ్లుగా పదిలంగా కాపాడుకున్న తెలంగాణ జ్వాలను పది నెలల్లోనే ఆర్పేయాలన్న ఆరాటం, ఎవరి ప్రయోజనాల కోసం?!



కంప్యూటర్‌ను పుట్టించిందే రాజీవ్‌గాంధీ

- ఆయన కంప్యూటర్‌ను పరిచయం చేయకుంటే ఐటీ శాఖ ఎక్కడిది?
- కేటీఆర్ ఐటీ మంత్రే కాకపోతుండె
- దేశంకోసం త్యాగం చేసిన చరిత్ర 'గాంధీ' కుటుంబానిది › 2

రాజీవ్‌గాంధీ విగ్రహావిష్కరణ సభలో సీఎం రేవంత్ రెడ్డి

తెలంగాణ ఆత్మ.. ఢిల్లీకి తాకట్టు



- అమరజ్యోతి, సచివాలయం మధ్య రాజీవ్ విగ్రహమా?
- సోనియాగాంధీ మెప్పు కోసం సీఎం రేవంత్‌రెడ్డి ఆత్రుత
- ఆ స్థలాన్ని పవిత్రభూమిగా కేసీఆర్ మార్చాలనుకున్నరు
- తెలంగాణ తల్లి ఏర్పాటుకు 2023 జూన్‌లోనే డిజైన్
- నాడూ,నేడూ ఏనాడూ రేవంత్‌కు తెలంగాణ సోయి లేదు
- అమరజ్యోతి వద్దకు సందర్శకులను అనుమతించట్లేదేం
- కేసీఆర్ నిర్మించారనే అంబేద్కర్ ఫొటో గ్యాలరీకి తాళం
- కేసీఆర్ ఆనవాళ్లను చెరిపేయడం రేవంత్ తరం కాదు

మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి మండిపాటు › 2

తెలంగాణ అస్థిత్వంతో పెట్టుకుంటే

రాజకీయ సమాధే



అధికారంలోకి రాగానే సకల మర్యాదలతో గాంధీభవన్‌కు రాజీవ్ విగ్రహం తరలిస్తాం: కేటీఆర్ › 2

ముహూర్తం

మంగళవారం, సూర్యోదయం: 6-04, సూర్యాస్తమయం: 6-16. శ్రీ క్రోధి నామ సంవత్సరం దక్షిణాయనం వర్ష రుతువు భాద్రపద మాసం శుక్ల పక్షం తిథి: చతుర్దశి పగలు 11-44 వరకు. నక్షత్రం: శతభిషం పగలు 1-54 వరకు. వర్జ్యం: రాత్రి 7-32 నుంచి రాత్రి 8-56 వరకు. రాహుకాలం: పగలు 3-12 నుంచి సాయంత్రం 4-44 వరకు. దుర్ముహూర్తం: ఉదయం 8-31 నుంచి ఉదయం 9-19 వరకు, పునర్ దుర్ముహూర్తం: రాత్రి 10-59 నుంచి రాత్రి 11-46 వరకు. అమృతకాలం: ఉదయం 7-29 నుంచి ఉదయం 8-54 వరకు, పునర్ అమృతకాలం: తెల్లవారుజామున 3-57 నుంచి తెల్లవారుజామున 5-22 వరకు. అనంత పద్మనాభ వ్రతం, గణేశ నిమజ్జనం.

'వాల్మీకి స్కామ్' పాత్రధారికి

కీలక పదవి

కర్ణాటక సర్కారు నిర్ణయంపై సర్వత్రా విమర్శలు › 7

డొనాల్డ్ ట్రంప్‌పై హత్యాయత్నం

గోల్ఫ్ ఆడుతుండగా కాల్పులకు యత్నం › 7



కెనడాలో నీట మునిగి హైదరాబాద్ విద్యార్థి మృతి › 7

వచ్చే నెల నుంచి స్మార్ట్ రేషన్‌కార్డులు › 8

- హెల్త్‌కార్డులూ పంపిణీ చేస్తాం
- జనవరి నుంచి సన్నబియ్యం

మంత్రులు ఉత్తమ్, పొంగులేటి

అన్నా.. నెల దాటిందే!



- నోటీసులు ఇచ్చి నెలన్నర గడిచినా చర్యలేవి?
- సీఎం సోదరుడి ఇల్లు ఇంకా కూల్చలేదేమి?
- దుర్గం చెరువు అమర్ కో ఆపరేటివ్ సొసైటీకి గత నెల 8వ తేదీన హైడ్రా నోటీసులు
- ఎఫ్‌టీఎల్‌లో ఉన్న నిర్మాణాలు తొలగించాలని రేవంత్ అన్న తిరుపతిరెడ్డికి తాఖీదులు
- నెల గడిచినా అటు కన్నెత్తి చూడని అధికారులు

హైదరాబాద్ సిటీబ్యూరో, సెప్టెంబర్ 16 (నమస్తే తెలంగాణ): చెరువుల ఆక్రమణలు, ఎఫ్టీఎల్ భూముల పరిరక్షణకు మడికట్టుకున్న హైడ్రా.. ఇప్పుడు చేతులెత్తేసింది. పేద, మధ్యతరగతి జనాలు ఉండే నివాసాలపై బుసలు కొడుతూ.. ధనికులు, సంపన్నవర్గాలు, రాజకీయ పలుకుబడి కలిగిన నేతల విషయంలో కోరలు తీసిన పాములా మారిపోయింది. దుర్గం చెరువు పరివాహక ప్రాంతంలో పదుల ఎకరాల్లో విస్తరించిన అమర్ హౌజింగ్ కో ఆపరేటివ్ సొసైటీకి నెల క్రితమే నోటీసులు జారీచేసిన హైడ్రా.. ఇప్పటివరకు అటువైపు కన్నెత్తి చూడలేదు. ఎందుకు అంటే.. అక్కడ ఉన్నది స్వయానా సీఎం రేవంత్‌రెడ్డి సొంత అన్న ఇల్లు. ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లో › 6వ పేజీలో

ఎల్ఆర్ఎస్ దరఖాస్తా.. రిజెక్ట్!

- హైడ్రా ఎఫెక్ట్‌తో అప్లికేషన్ల తిరస్కరణ
- చిన్న చిన్న కారణాలను చూపి కొట్టివేత
- రాష్ట్రవ్యాప్తంగా 25.7 లక్షల దరఖాస్తులు
- ఇప్పటికే 3 లక్షల అప్లికేషన్ల నిరాకరణ › 6
- తీవ్ర ఒత్తిడికి లోనవుతున్న అధికారులు

- నేడు వినాయక నిమజ్జనం



గణనాథుడికి నాగాభరణం

జగిత్యాల వాణీనగర్‌లో త్రిశూల్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన గణపతి విగ్రహం వద్ద సోమవారం ఉదయం ఓ నాగుపాము సందడి చేసింది. గణేశుడి విగ్రహం మెడలో చేరికొద్దిసేపు భక్తులను ఇలా అలరించింది.

గాంధీలు దూరం

- సీఎం రేవంత్‌ను పట్టించుకోని సోనియా కుటుంబం
- రాజీవ్‌గాంధీ విగ్రహావిష్కరణకు అందరూ దూరం
- సోనియాగాంధీని పిలుస్తామని ప్రకటించిన సీఎం
- నాలుగైదు సార్లు ఢిల్లీ వెళ్లి కోరినా స్పందన కరువు
- అందుకే సందర్భం లేకుండా హడావుడిగా ఆవిష్కరణ

హైదరాబాద్, సెప్టెంబర్ 16 (నమస్తే తెలంగాణ): 'రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని సోనియాగాంధీ చేతుల మీదుగా ఆవిష్కరిస్తాం. లక్షల మంది రాజీవ్‌గాంధీ అభిమానుల మధ్య విగ్రహావిష్కరణ జరుగుతుంది'.. ఈ ఏడాది ఫిబ్రవరి 14న సచివాలయం ముందు రాజీవ్‌గాంధీ విగ్రహ ప్రతిష్ఠాపనకు భూమి పూజ నిర్వహించిన సమయంలో సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు ఇవి. కానీ సోమవారం సమయం, సందర్భం లేకుండా తూతూమంత్రంగా, హడావుడిగా రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని సీఎం రేవంత్ రెడ్డి ఆవిష్కరించారు. 'గాంధీ' కుటుంబం మొత్తం ముఖం చాటేసింది. రాహుల్, సోనియా, ప్రియాంక.. ఇలా ఆ కుటుంబ అగ్రనేతలెవరూ హాజరు కాలేదు. కనీసం సోషల్ మీడియాలో కూడా అభినందనలు తెలపలేదు. దీంతో ఈ విషయమై కాంగ్రెస్ వర్గాల్లో జోరుగా చర్చ జరుగుతున్నది. సీఎం రేవంత్‌రెడ్డిని గాంధీ కుటుంబం దూరం పెట్టిందన్నది వట్టి ప్రచారం కాదని.. నిజమేనని ఈ ఘటనతో రుజువయ్యిందని అంటున్నారు. ఈ ఏడాది మార్చిలో బెంగళూరులో జరిగిన రాజీవ్‌గాంధీ విగ్రహావిష్కరణకు కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే హాజరయ్యారని గుర్తు చేస్తున్నారు. కానీ తెలంగాణకు ఎందుకు రాలేదని ప్రశ్నిస్తున్నారు. చివరికి కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి › 2వ పేజీలో



తిప్పర్తి శివారులో డీ-40 కాల్వ వద్ద ధర్నా చేస్తున్న వివిధ గ్రామాల రైతులు

నీట మునిగింది 500 ఎకరాలు.. నీళ్లు లేక ఎండుతున్నది


50 వేల ఎకరాలు

- సూర్యాపేట జిల్లాలో వరి సాగుకు కష్టాలు
- ఖమ్మం మంత్రుల నిర్వాకంతో కాల్వకు గండి!
- వరద తాకిడికి నిండా మునిగిన పంటలు
- నేటికీ చోద్యం చూస్తున్న నల్లగొండ మంత్రులు
- కాల్వ గండి పూడ్చేందుకు సర్కారు మీనమేషాలు
- ఇప్పటికే పొలాలకు నీళ్లు రాక 12 రోజులు
- మరో 3 వారాలైనా ఎడమకాల్వకు నీళ్లు కష్టమే!
- నెర్రెలు బారిన పొలాలు.. ఎండుతున్న పంటలు

సూర్యాపేట, సెప్టెంబర్ 16 (నమస్తే తెలంగాణ): సూర్యాపేట జిల్లా నడిగూడెం మండలం కాగితరామచంద్రాపురం వద్ద పదిహేను రోజుల క్రితం నాగార్జునసాగర్ ఎడమ కాల్వకు గండిపడడంతో 500 ఎకరాల్లో వరి పంట మునిగింది. ఇప్పటికీ గండి పూడ్చకపోవడంతో నీటి విడుదలలేని కారణంగా సూర్యాపేట జిల్లావ్యాప్తంగా మరో 30 వేల ఎకరాల్లో వరి పంట ఎండుతున్నది. ఎండాకాలం ఖమ్మం జిల్లాకు నీటిని తరలించేందుకు ఆ జిల్లా మంత్రులు చేసిన దుశ్చర్య కారణంగానే కాగితరామచంద్రాపురం వద్ద గండిపడింది. వారంలో గండి పూడుస్తామని జిల్లాకు చెందిన నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రకటించినా ఆచరణకు నోచలేదు. దాంతో నాటుపడ్డ వరి పైర్లు ఎండి నేల నెర్రెలు వారుతున్నది. వారం › 5వ పేజీలో

ప్రాజెక్టుల స్వాధీనానికే కేంద్రం మొగ్గు

- తాజాగా సుప్రీంకోర్టులో జలశక్తి శాఖ అఫిడవిట్
- అప్పగించబోమని అప్పట్లో రేవంత్ సర్కార్ బీరాలు
- 10 నెలలవుతున్నా సాగర్‌వైపు దృష్టిసారించని వైనం
- ఇప్పటికీ సీఆర్పీఎఫ్ ఆధీనంలోనే నాగర్జునసాగర్ డ్యాం



హైదరాబాద్, సెప్టెంబర్16 (నమస్తే తెలంగాణ): శ్రీశైలం, నాగార్జునసాగర్ డ్యామ్‌లతోపాటు ఔట్‌లెట్లను స్వాధీనం చేసుకునేందుకు ఇప్పటికే గెజిట్‌ను జారీ చేశామని, అయితే వాటి నిర్వహణకు రూ.200 కోట్ల సీడ్‌మనీని డిపాజిట్ చేయాల్సి ఉన్నదని కేంద్ర జల్‌శక్తి శాఖ వెల్లడించింది. ఈ మేరకు తాజాగా సుప్రీంకోర్టులో అఫిడవిట్‌ను దాఖలు చేసింది. ప్రాజెక్టుల స్వాధీనానికి సిద్ధంగా ఉన్నామని ఆ అఫిడవిట్‌లో స్పష్టం చేసింది. జల విద్యుత్తు ప్రాజెక్టుల నుంచి పూర్తిస్థాయి స్థాపిత సామర్థ్యం మేరకు విద్యుత్తును ఉత్పత్తి చేయాలని గతంలో తెలంగాణ సర్కారు జీవో 34ను జారీ చేయడం, దానిని రద్దు చేయాలని కోరుతూ ఏపీ సర్కారు కోర్టుకెక్కడం తెలిసిందే. ఆ కేసు విచారణలో భాగంగా ప్రాజెక్టుల అంశంపై అభిప్రాయాన్ని › 5వ పేజీలో

మంత్రుల కుతకుత

రేవంత్‌పై క్యాబినెట్ సహచరుల గుర్రు

- ప్రభుత్వ నిర్ణయాల వెల్లడిలో ద్వంద్వ వైఖరిపై ఆగ్రహం
- తమకు చెప్పేదొకటి, బయట చేసేది మరొకటి అంటూ ఫైర్
- ప్రజల దృష్టిలో తమను చులకన చేస్తున్నారంటూ ఆవేదన
- కీలక నిర్ణయాల్లో భాగస్వామ్యం చేయట్లేదని మండిపాటు
- మంత్రులుగా ఉండీ ప్రయోజనం ఏమిటని ఆవేదన
- నేతల మధ్య అగాథంపై కాంగ్రెస్ వర్గాల్లో జోరుగా చర్చ

హైదరాబాద్, సెప్టెంబర్ 16 (నమస్తే తెలంగాణ): సీఎం రేవంత్‌రెడ్డిపై ఆయన క్యాబినెట్ సహచరులు గుర్రుగా ఉన్నారంటూ గాంధీభవన్‌లో చర్చ జోరందుకున్నది. తమను మంత్రులుగా పరిగణించడం లేదంటూ సన్నిహితుల వద్ద వారు గోడు వెళ్లబోసుకుంటున్నట్టు చెప్తున్నారు. ప్రజల దృష్టిలో తమను పిచ్చోళ్లను చేస్తూ ఆయన మాత్రం హీరో కావాలనుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారట. ఇందుకు పలు సంఘటనలను ఉదహరిస్తున్నారు. ముఖ్యమంత్రి లోపల తమతో చర్చించేది ఒకటి.. బయట ప్రకటించేది, అమలు చేసేది మరొకటని వాపోతున్నారు. ప్రభుత్వం ఏర్పడిన తర్వాత డీజీపీ నియామకంపై సీఎం రేవంత్‌రెడ్డి పలువురు మంత్రులతో కీలక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి సీవీ ఆనంద్ పేరును ప్రస్తావించగా మంత్రులంతా అందుకు అంగీకరించినట్టు సమాచారం. కానీ ఆ మరుసటి రోజు డీజీపీగా జితేందర్‌ను నియమిస్తూ ఉత్తర్వులు › 3వ పేజీలో



కంప్యూటర్‌ను పుట్టించిందే రాజీవ్‌గాంధీ!

ఆయన కంప్యూటర్‌ను పరిచయం చేయకుంటే ఐటీ శాఖనే లేకపోవు

కేటీఆర్ ఐటీ మంత్రి కాకపోవు

రాజీవ్‌గాంధీ విగ్రహావిష్కరణ సభలో సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్, సెప్టెంబర్ 16 (నమస్తే తెలంగాణ) : కంప్యూటర్‌ను పుట్టించిందే మాజీ ప్రధాన మంత్రి రాజీవ్‌గాంధీ అని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. సెల్‌ఫోన్లు, కంప్యూటర్‌ను మన దేశానికి పరిచయం చేసింది ఆయనే అని, దేశంలో సాంకేతిక విప్లవాన్ని తీసుకొచ్చిన ఘనత రాజీవ్‌గాంధీకే దక్కుతుందని చెప్పారు. సచివాలయం ఎదుట ప్రభుత్వం ఏర్పాటు చేసిన రాజీవ్ గాంధీ విగ్రహాన్ని సోమవారం సీఎం రేవంత్‌రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో సీఎం మాట్లాడుతూ గాంధీల కుటుంబానిది త్యాగాల చరిత్ర అని కొనియాడారు. జవహర్‌లాల్ నెహ్రూ దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడి, పదేండ్లు జైలులో ఉన్నారని గుర్తుచేశారు. ప్రధానిగా 563 సంస్థానాలను దేశంలో విలీనం చేయించి దేశ సమగ్రతను కాపాడారని చెప్పారు. విద్య, సాగునీటి రంగాలను మొదటి ప్రాధాన్యతగా తీసుకుని దేశ భవిష్యత్తుకు పునాదులు వేశారన్నారు. నెహ్రూ బతికి ఉండగా ఇందిరా గాంధీ ఏ పదవీ తీసుకోలేదని, ఆమె మరణం తర్వాత రాజీవ్ గాంధీ ప్రధాని అయ్యారని చెప్పారు. రాజీవ్ గాంధీ మరణించిన తర్వాత 2004-14 మధ్య సోనియా గాంధీ ఏ పదవీ తీసుకోలేదని గుర్తుచేశారు. 'రాజీవ్‌గాంధీ కంప్యూటర్‌ను పరిచయం చేయకపోయి ఉంటే ఐటీ శాఖ అనేదే లేకపోవు.. కేటీఆర్ ఐటీ శాఖ మంత్రే కాకపోవు..' అని పేర్కొన్నారు. సచివాలయంలో డిసెంబర్ 9లోగా తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని వివరించారు. కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి దీపా దాస్ మున్షి, మంత్రులు, ఎమ్మెల్యేలు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

అస్థిత్వంతో పెట్టుకుంటే రాజకీయ సమాధే

- కాంగ్రెస్ సర్కారు చర్యకు నేడు నిరసన
- తెలంగాణ తల్లి విగ్రహాలకు క్షీరాభిషేకాలు
- బీఆర్ఎస్ అధికారంలోకి రాగానే సకల మర్యాదలతో గాంధీభవన్‌కు రాజీవ్ విగ్రహం

హైదరాబాద్, సెప్టెంబర్ 16 (నమస్తే తెలంగాణ): సచివాలయం, తెలంగాణ అమరజ్యోతి మధ్యలో ఉండాల్సిన తెలంగాణ తల్లి విగ్రహం స్థానంలో కాంగ్రెస్ ప్రభుత్వం రాజీవ్‌గాంధీ విగ్రహం పెట్టటంపై బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఇది తెలంగాణ అస్తిత్వాన్ని తాకట్టు పెట్టే సిగ్గుమాలిన చర్యగా అభివర్ణించారు. రేవంత్‌రెడ్డి చర్యకు నిరసనగా మంగళవారం రాష్ట్రంలోని అన్ని తెలంగాణ తల్లి విగ్రహాలకు క్షీరాభిషేకాలు నిర్వహించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. తెలంగాణ తల్లిని అవమానించేలా కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన ఈ చర్యను ఎక్కడికక్కడ పార్టీ శ్రేణులు సహా తెలంగాణ వాదులంతా వ్యతిరేకిస్తూ నిరసన తెలపాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణ తల్లి విగ్రహం ఉండాల్సిన చోట రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేయడం ఏమిటని తెలంగాణ సమాజం ఆవేదన వ్యక్తం చేస్తున్నదని తెలిపారు. చేసిన తప్పును రేవంత్‌రెడ్డి సరిదిద్దుకోవాలని సూచించారు. లేదంటే తెలంగాణ ప్రజలు సరైన సమయంలో బుద్ధి చెప్పడం ఖాయమని హెచ్చరించారు.

గాంధీభవన్‌కు రాజీవ్ విగ్రహం తరలిస్తాం

కాంగ్రెస్ ప్రభుత్వం రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని పెట్టుకోవాలనుకుంటే తమకు ఎలాంటి అభ్యంతరం లేదని, అయితే, తెలంగాణ తల్లి విగ్రహాన్ని పెట్టాల్సిన స్థలంలో రాజీవ్ విగ్రహాన్ని ఏర్పాటు చేయడాన్నే తాము వ్యతిరేకిస్తున్నామని కేటీఆర్ స్పష్టం చేశారు. తెలంగాణ సచివాలయం, అమరజ్యోతి మధ్యలో తెలంగాణ తల్లి విగ్రహం ఉండాలని 2023 జూలైలోనే కేసీఆర్ ఈ స్థలాన్ని ఎంపిక చేశారని గుర్తుచేశారు. కేసీఆర్ ఎంపిక చేసిన స్థలానికి తెలంగాణ సమాజం యావత్తు ఆమోదం తెలిపిందని పేర్కొన్నారు. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం కుసంస్కారంతో తెలంగాణ ఉద్యమానికి సంబంధంలేని వ్యక్తి విగ్రహాన్ని ఆ స్థలంలో ఏర్పాటు చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ తన చర్యతో తెలంగాణలోని ప్రతి వ్యక్తిని గాయపర్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని తొలగించి సకల మర్యాదలతో గాంధీభవన్‌కు తరలిస్తామని చెప్పారు.

తెలంగాణ ఆత్మను ఢిల్లీకి తాకట్టు పెడతారా?

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే తెలంగాణ ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టి ఢిల్లీకి బానిసత్వం చేస్తారని తాము ముందునుంచే చెప్పామని కేటీఆర్ గుర్తుచేశారు. రేవంత్‌రెడ్డి సరిగ్గా ఇప్పుడు అదే పనిచేస్తున్నారని పేర్కొన్నారు. ఢిల్లీ బాసుల మెప్పు కోసమే తెలంగాణను ఆత్మను తాకట్టు పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రజలు, తెలంగాణ మనోభావాల కన్నా ఢిల్లీ బాసుల మెప్పు పొందడమే కాంగ్రెస్‌కు పాలకులకు ముఖ్యమైపోయిందని దుయ్యబట్టారు. రేవంత్‌రెడ్డి చర్యను యావత్తు తెలంగాణ సమాజం చీదరించుకుంటున్నా సిగ్గు లేకుండా తెలంగాణ తల్లిని అవమానిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

తెలంగాణ అస్తిత్వంతో పెట్టుకుంటే..

తెలంగాణ అస్తిత్వం, తెలంగాణ ప్రజల ప్రయోజనాల కన్నా కాంగ్రెస్ నాయకులకు స్వప్రయోజనాలే ముఖ్యమైపోయాయని కేటీఆర్ మండిపడ్డారు. తెలంగాణ ఉద్యమకారులమంటూ గొప్పలు చెప్పుకునే కాంగ్రెస్ నాయకులంతా ఢిల్లీకి గులాములేనని తేలిపోయిందని పేర్కొన్నారు. తెలంగాణ ప్రజలా? ఢిల్లీ బాసులా? అంటే కాంగ్రెస్ నాయకులంతా ఢిల్లీ బాసులకే జీ హుజూర్ అంటారనే విషయం మరోసారి స్పష్టమైందని తెలిపారు. తెలంగాణ అస్తితత్వంతో పెట్టుకున్న వాళ్లెవరు రాజకీయంగా బతికి బట్టకట్టలేదని హెచ్చరించారు. మన ప్రాంతంవాడే మన అస్తిత్వతాన్ని దెబ్బ తీస్తుంటే తెలంగాణ ప్రజలు వారికి రాజకీయంగా సమాధి తవ్వడం ఖాయమని స్పష్టం చేశారు.

నేడు జాతీయ సమైక్యత వేడుకలు

హైదరాబాద్ సంస్థానం దేశంలో విలీనమైన సందర్భాన్ని పురస్కరించుకొని బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మంగళవారం జాతీయ సమైక్యత దినోత్సవాన్ని నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలంగాణ భవన్‌లో జాతీయ జెండాను ఆవిష్కరిస్తారు. బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నేతలు హాజరవుతారు. మరోవైపు ప్రభుత్వం ప్రజాపాలన దినోత్సవంతో వేడుకలు నిర్వహిస్తున్నది. పబ్లిక్ గార్డెన్స్‌లో జరిగే వేడుకల్లో సీఎం రేవంత్‌రెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తారు. కేంద్ర ప్రభుత్వం తెలంగాణ విమోచన దినోత్సవం పేరుతో పరేడ్ గ్రౌండ్స్‌లో వేడుకలు నిర్వహించనున్నది.

ఆర్ఆర్ ట్యాక్స్‌పై చర్యలేవీ

ఆర్ఆర్ ట్యాక్స్‌పై చర్యలు ఏమయ్యాయని ప్రధాని నరేంద్రమోదీని కేటీఆర్ ప్రశ్నించారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం పెద్ద ఎత్తున అవినీతికి పాల్పడుతున్నదని నాలుగు నెలల క్రితం ప్రధాని మోదీ చేసిన వ్యాఖ్యలను ఈ సందర్భంగా కేటీఆర్ గుర్తుచేస్తూ ఎక్స్ వేదికగా నిలదీశారు. తెలుగులో తీసిన ట్రిపుల్ ఆర్ కలెక్షన్ల కన్నా 'డబుల్ ఆర్ ట్యాక్స్' కలెక్షన్ ఎక్కువ అయిందని ఆరోపించిన ప్రధాని ఆ ట్యాక్స్‌పై చర్యలు తీసుకునేందుకు ఎవరు అడ్డుపడుతున్నారని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వ అవినీతిపై కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ పల్లెత్తు మాట ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు.

ఉచిత విద్యుత్తు అంటే ఇదేనా?

సూర్యాపేట జిల్లా మోతే మండలం మామిండ్లగూడెంలో 16 రోజులుగా విద్యుత్తు సరఫరా లేకపోవడంపై కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ప్రభుత్వ పనితీరుకు మామిండ్లగూడెంలో నెలకొన్న చీకటే సంకేతమని పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఉచిత విద్యుత్తుకు ఇది నిదర్శనమని ఎద్దేవా చేశారు. కనీసం ఇప్పటికైనా ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్క కల్పించుకొని మామిండ్లగూడెం ప్రజల కరెంట్ కష్టాలు తీర్చాలని డిమాండ్ చేశారు.



బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను కలిసిన ఎమ్మెల్సీ మధుసూదనాచారి, ఎమ్మెల్యే మాణిక్‌రావు, రాజ్యసభ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, మాజీ ఎమ్మెల్యేలు సండ్ర వెంకటవీరయ్య, బాల్క సుమన్, గాదరి కిశోర్, పార్టీ నేత రాకేశ్‌రెడ్డి

సిరికొండకు కేటీఆర్ శుభాకాంక్షలు

శాసనమండలిలో బీఆర్ఎస్‌పక్ష నేతను సిరికొండ మధుసూదనాచారికి పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్సీ సిరికొండను శాసనమండలిలో విపక్షనేతగా గుర్తించాలని శాసనసభా కార్యదర్శికి పార్టీ అధినేత కేసీఆర్ గతంలో లేఖ రాయడం, అందుకు అనుగుణంగా గుర్తింపు ఇవ్వడం తెలిసిందే. ఈ నేపథ్యంలో సోమవారం హైదరాబాద్ నందినగర్‌లోని కేటీఆర్ నివాసంలో ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్యే మాణిక్‌రావు, మాజీ ఎమ్మెల్యేలు సండ్ర వెంకటవీరయ్య, బాల్క సుమన్, గాదరి కిశోర్, పార్టీ నేత రాకేశ్‌రెడ్డి తదితరులు కేటీఆర్‌తో సమావేశం అయ్యారు. తాజా పరిణామాలపై చర్చించారు.


తెలంగాణకు బీఆర్ఎస్సే శ్రీరామ రక్ష

తెలంగాణ అస్తిత్వం, తెలంగాణ ప్రయోజనాల విషయంలో బీఆర్ఎస్ మాత్రమే రాజీలేని పోరాటం చేస్తుందని కేటీఆర్ తేల్చిచెప్పారు. ఢిల్లీ బాసుల మెప్పు కోసం కాకుండా తెలంగాణ ప్రజల ప్రయోజనాల కోసం బీఆర్ఎస్ ముందు నిలబడుతుందని తెలిపారు. ఎప్పటికైనా తెలంగాణకు బీఆర్ఎస్సే శ్రీరామరక్ష అని పేర్కొన్నారు.

సలాం...కాళేశ్వరం

నమస్తే తెలంగాణ కథనాన్ని కేటీఆర్ ట్యాగ్

హైదరాబాద్, సెప్టెంబర్ 16 (నమస్తే తెలంగాణ): తెలంగాణ రైతన్నకు కాళేశ్వరం వెయ్యి ఏనుగుల బలం అని కేటీఆర్ పేర్కొన్నారు. 'నాడు..నేడు.. ఏనాడైనా తెలంగాణ రైతన్నకు వెయ్యి ఏనుగుల బలం కాళేశ్వరం. భారీ వరదలనే కాదు బురద రాజకీయాలను తట్టుకుని నిలబడిన కాళేశ్వరం ప్రాజెక్టుకు సలాం' అని ఆయన ఎక్స్ చేశారు. ఈ మేరకు 'నమస్తే తెలంగాణ' ప్రచురించిన 'కూలిందెక్కడ? మింగిందెవరు?' అనే ప్రత్యేక కథనాన్ని ఆయన ఎక్స్‌వేదికగా ట్యాగ్ చేశారు. 'దశాబ్దాల సాగునీటి కష్టాలను తీర్చి అన్నదాతల కన్నీళ్లను తుడుస్తున్నందుకు యావత్ తెలంగాణ సమాజం పక్షాన కాళేశ్వరం ప్రాజెక్టుకు సెల్యూట్' అని పేర్కొన్నారు.



వానకాలం

	గరిష్ఠం	కనిష్ఠం
ఆదిలాబాద్	35.2°c	23.4°c
మెదక్	34.7°c	21.7°c
రంగారెడ్డి	33.0°c	21.6°c
ఖమ్మం	33.0°c	22.0°c
నిజామాబాద్	31.1°c	23.6°c
వరంగల్	31.0°c	24.0°c
కరీంనగర్	31.0°c	25.0°c
నల్లగొండ	31.0°c	24.0°c
మహబూబ్‌నగర్	30.3°c	22.1°c
హైదరాబాద్	30.2°c	23.5°c



రాష్ట్ర సచివాలయం వద్ద తెలంగాణ తల్లి విగ్రహం స్థానంలో రాజీవ్ గాంధీ విగ్రహం పెట్టడంపై నిరసనలు వ్యక్తమవుతున్నాయి. సిద్దిపేట జిల్లా పట్టణంలోని రంగధాంపల్లి అమరవీరుల స్థూపం వద్ద నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపి, తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేసిన బీఆర్ఎస్వీ నాయకులు



తెలంగాణ ఆత్మ.. ఢిల్లీకి తాకట్టు

- కేసీఆర్ ఆ ప్రాంతాన్ని పవిత్ర భూమిగా చేయాలనుకున్నరు
- తెలంగాణ తల్లి విగ్రహ ఏర్పాటుకు 2023 జూన్‌లోనే డిజైన్
- కేసీఆర్ నిర్మించారనే అంబేద్కర్ ఫొటో గ్యాలరీకి తాళం
- మాజీ మంత్రి ప్రశాంత్‌రెడ్డి మండిపాటు



తెలంగాణభవన్‌లో సోమవారం మాట్లాడుతున్న మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి

హైదరాబాద్, సెప్టెంబర్ 16 (నమస్తే తెలంగాణ): తెలంగాణ తల్లి విగ్రహం ఉండాల్సిన చోట రాజీవ్ గాంధీ విగ్రహం పెట్టడమంటే తెలంగాణ తల్లిని అవమానించైనా సరే.. ఢిల్లీ బాస్‌లు, సోనియా మెప్పు పొందాలనే ఆతృత రేవంత్‌రెడ్డిలో కనిపిస్తున్నదని మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి మండిపడ్డారు. తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీకలైన బీఆర్ అంబేద్కర్ తెలంగాణ సచివాలయం, తెలంగాణ అమరుల స్ఫూర్తికి ప్రతీక అయిన అమరజ్యోతి కట్టడం మధ్య లో తెలంగాణకు సంబంధమే లేని ఓ పార్టీకి చెందిన రాజీవ్ గాంధీ విగ్రహం పెట్టడం శోచనీయమని విచారం వ్యక్తంచేశారు. తెలంగాణ మేధావులు, కవులు, కళాకారులు వద్దన్నా వినకుండా కేవలం తన ఢిల్లీ బాసులను ప్రసన్నం చేసుకునేందుకు తెలంగాణ ఆత్మను తాకట్టు పెట్టరని ఆగ్రహం వ్యక్తంచేశారు. రేవంత్‌రెడ్డికి ఏనాడూ తెలంగాణ సోయి లేదని, అందుకే ఒక పార్టీ వ్యక్తి విగ్రహాన్ని సచివాలయం, అమరజ్యోతి మధ్య ఏర్పాటు చేస్తున్నారని ఆక్షేపించారు. బీఆర్ఎస్ నేతలు సోమ భరత్‌కుమార్, చిరుమల్ల రాకేశ్‌కుమార్‌తో కలిసి తెలంగాణ భవన్‌లో సోమవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. తెలంగాణ ఆత్మను తెలిపేలా సచివాలయం, అమరజ్యోతి మధ్య తెలంగాణ తల్లి విగ్రహాన్ని ప్రతిష్ఠించి ఆ ప్రాంతాన్ని పవిత్ర భూమిగా మార్చాలనే సదాశయంతో కేసీఆర్ డిజైన్‌ను రూపొందించారని తెలిపారు. ఈ స్థలంలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని పెట్టాలని 2023 జూన్, జూలైలోనే కేసీఆర్ ప్లాన్ చేశారని, ఎకరం కంటే ఎక్కువ స్థలంలో అక్కడ తెలంగాణ తల్లి విగ్రహం రెండు వైపులా ఫౌంటెయిన్లు, ప్లాజా ఏర్పాటు చేయాలని భావించారని గుర్తుచేశారు. ల్యాండ్ స్కేపింగ్, పోలీస్‌స్టేషన్, ఫుడ్ కోర్ట్స్, బస్‌స్టాప్ కట్టాలని అనుకున్నారని, డిజైన్లు కూడా సిద్ధమయ్యాక ఎన్నికల కోడ్ రావడంతో సాధ్యం కాలేదని చెప్పారు.

> "తెలంగాణ తల్లిని అవమానించి అయినా సోనియా మెప్పు పొందాలని రేవంత్‌రెడ్డి ఆతృతపడుతున్నడు. అందుకే తెలంగాణకు ఏమాత్రం సంబంధం లేని రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని సచివాలయం, అమరజ్యోతి మధ్యన పెట్టిండు.
>
> **- వేముల ప్రశాంత్‌రెడ్డి**

> "అమరజ్యోతిని ప్రారంభించి ఏడాది గడిచినా సందర్శకులకు అనుమతిస్తలేరు. అమరుల త్యాగాలను ప్రజలకు తెలియకుండా చేస్తున్నరు. కేసీఆర్ నిర్మించారన్న కారణంతోనే అంబేద్కర్ విగ్రహం వద్ద ఫొటో గ్యాలరీని ఎవరూ సందర్శించకుండా తాళం వేశారు.
>
> **- వేముల ప్రశాంత్‌రెడ్డి**

అమరుల త్యాగం ప్రజలకు తెలియకుండా అడ్డు

తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఎందరో అసువులు బాసారని, వారిని నిత్యం స్మరించుకునేలా సచివాలయం ఎదురుగా అమరజ్యోతిని మూడున్నర ఎకరాల్లో ఏర్పాటు చేశామని వేముల వివరించారు. హైదరాబాద్ వచ్చే పర్యాటకులు, విదేశీయులు, ఢిల్లీలో బాపు ఘాట్, రాజ్ ఘాట్ తరహా దీన్ని సందర్శించి నివాళులర్పించేలా రూపొందించారని చెప్పారు. 2.88 లక్షల చదరపు అడుగుల్లో ఆరు ఫ్లోర్లతో నిర్మించినట్టు తెలిపారు. అమరుల ఫొటోలు, వారి జ్ఞాపకాలు, మీటింగ్ హాల్, క్యాంటిన్ తదితరాలు ఉండేలా ప్రణాళిక చేశామని, ప్రపంచంలో ఇలాంటి నిర్మాణాలు మూడే ఉన్నాయని చెప్పారు. ఒకటి చికాగో బీన్, రెండోది దుబాయ్ మ్యూజియం, మూడోది అమరవీరుల జ్యోతి అని, ఆ రెండింటి కంటే అద్భుతంగా అమరజ్యోతిని రూపొందించామని వివరించారు. నిరంతరం వెలిగే జ్యోతిలా వారి త్యాగాలు తెలంగాణ సమాజం గుండెల్లో వెలుగుతూనే ఉండాలని ఇలా నిర్మించినట్టు చెప్పారు. దాన్ని ప్రారంభించి ఏడాది గడిచినా ఇంతవరకు సందర్శకులకు అనుమతి ఇవ్వడంలేదని, అమరుల త్యాగాలను ప్రజలకు తెలియకుండా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో అమరుల కుటుంబాలను రెచ్చగొట్టి, వారిని రాజకీయంగా వాడుకున్నారని, రేవంత్‌రెడ్డి భేషజాలకు పోకుండా ఒకసారి అమరవీరుల జ్యోతిని సందర్శించాలని, సందర్శకులను అనుమతించాలని సూచించారు.

కేసీఆర్ నిర్మించారనే ఫొటో గ్యాలరీకి తాళం

తెలంగాణ ఏర్పాటుకు కారణమైన రాజ్యాంగాన్ని రాసిన బీఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని 125 అడుగుల ఎత్తుతో ఏర్పాటు చేశామని ఇది ప్రపంచంలోనే అతి పెద్దదని వేముల గుర్తుచేశారు. సందర్శకులకు సౌకర్యాలు కల్పించడంతో పాటు అంబేద్కర్ గురించి తెలిపే అన్ని ఏర్పాట్లు చేశామని, భావితరాలు స్ఫూర్తి పొందేలా హైదరాబాద్ నడిబొడ్డున నెక్లెస్‌రోడ్‌లో నెలకొల్పామని చెప్పారు. ఫొటో గ్యాలరీ కూడా ఏర్పాటు చేశామని, కేసీఆర్ నిర్మించారన్న కారణంతో దీనికి తాళం వేశారని ఆక్షేపించారు. అంబేద్కర్ జయంతి రోజున కూడా రేవంత్‌రెడ్డి అక్కడికెళ్లి నివాళులర్పించలేదని తెలిపారు. ప్రభుత్వ పరంగా ఎలాంటి ఏర్పాట్లు చేయలేదని, కనీసం పూలదండ కూడా వేయలేదని, ప్రజలను అనుమతించలేదని మండిపడ్డారు.

> "కేసీఆర్ ఆనవాళ్లను చెరిపేయ్యడం సీఎం రేవంత్‌రెడ్డి తరం కాదు.. కేసీఆర్ కట్టిన సెక్రటేరియట్, కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో రేవంత్‌రెడ్డి కూర్చుంటున్నడు. కేసీఆర్ చేసిన మంచిని కొనసాగించవద్దని రేవంత్‌రెడ్డి కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నడు.
>
> **- వేముల ప్రశాంత్‌రెడ్డి**

కేసీఆర్ ఆనవాళ్లను చెరిపెయ్యలేరు

కేసీఆర్ ఆనవాళ్లను చెరిపేయ్యాలని రేవంత్‌రెడ్డి ప్రయత్నిస్తున్నారని, కానీ అది సాధ్యం కాదని వేముల స్పష్టంచేశారు. కేసీఆర్ కట్టిన సెక్రటేరియట్, కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో రేవంత్‌రెడ్డి కూర్చుంటున్నారని గుర్తుచేశారు. కేసీఆర్ చేసిన మంచిని కొనసాగించవద్దని రేవంత్‌రెడ్డి కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక తెలంగాణ తల్లి గౌరవాన్ని పెంచేలా చర్యలు తీసుకుంటామని స్పష్టంచేశారు. కేసీఆర్ కట్టించిన అన్నింటినీ వాడకంలోకి తేవాలని లేదంటే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పోరుబాట తప్పదని హెచ్చరించారు. రేవంత్‌రెడ్డి నియంతృత్వాన్ని, అరాచకాలను మేధావులు, బుద్ధిజీవులు ఖండించాలని కోరారు.

తెలంగాణ ఆత్మాభిమానంపై దెబ్బ

కాంగ్రెస్‌లో ప్రతిష్ట కోసమే రాజీవ్ విగ్రహం

ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల



హైదరాబాద్, సెప్టెంబర్ 16 (నమస్తే తెలంగాణ) : కాంగ్రెస్ అధిష్ఠానం అడుగులకు మడుగులొత్తుతూ పార్టీలో ప్రతిష్ట పెంచుకునేందుకే సీఎం రేవంత్‌రెడ్డి సచివాలయం ఎదుట రాజీవ్ గాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేశారని, తెలంగాణ ఉద్యమం, చరిత్ర, సంస్కృతితో ఎలాంటి సంబంధంలేని రాజీవ్ విగ్రహాన్ని పెట్టి తెలంగాణ ప్రజల ఆత్మాభిమానంపై దెబ్బకొట్టారని ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ విమర్శించారు. ప్రజల మనోభావాలకు విరుద్ధంగా సచివాలయం ఎదుట రాజీవ్ విగ్రహాన్ని పెట్టి పరోక్షంగా ఆయనను కూడా రేవంత్ అవమానించాడని సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సోనియా గాంధీని బలిదేవత అని తిట్టిన రేవంత్‌రెడ్డి, ఇప్పుడు ఆమె మెప్పుకోసం రాజీవ్ విగ్రహం ఏర్పాటు చేసే ఎత్తుగడవేశారని ఆరోపించారు. 'తెలంగాణ తల్లి విగ్రహాన్ని బీఆర్ఎస్ ఏర్పాటు చేయలేదు అంటున్న ముఖ్యమంత్రీ.. స్వరాష్ట్ర ఉద్యమం నుంచి ప్రతి గ్రామం, ప్రతి రాస్తాలో మేం తెలంగాణ తల్లి విగ్రహాన్ని ప్రతిష్ఠించినం' అని గుర్తుచేశారు. ఉమ్మడి పాలన ముగిసిన సందర్భంగా తెలంగాణ సచివాలయం ఎదుట తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఘనంగా ప్రతిష్ఠించాలనుకున్నామని, ఇందుకు ప్రణాళికలు కూడా పూర్తయ్యాయని, ఎన్నికల కోడ్ కారణంగా ప్రక్రియ ఆగిపోయిందని తెలిపారు. ఎవరెన్ని చెప్పినా రాజీవ్‌గాంధీ విగ్రహం తెలంగాణ ప్రజల కండ్లలో నలుసులా మిగిలిపోతుందని ఎద్దేవాచేశారు.

గాంధీలు దూరం

మొదటిపేజీ తరువాయి...

దీపాదాస్ మున్షీ తప్ప ఏఐసీసీ నుంచి ప్రతినిధులు కూడా హాజరు కాలేదంటున్నారు. దీనినిబట్టి రాజీవ్ గాంధీ విగ్రహావిష్కరణను ఢిల్లీ పెద్దలు లైట్ తీసుకున్నారని అర్థమవుతున్నదని అన్నారు.

నాలుగైదు సార్లు పిలిచినా..

సీఎం రేవంత్‌రెడ్డి గత తొమ్మిది నెలల్లో 21సార్లు ఢిల్లీ వెళ్లి వచ్చారు. ఈ క్రమంలో రాజీవ్‌గాంధీ విగ్రహావిష్కరణకు రావాలని ప్రత్యేకంగా నాలుగైదు సార్లు రాహుల్ గాంధీని, సోనియాగాంధీని ఆహ్వానించారని కాంగ్రెస్ వర్గాలు చెప్తున్నాయి. సీఎం పలుమార్లు ఢిల్లీలో మీడియాతో చిట్‌చాట్ సందర్భంగా కూడా ఈ విషయాన్ని చెప్పారు. కానీ వారు ఎప్పుడూ సానుకూలంగా స్పందించలేదన్న ప్రచారం జరుగుతున్నది. వాస్తవానికి సచివాలయం ముందు విగ్రహం ఏర్పాటుపై ఢిల్లీ పెద్దలు మొదటి నుంచీ అసంతృప్తితో ఉన్నట్టు చెప్పుకుంటున్నారు. తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటుకోసం గుర్తించిన స్థలంలో రాజీవ్ విగ్రహం పెడుతుండటంపై ఫిర్యాదులు వెల్లువెత్తాయని, పార్టీలోనూ భిన్న స్వరాలు వినిపించాయని, దీంతో ప్రజల సెంటిమెంట్‌కు వ్యతిరేకంగా వెళ్తున్నామనే భావన వారిలో ఏర్పడిందని చెప్పుకుంటున్నారు. దీనికితోడు పాలనలో సీఎం రేవంత్‌రెడ్డి విఫలం కావడంతో సంబంధాలు కూడా దెబ్బతిన్నాయని అంటున్నారు. అందువల్లనే విగ్రహావిష్కరణకు పిలిచినా సోనియా, రాహుల్, ప్రియాక రాలేదని చెప్తున్నారు.

సందట్లో సడేమియా మాదిరిగా!

ఢిల్లీతో దెబ్బతిన్న సంబంధాలను తిరిగి గాడిలో పెట్టేందుకు సీఎం రేవంత్‌రెడ్డి విశ్వ ప్రయత్నాలు చేస్తున్నట్టు కాంగ్రెస్ వర్గాలు చెప్తున్నాయి. దీనికి రాజీవ్ గాంధీ విగ్రహావిష్కరణను వేదికగా చేసుకుందామని భావించారని అంటున్నారు. ఆగస్టు 20న రాజీవ్ గాంధీ జయంతి. అప్పటికే విగ్రహం పనులు పూర్తయ్యాయి. కానీ బూమరాంగ్ అయ్యిందని చర్చ జరుగుతున్నది. తాను పిలిచినా ఢిల్లీ పెద్దలు వచ్చే అవకాశం లేకపోవడం, విగ్రహావిష్కరణతో కొత్తగా వచ్చే మైలేజీ లేకపోవడం.. పైగా వేరే రోజుల్లో విగ్రహావిష్కరణ జరిపితే గాంధీ కుటుంబం ఎందుకు రాలేదన్న ప్రశ్నలు ఎదురవుతాయన్న ప్రశ్నల నేపథ్యంలో సోమవారాన్ని ఎంపిక చేసుకున్నట్టు చర్చ జరుగుతున్నది. సోమవారం మిలాద్ ఉన్ నబీ పండుగ జరుపుకొంటున్నారు. మరోవైపు రాష్ట్రవ్యాప్తంగా సోమవారం, మంగళవారం వినాయక నిమజ్జనాల హడావుడి ఉంటుంది. వరుసగా నాలుగు రోజులుగా సెలవులు రావడంతో ప్రజల దృష్టి ప్రభుత్వంపై లేదు. ఈ సందర్భంలోనే సందట్లో సడేమియా మాదిరిగా విగ్రహావిష్కరణ చేశారని చెప్పుకుంటున్నారు.

బడిని బతికించండి

- తరగతి గది మూలాన్ని నాశనం చేయొద్దు
- విద్యావ్యవస్థను తక్షణం గాడిలో పెట్టండి
- గురుకులాలను అపఖ్యాతిపాలుచేయొద్దు
- సంక్షోభ హాస్టళ్లుగా మారిన సంక్షేమ హాస్టళ్లు
- సీఎం రేవంత్‌రెడ్డికి హరీశ్‌రావు లేఖ



హైదరాబాద్, సెప్టెంబర్ 16 (నమస్తే తెలంగాణ): దేశ భవిష్యత్ తరగతి గదిలోనే నిర్మితం అవుతుందన్న మాటలకు కేసీఆర్ అక్షర రూపం ఇస్తే, రేవంత్‌రెడ్డి మాత్రం వెన్నెముకనే విరిచేస్తున్నారని మాజీ మంత్రి హరీశ్‌రావు ఆరోపించారు. విద్యావ్యవస్థను కేసీఆర్ బలోపేతం చేస్తే, రేవంత్‌రెడ్డి బలహీనం చేస్తున్నారని మండిపడ్డారు. రేవంత్‌రెడ్డి పాలనలో ప్రభుత్వ విద్యా వ్యవస్థ పతనావస్థకు చేరుకున్నదని మండిపడ్డారు. ఈ మేరకు ఆయన సోమవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి బహిరంగ లేఖ రాశారు. నేడు రాష్ట్రంలో పురుగులు లేని భోజనం కోసం, పాముకాట్లు, ఎలుక కాట్లు లేని వసతి కోసం, కనీస సౌకర్యాల కల్పన కోసం తరగతి గదుల్లో ఉండాల్సిన విద్యార్థులు రోడ్లెక్కి నిరసనలు తెలియజేస్తున్న దయనీయ పరిస్థితి నెలకొన్నదని విమర్శించారు. ఒకవైపు టీచర్లు లేని కారణంగా బడులు మూతబడుతుంటే, మరోవైపు ప్రభుత్వ బడుల మీద విశ్వాసం సన్నగిల్లడంతో డ్రాపౌట్స్ పెరిగిపోతున్నాయని ఉదహరించారు. ప్రభుత్వ లెక్కల ప్రకారమే ఈ విద్యా సంవత్సరంలో ఒక్క విద్యార్థి కూడా లేని పాఠశాలలు 1,864 ఉంటే, 30లోపు విద్యార్థులు ఉన్న పాఠశాలలు 9,447 ఉన్నాయని, వందలోపు విద్యార్థులు మాత్రమే ఉన్న పాఠశాలలు 9,609 ఉన్నాయని వివరించారు. రేవంత్‌రెడ్డి పాలనలో మొత్తం 26,287 పాఠశాలలకుగాను దాదాపు 20 వేల పాఠశాలల పరిస్థితి అగమ్యగోచరంగా మారిందని దుయ్యబట్టారు.

గురుకులాలను అపఖ్యాతిపాలు చేయొద్దు

ప్రభుత్వ పాఠశాలల స్థితి రోజురోజుకు దిగజారుతుంటే, గురుకులాల పరిస్థితి మరింత అధ్వాన్నంగా మారిందని హరీశ్‌రావు విమర్శించారు. కేసీఆర్ పాలనలో ఎవరెస్ట్ శిఖరమంత ఖ్యాతి గడించిన గురుకులాలు, రేవంత్‌రెడ్డి పాలనలో సమస్యలకు నిలయాలుగా మారాయని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం తొమ్మిదేండ్లలో పటిష్టపరిచిన గురుకులాలను కాంగ్రెస్ ప్రభుత్వం తొమ్మిది నెలల్లోనే ధ్వంసం చేసిందని ఆరోపించారు. సంక్షేమ హాస్టళ్లను సంక్షోభ హాస్టళ్లుగా మార్చిన ఘనత రేవంత్ సర్కార్‌కే దక్కిందని ఎద్దేవా చేశారు. పాఠశాల నుంచి కళాశాల వరకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ఏ హాస్టల్ చూసినా దుర్భర పరిస్థితులే దర్శనమిస్తున్నాయని వివరించారు. ఈ విద్యా సంవత్సరంలో ఇప్పటివరకు 715 మందికిపైగా విద్యార్థులు దవాఖానల పాలు కాగా, 40 మందికిపైగా ప్రాణాలు కోల్పోయారని, ఇది అత్యంత బాధాకరమని, అయినా ప్రభుత్వానికి పట్టింపు లేదని విమర్శించారు.


వీటిపై తక్షణం దృష్టిపెట్టండి

హరీశ్‌రావు పేర్కొన్న సమస్యలు ఇవి..

- ఈ విద్యా సంవత్సరంలోనే దాదాపు 1,900 పాఠశాలలు మూతపడ్డాయి. వాటిని తిరిగి ప్రారంభించాలి.
- ఖాళీల్లో విద్యావాలంటీర్లను నియమించి విద్యా బోధన జరిగేలా చూడాలి.
- పాఠశాలల్లో పారిశుద్ధ్యం లోపించింది. తాగునీటి వసతి లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. తక్షణమే ఈ సమస్యలను పరిష్కరించాలి.
- సీఎం బ్రేక్‌ఫాస్ట్ స్కీంను పునః ప్రారంభించి, డ్రాపౌట్స్ తగ్గేలా చూడాలి.
- పెండింగ్ లో ఉన్న మధ్యాహ్న భోజన బిల్లులు వెంటనే విడుదలచేయాలి.
- ఔట్ సోర్సింగ్ టీచింగ్, నాన్‌టీచింగ్ ఉద్యోగుల జీతాలు వెంటనే చెల్లించాలి.
- వసతి గృహాల అద్దెలు చెల్లించాలి. సొంత భవనాలు ఏర్పాటు చేయాలి.
- ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ వరకు విద్యార్థులకు రావాల్సిన రూ.62 (కాస్మోటిక్ రూ.50, హెయిర్ కటింగ్ రూ.12) ఇప్పటివరకు అందలేదు.
- కాలేజీ హాస్టల్ విద్యార్థులకు ప్రతి నెలా అందాల్సిన రూ.500 పాకెట్ మనీ వెంటనే చెల్లించాలి.
- పెండింగ్ డైట్‌చార్జీలను చెల్లించాలి. డైట్‌చార్జీలు, కాస్మోటిక్ చార్జీలు మార్కెట్ రేటుకు అనుగుణంగా పెంచాలి.
- ఎస్సీ గురుకుల విద్యార్థులకు నాలుగు జతల యూనిఫామ్స్ అందించాలి.
- వసతి గృహాల కిటికీలకు జాలీలు, సోలార్ పలకల గీజర్లు ఏర్పాటుచేయాలి.
- వసతి గృహాల నిర్వహణకు ప్రతినెలా ఇచ్చే రూ.10 వేలు వెంటనే ఇవ్వాలి.
- బీసీ వసతి గృహాలకు బెడ్‌షీట్స్, కార్పెట్స్, స్కూల్‌బ్యాగ్స్, స్వెటర్లు, మంకీ క్యాప్‌లు, రగ్గులు, రెండు రకాల బూట్లు ఇప్పటివరకు అందించలేదు. వెంటనే అందించాలి.

నాటి బలిదేవత.. నేడు తెలంగాణ తల్లి

- గాంధీ కుటుంబంపై రేవంత్ ప్రశంసలు
- అతి ప్రేమ ఒలకబోతపై సర్వత్రా విస్మయం
- నాడు సోనియాను బలిదేవతన్న రేవంత్
- రాహుల్‌గాంధీ పప్పు అంటూ విమర్శలు
- అమరుల త్యాగాన్ని కించపరిచిన రేవంత్
- అధికారిక సభలో ఫక్తు రాజకీయ ప్రసంగం



హైదరాబాద్, సెప్టెంబర్ 16(నమస్తే తెలంగాణ): మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ విగ్రహావిష్కరణ సందర్భంగా గాంధీల కుటుంబంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఒలకబోసిన ప్రేమను చూసి కాంగ్రెస్‌వాదులు ముక్కున వేలేసుకుంటున్నారు. నిన్న మొన్న పార్టీలో చేరిన ఆయన పుట్టు కాంగ్రెస్‌వాదిగా నీతులు చెప్తుంటే ఏం మాట్లాడాలో తెలియక సైలెంట్ అయిపోయారు. రేవంత్‌రెడ్డి అతి వినయంపై పార్టీలో జోరుగా చర్చ జరుగుతున్నది. అదే సమయంలో అధికారిక కార్యక్రమంలో రాజకీయ ప్రసంగం చేస్తూ తిట్ల దండకం ఎత్తుకోవడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నాడు సోనియాగాంధీని బలిదేవత అని, రాహుల్ గాంధీని పప్పు అంటూ కించపరిచిన రేవంత్‌రెడ్డి ఇప్పుడు వాళ్లను పొగుడుతుంటే ఆశ్చర్యపోయి చూస్తున్నారు. నాటి బలిదేవత నేడు తెలంగాణ తల్లి అయిందా అని ప్రశ్నిస్తున్నారు. వారి కుటుంబ చరిత్ర చెప్పడంపైనా ఆశ్చర్యపోతున్నారు. కొత్త భక్తుడు ఒళ్లంతా బొట్లు పెట్టుకున్నట్టు ఆరేండ్ల క్రితం కాంగ్రెస్‌లో చేరిన ఆయన, పుట్టు కాంగ్రెస్ వాదులకన్నా ఎక్కువగా కాంగ్రెస్ పార్టీ, గాంధీల కుటుంబం గురించి చెప్పడంపై ముక్కున వేలేసుకుంటున్నారు.

అమరుల త్యాగాలు కనిపించలేదా?

కాంగ్రెస్ పార్టీ వల్లే, సోనియాగాంధీ వల్లే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని రేవంత్‌రెడ్డి పేర్కొనడంపై తీవ్రస్థాయిలో విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రేవంత్‌రెడ్డికి అమరుల త్యాగాలు గుర్తుకు రావడం లేదా? అని ప్రశ్నిస్తున్నారు. సోనియాగాంధీ వల్లే తెలంగాణ వస్తే వందలమంది విద్యార్థులు ఎందుకు బలయ్యారని నిలదీస్తున్నారు. తెలంగాణ ప్రజలు, అమరుల త్యాగాలను పక్కన పెట్టి కేవలం సోనియాగాంధీ వల్లే తెలంగాణ వచ్చిందంటూ సీఎం చేసిన వ్యాఖ్యలపై తెలంగాణ ప్రజలు మండిపడుతున్నారు.

పీవీని అవమానించింది కాంగ్రెస్ కాదా?

తెలంగాణ బిడ్డ పీవీ నరసింహారావు ను ప్రధానమంత్రిని చేసింది సోనియాగాంధీ కాదా అని సీఎం రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. అదే పీవీని ఇదే సోనియాగాంధీ, ఇదే కాంగ్రెస్ పార్టీ అవమానించిన విషయం సీఎం రేవంత్‌రెడ్డికి తెలియదా? అని గుర్తుచేస్తున్నారు. పార్టీని కష్టకాలంలో ఆదుకొని, దేశాన్ని నడిపించిన పీవీ మరణం తర్వాత కనీసం ఆయన మృతదేహాన్ని ఢిల్లీలో కాంగ్రెస్ పార్టీ ఆఫీసులోకి కూడా తీసుకురానివ్వకుండా అడ్డుకున్నది నిజం కాదా? అని నిలదీస్తున్నారు.

రోజుల్లోనే రాజీవ్ విగ్రహం?

సచివాలయంలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని, సచివాలయం ముందు మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేయబోతున్నట్టు ఫిబ్రవరిలో రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ఈ ఆరు నెలల్లోనే యుద్ధ ప్రాతిపదికన రాజీవ్ విగ్రహాన్ని తయారు చేయించి ప్రతిష్ఠించి ప్రారంభించారు. తెలంగాణ తల్లి విగ్రహాన్ని మాత్రం డిసెంబర్ 9న ఏర్పాటు చేస్తామని చెప్పారు. రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని రోజుల వ్యవధిలోనే తయారు చేయించి ప్రారంభించినప్పుడు తెలంగాణ తల్లి విగ్రహ ఏర్పాటులో ఎందుకు ఆలస్యం అవుతుందని తెలంగాణ వాదులు ప్రశ్నిస్తున్నారు.

గాంధీలది వారసత్వం కాదా?

బీఆర్ఎస్‌ది కుటుంబ పార్టీ అని, గాంధీలది మాత్రం స్వాతంత్ర్య పోరాట కుటుంబమని రేవంత్‌రెడ్డి అభివర్ణించారు. స్వాతంత్ర్య పోరాటంలో నెహ్రూ పాల్గొన్న విషయాన్ని కాదనలేమని, కానీ, తెలంగాణ కోసం కేసీఆర్ చేసిన ఉద్యమాన్ని, ఆయన చేసిన త్యాగాలను కించపరచడంపై తెలంగాణ వాదులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. తెలంగాణ కోసం చేసిన పోరాటం దేశ స్వాతంత్ర్యం కోసం చేసిన పోరాటం కన్నా తక్కువేమీ కాదని గుర్తుచేస్తున్నారు. గాంధీలది కుటుంబ రాజకీయం కాదా? అని ప్రశ్నిస్తున్నారు.

అధికారిక సభలో తిట్ల దండకం

రాజీవ్‌గాంధీ విగ్రహావిష్కరణ సభ కార్యక్రమం అధికారిక కార్యక్రమం. ఈ విషయాన్ని మర్చిపోయిన సీఎం రేవంత్‌రెడ్డి దీన్ని రాజకీయ సభలాగా మార్చేశారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అధికారిక సభలో సీఎం మాదిరిగా మాట్లాడకుండా రాజకీయ సభలో రాజకీయ నేతలా తిట్ల దండకం ఎత్తుకోవడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. సీఎం స్థాయిలో ఉంటూ ప్రజలు ఏమనుకుంటారనే ఇంగితం లేకుండా సన్నాసి, బలుపు, దిక్కుమాలినోడు అని వ్యాఖ్యానించడంపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

మహనీయుల పేర్లు కేసీఆర్ పెట్టలేదా?

తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు తర్వాత తెలంగాణ కోసం పోరాడిన, తెలంగాణ మహనీయులను గౌరవించే దిశగా నాటి సీఎం కేసీఆర్ చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగానే వ్యవసాయ యూనివర్సిటీకి జయశంకర్ సార్ పేరు పెట్టగా, ఉద్యాన వర్సిటీకి కొండా లక్ష్మణ్‌బాపూజీ పేరు, వెటర్నరీ యూనివర్సిటీకి పీవీ నర్సింహారావు పేరు పెట్టి వారికి సముచిత గౌరవాన్ని ఇచ్చారు. వీటన్నింటినీ మర్చిపోయిన సీఎం రేవంత్‌రెడ్డి గత ప్రభుత్వం ఏం చేయలేదన్నట్టుగా అబద్ధపు ప్రచారం చేయడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

గాంధీ నామస్మరణలో రేవంత్!

- వైఎస్సార్‌ను ఫాలో అవుతున్న రేవంత్‌రెడ్డి
- వైఎస్‌లానే అన్ని పథకాలకు గాంధీల పేర్లు
- రాజీవ్ విగ్రహ ఏర్పాటు అందులో భాగమే
- అధిష్ఠానం వద్ద కోల్పోయిన విశ్వసనీయత
- ఒంటరిగా కలిసేందుకు కూడా విముఖత
- గాంధీల మెప్పుకోసం రేవంత్ అష్టకష్టాలు



హైదరాబాద్, సెప్టెంబర్ 16(నమస్తే తెలంగాణ): ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు ముఖ్యమంత్రిగా పనిచేసిన దివంగత రాజశేఖర్‌రెడ్డి పేరు చెప్పగానే వెంటనే గుర్తొచ్చేవి ఆయన ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలే. ఇది నాణేనికి ఒకవైపు మాత్రమే. ఈ పథకాలన్నింటికీ గాంధీల పేర్లే ఉండేవి. తద్వారా అధిష్ఠానాన్ని మచ్చిక చేసుకునేవారు. ఫలితంగా రాష్ట్రంలో తనకు అడ్డు లేకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. నాణేనికి ఇది రెండోవైపు. రాజశేఖర్‌రెడ్డి బలమైన నేత కావడం, ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్నంత అసమ్మతి లేకపోవడంతో ఆయన పదవీకాలం సాఫీగా సాగిపోయింది. నిత్యం గాంధీల జపం చేయడం ద్వారా అటు పార్టీలోనూ, ఇటు ప్రభుత్వంలోనూ తాను అనుకున్న పనులను నిర్విఘ్నంగా చేసుకుంటూ పోయేవారు. చూస్తుంటే తెలంగాణ ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి కూడా వైఎస్ అడుగు జాడల్లోనే నడుస్తున్నట్టుగా అనిపిస్తున్నది. అవే ఎత్తుగడలను పాటిస్తూ పథకాలకు గాంధీ కుటుంబ పేర్లు పెట్టడం. బహిరంగ సభల్లో వీలు చిక్కినప్పుడల్లా గాంధీలను ఆకాశానికి ఎత్తడం ద్వారా అధిష్ఠానం పెద్దలకు దగ్గర కావాలని, తద్వారా రాష్ట్రంలో తనకు ఎదురులేకుండా చూసుకోవాలని భావిస్తున్నారు. తాజాగా, సచివాలయం ఎదురుగా మాజీ ప్రధాని దివంగత రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేయడం కూడా అందులో భాగమేనన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. వైఎస్‌కు ఎదురు నిలిచే నేతలు లేకపోవడం, ఆయనే సీనియర్ కావడం కలిసొచ్చింది. కానీ, ప్రస్తుతం విరుద్ధమైన పరిస్థితులు నెలకొన్నాయి. రేవంత్ పరిస్థితి దినదినగండం నూరేండ్ల ఆయుష్షులా తయారైంది. రేవంత్ ఎప్పుడు దొరుకుతాడా? ఎప్పుడు సీటును తన్నుకుపోదామా? అని సీనియర్లు ఎదురుచూస్తున్నారు.

వైఎస్ జీవితాంతం కాంగ్రెస్‌తోనే..

వైఎస్ బాటనే రేవంత్ అనుసరిస్తున్నప్పటికీ ఇద్దరికీ ఏమాత్రం పోలికలేదు. వైఎస్సార్ జీవితాంతం కాంగ్రెస్‌తోనే ఉన్నారు. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు పాదయాత్ర చేసి అధికారంలోకి తీసుకొచ్చారు. కానీ, రేవంత్‌రెడ్డి పరిస్థితి వేరు. తెలుగుదేశం పార్టీ నుంచి వచ్చి అనూహ్యంగా సీఎం పదవిని చేజిక్కించుకున్నారు. సీనియర్లకు అధిష్ఠానం ఈ విషయంలో మొండిచేయి చూపింది. ఇది సీనియర్లకు కంటగింపుగా మారింది. మరోవైపు, రేవంత్ తీరుపై అధిష్ఠానం కూడా గుర్రుగా ఉంది. ప్రభుత్వ పరంగా ఆయన తీసుకుంటున్న నిర్ణయాలు అధిష్ఠానానికి మింగుడుపడటం లేదు. ఆయన ఏ క్షణంలోనైనా పార్టీని ముంచి పోతారన్న అనుమానం పార్టీ పెద్దలను వెంటాడుతున్నది. అందుకే ప్రభుత్వ పరంగా ఎలాంటి నిర్ణయం తీసుకున్నా తమకు చెప్పేచేయాలని అధిష్ఠానం షరతు విధించినట్టు తెలిసింది. దీనికి తోడు రేవంత్‌రెడ్డితో నేరుగా భేటీ అయేందుకు పార్టీ పెద్దలు ఉత్సాహం చూపడం లేదు. ఆయనతోపాటు మరెవరైనా ఉంటేనే భేటీకి గ్రీన్ సిగ్నల్ ఇస్తున్నారు. గాంధీలకు తనపై విశ్వాసం లేదన్న విషయం తెలిసే రేవంత్ ఇలా గాంధీల నామస్మరణ చేస్తూ దగ్గర కావాలన్న ప్రయత్నాలు చేస్తున్నారనే గుసగుసలు వినిపిస్తున్నాయి.


19న టీవీవీపీ కమిషనర్ కార్యాలయ ముట్టడి

కాంట్రాక్ట్ కార్మికులకు ఆరు నెలలుగా వేతనాలు పెండింగ్

హైదరాబాద్, సెప్టెంబర్ 16 (నమస్తే తెలంగాణ): టీవీవీపీ దవాఖానల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు ఆరు నెలలుగా వేతనాలు చెల్లించనందుకు నిరసనగా 19న టీవీవీపీ కమిషనర్ కార్యాలయాన్ని ముట్టడించనున్నారు. తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర అధ్యక్షుడు యూసుఫ్, ప్రధాన కార్యదర్శి నరసింహ సోమవారం ప్రకటన విడుదల చేశారు. శానిటేషన్, పేషంట్ కేర్, సెక్యూరిటీ కార్మికులకు ఆరు నెలలుగా జీతాలు అందక పస్తులు ఉంటున్నారని పేర్కొన్నారు. వేతనాలు చెల్లించాలని 10వ తేదీ నుంచి ఏరియా దవాఖానలు, సీహెచ్‌సీల్లో రోజూ గంట పాటు ధర్నా చేస్తున్నా ప్రభుత్వం స్పందించడం లేదని వాపోయారు. దీంతో 19న కమిషనర్ కార్యాలయ ముట్టడికి సిద్ధమైనట్టు వెల్లడించారు.

కాంగ్రెస్‌లో కౌంటర్ చెక్ పాలిటిక్స్

- రేవంత్‌రెడ్డి సిఫార్సులపై అధిష్ఠానం మెలిక
- ఉత్తమ్ లేదా భట్టితో సెకండ్ ఒపీనియన్
- మంత్రివర్గ విస్తరణ జాప్యానికి ఇదే కారణమా?
- పీసీసీ పీఠంపై తొలుత తాత్సారం.. తర్వాత గ్రీన్‌సిగ్నల్
- నామినేటెడ్ పోస్టుల భర్తీలోనూ ఇదే పరిస్థితి



నల్లగొండ ప్రతినిధి, సెప్టెంబర్16(నమస్తే తెలంగాణ): రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల్లో 'ఉత్త(మ్)మ' నిర్ణయాల పేరుతో కౌంటర్ చెక్ పాలిటిక్స్‌ను అధిష్ఠానం అమలుచేస్తున్నదా? కొంతకాలంగా కాంగ్రెస్‌లో వరుసగా చోటుచేసుకుంటున్న పరిణామాలు ఇటువంటి అభిప్రాయమే కలిగిస్తున్నాయి. ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తరువాత ప్రభుత్వంతోపాటు పార్టీపై కూడా పూర్తి స్థాయిలో పట్టు బిగించేందుకు రేవంత్‌రెడ్డి ప్రయత్నిస్తూనే ఉన్నారు. అందుకోసం పలు ప్రతిపాదనలు, సిపార్సులతో అధిష్ఠానం వద్దకు వెళ్తున్న రేవంత్‌రెడ్డికి వెంటనే గ్రీన్‌సిగ్నల్ లభిస్తున్నట్టు లేదు. రేవంత్‌రెడ్డి తమ ముందు పెడుతున్న అంశాలపై అధిష్ఠానం సెకండ్ ఓపీనియన్ తీసుకోవడం ఆ పార్టీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. రాష్ట్రంలో ఆదినుంచీ సోనియాగాంధీ కుటుంబానికి, కాంగ్రెస్ పార్టీకి లాయల్‌గా ఉండే ఒకరిద్దరి నేతలతో రేవంత్ సిఫార్సులపై చర్చించాకే ముందుకు వెళ్తున్నట్టు సమాచారం. అందువల్లే పీసీసీ అధ్యక్షుడి ఎంపిక, మంత్రి వర్గ విస్తరణ, నామినేటెడ్ పోస్టుల భర్తీ వంటి అంశాలన్నీ నిదానంగా సాగుతున్నట్టు తెలుస్తున్నది. మంత్రివర్గ విస్తరణనే పరిశీలిస్తే.. ఇప్పటికే పలుమార్లు కొలిక్కి వచ్చినట్టే వచ్చి ఆగిపోతున్నది. ఇందులో రేవంత్ సిఫార్సులకు ఉత్తమ్‌కుమార్ చెక్ పెడుతున్నట్టు చర్చ జరుగుతున్నది. కొత్తగా మంత్రి వర్గంలోకి నిజామాబాద్ జిల్లాకు చెందిన సుదర్శన్‌రెడ్డి పేరును సీఎం రేవంత్‌రెడ్డి ప్రతిపాదిస్తున్నారు. సుదర్శన్‌రెడ్డితోపాటు తనపై అన్నివైపుల నుంచి తీవ్ర ఒత్తిడి తెస్తున్న కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి వైపు రేవంత్‌రెడ్డి మొగ్గు చూపుతున్నట్టు సమాచారం. అయితే, దీనిపై అధిష్ఠానం ఉత్తమ్ అభిప్రాయం కోరగా.. 'ఒకే ఇంట్లో రెండో మంత్రి పదవి రాజగోపాల్‌రెడ్డికి ఇవ్వాలనుకుంటే తన సతీమణి, కోదాడ ఎమ్మెల్యే పద్మావతికికి కూడా ఎందుకు ఇవ్వకూడదు?' అని మెలిక పెట్టారని తెలిసింది. ఈ పరిణామాలు మంత్రి పదవిపై ఆశలు పెట్టుకున్న రాజగోపాల్‌రెడ్డికి మింగుడు పడలేదు. అందుకే ఉత్తమ్‌ను కూల్ చేసేందుకు ఇటీవల భువనగిరిలో నిర్వహించిన సాగునీటి పనుల సమీక్షలో 'సీఎం కావాల్సిన వ్యక్తి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి' అని సంబోధించక తప్పలేదన్న చర్చ జరిగింది. రేవంత్‌రెడ్డి కూడా ఒక మెట్టు దిగి ఉత్తమ్‌ను సంతృప్తిపరిచేందుకు ఆయన సతీమణి పద్మావతిరెడ్డికి అంచనాల కమిటీ చైర్మన్ పోస్టును కట్టబెట్టారన్న చర్చ జరుగుతున్నది. అంచనాల కమిటీ చైర్మన్ పదవిని పద్మావతితోపాటు ఉత్తమ్ కూడా ఊహించలేదని సమాచారం. మంత్రివర్గ విస్తరణ ఎప్పుడు జరిగినా తన అభిప్రాయం తప్పనిసరి అన్న ధీమాలో ఉత్తమ్ ఉన్నట్టు తెలుస్తున్నది. ఎట్టకేలకు అధిష్ఠానం పీసీసీ అధ్యక్షుడిగా మహేశ్‌కుమార్‌గౌడ్‌ను ఎంపిక చేసినా, రేవంత్‌రెడ్డి పంతం అంత ఈజీగా నెగ్గలేదన్నది నిజం. ఇక్కడ కూడా మహేశ్‌కుమార్‌గౌడ్‌కు పోటీగా బలరాంనాయక్, మధుయాష్కీగౌడ్ రేసులో నిలిచారు. రేవంత్ అవుట్‌రైట్‌గా మహేశ్‌కుమార్‌గౌడ్ వైపు మొగ్గు చూపగా, ఉత్తమ్ అందుకు భిన్నంగా తటస్థ వైఖరి అనుసరించడంతో ఆలస్యమైనట్టు సమాచారం.

నామినేటెడ్ పోస్టుల్లో సైతం

కాంగ్రెస్‌లో నామినేటెడ్ పోస్టుల భర్తీలోనూ ఇదే పరిస్థితి నెలకొన్నట్టు తెలిసింది. ఆదినుంచీ పార్టీని నమ్ముకుని, కష్టకాలంలో పార్టీని అంటిపెట్టుకుని ఉన్న నేతలకే నామినేటెడ్ పోస్టులు ఇవ్వాలన్నది ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వాదన. అయితే, సీఎం రేవంత్ మాత్రం తనతోపాటు కాంగ్రెస్‌లోకి వచ్చిన నేతలకు, ప్రస్తుతం తన వర్గంగా కొనసాగుతున్న వారికే పెద్దపీట వేస్తున్నారన్న చర్చ జరుగుతుంది. అందుకు గత నెలలో మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డితోపాటు మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి కుమారుడు గుత్తా అమిత్‌రెడ్డికి నామినేటెడ్ పోస్టుల కేటాయింపులను ఉదహరిస్తున్నారు. వీరు ఎన్నికల అనంతరం వారి అవసరాల కోసం పార్టీలోకి వచ్చారని, అలాంటి వారికి వెంటనే పోస్టులు ఇస్తే పార్టీ శ్రేణుల్లోకి తప్పుడు సంకేతాలు వెళ్తాయని ఉత్తమ్ అడ్డుపడినట్టు సమాచారం. పోస్టుల ప్రకటన అనంతరం పార్టీ అధిష్ఠానం మరో విషయంలో తనను ఢిల్లీకి పిలిస్తే ఉత్తమ్ తన నిర్ణయాన్ని కుండబద్దలు కొట్టినట్టు తెలిసింది. 'ఇది మంచి సంప్రదాయం కాదు.. వెంటనే వారి పోస్టులను హోల్డ్‌లో పెట్టాలి' అని అధిష్ఠానానికి సూచించినట్టు ఆ పార్టీ వర్గాల్లో చర్చ జరిగింది. ఉత్తమ్ దెబ్బతో పోచారంతోపాటు అమిత్‌రెడ్డి కొన్నాళ్లు పదవీ బాధ్యతలు చేపట్టకుండానే వేచి చూడాల్సి వచ్చింది. ఈ పరిణామాలను అవమానంగా భావించిన రేవంత్‌రెడ్డి వర్గం... వారం రోజుల కిందట వీరిద్దరినీ గుట్టుచప్పుడు కాకుండా బాధ్యతలు చేపట్టాలని పురమాయించినట్టు తెలిసింది. దాంతో వీరిద్దరూ ఎలాంటి హంగూ, ఆర్భాటం, ప్రచారం లేకుండా బాధ్యతలు స్వీకరించారు. ఈ పరిణామాలన్నీ ఇప్పుడు ఆ పార్టీ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి.

ధీమాగా ఉత్తమ్!

రాష్ట్ర ప్రభుత్వ పాలన లేదా పార్టీ పరమైన కార్యక్రమాల్లో సీఎం రేవంత్‌రెడ్డితోపాటు ఆయన వర్గం తనను సంప్రదించకపోయినా... తన అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకపోయినా పెద్దగా వచ్చిన నష్టమేమీ లేదన్న ధోరణితో ఉత్తమ్ ఉన్నట్టు సమాచారం. కీలక నిర్ణయాల్లో అధిష్ఠానం తనను తప్పకుండా సంప్రదిస్తుందన్న ధీమాలో ఉత్తమ్ ఉన్నారు. రేవంత్‌రెడ్డి నేరుగా రాహుల్ గాంధీతో టచ్‌లో ఉండే ప్రయత్నాలు చేస్తుంటే, ఉత్తమ్‌కుమార్ మాత్రం ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గే, జనరల్ సెక్రటరీ కేసీ వేణుగోపాల్‌తో టచ్‌లో ఉన్నట్టు సమాచారం. దీంతో అధిష్ఠానం వద్ద రేవంత్‌రెడ్డి ఏ ప్రతిపాదనలు పెట్టినా వెంటనే అవి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి చేరుతున్నాయని పార్టీ వర్గాలు చెప్తున్నాయి. దాంతోపాటు రాష్ట్రంలో రేవంత్‌రెడ్డితో అంటీముట్టనట్టుగా ఉండాలనే ధోరణినే ఉత్తమ్ అనుసరిస్తున్నట్టు సమాచారం. 'రేవంత్‌రెడ్డి పిలిస్తే పోతా... పిలువకపోతే ఎందులోనూ ఇన్వాల్వ్ కాను. నా పని నేను చేసుకుంటా. నా లెక్క నాకుంటుంది కదా' అనే ధోరణిని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వ్యక్తపరుస్తున్నారు.

ఢిల్లీకి గులాంగిరి!

- కాంగ్రెస్‌పాలిత రాష్ట్రాలకు నిర్ణయాధికారం 'జీరో'

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, సెప్టెంబర్16(నమస్తే తెలంగాణ): 'ఏ రాష్ట్రంలోనైతే కాంగ్రెస్ అధికారంలో ఉంటుందో.. ఆ రాష్ట్రం ఢిల్లీకి గులాంగిరి చెయ్యాల్సిందే'.. అసెంబ్లీ ఎన్నికల సమయంలో సోషల్ మీడియాలో బాగా వైరల్‌గా మారిన కామెంట్ ఇది. కర్ణాటకలో జరుగుతున్న పరిణామాలు ఈ వాదనకు బలాన్నిస్తున్నాయి. రాష్ట్రంలోని ప్రైవేటు సంస్థల్లో నాన్ మేనేజ్‌మెంట్ పోస్టుల్లో 70 శాతం, మేనేజ్‌మెంట్ పోస్టుల్లో 50 శాతం ఉద్యోగాలను కన్నడిగులకే కేటాయించాలంటూ కర్ణాటకలోని సిద్ధరామయ్య ప్రభుత్వం తీసుకొన్న ఇటీవలి నిర్ణయంపై పెద్ద ఎత్తున విమర్శలు వ్యక్తమయ్యాయి. విమర్శలు వెల్లువెత్తడంతో రాహుల్ ఆదేశాలతో సిద్ధరామయ్య సర్కారు బిల్లును వెనక్కి తీసుకొన్నదని జాతీయ మీడియా పలు కథనాల్లో వెల్లడించింది. అంటే, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఏ నిర్ణయాన్ని తీసుకోవాలన్నా దానికి ఢిల్లీలోని కాంగ్రెస్ పెద్దల అనుమతి తప్పనిసరి అన్న విషయం కర్ణాటక ఘటనతో రుజువవుతున్నది.

తెలంగాణ ఆగమాగం

తెలంగాణ బిడ్డల మేలు కోరి రాష్ట్ర ప్రభుత్వ సంస్థల్లో 95 శాతం కొలువులు స్థానికులకే ఇవ్వాలంటూ అప్పటి కేసీఆర్ సర్కారు ఆదేశాలు జారీ చేసింది. వివాదాలు తలెత్తకుండా ఈ వ్యవహారాన్ని చక్కబెట్టింది. పాలనా వికేంద్రీకరణలో భాగంగా 33 జిల్లాలను ఏర్పాటు చేసింది. తర్వాత వచ్చిన రేవంత్ ప్రభుత్వం 19 జిల్లాలను రద్దు చేస్తామంటూ ప్రకటనలు గుప్పిస్తున్నది. ఇదే జరిగితే జోనల్ వ్యవస్థను మళ్లీ మార్చాల్సి వస్తుంది. కొత్త వ్యవస్థ వచ్చే వరకూ నోటిఫికేషన్లు, నియామకాలు, అభివృద్ధి కార్యక్రమాలు ఉండబోవు. ఇది ఒకవిధంగా తెలంగాణ ప్రజలకు నష్టాన్ని కలిగించేదే. ఇక, జిల్లాల రద్దుపై అంతిమ నిర్ణయాధికారం రేవంత్ చేతిలో ఉంటుందా? అంటే, అదీలేదు. ఢిల్లీలోని కాంగ్రెస్ పెద్దల నుంచి అనుమతి తీసుకోవాల్సిందే. అంటే ఒకవిధంగా రాష్ట్రానికి సంబంధించిన నిర్ణయాలూ ఢిల్లీ కేంద్రంగా నడవాల్సిందేనన్న మాట. 'తెలంగాణ స్థితిగతులపై ఏమాత్రం అవగాహనలేని ఢిల్లీ పెద్దలకు రాష్ట్రానికి సంబంధించిన కీలక విషయాల్లో నిర్ణయాధికారం ఇవ్వడమంటే ఇది ఒకరకమైన పరాయిపాలనే'నని అవుతుందని తెలంగాణవాదులు అభిప్రాయపడుతున్నారు.

మంత్రుల కుతకుత

మొదటిపేజీ తరువాయి...

వెలువడ్డాయి. ఈ ఘటనతో మంత్రులకు తొలి షాక్ తగిలినట్టు తెలిసింది. ఆ తరువాత రుణమాఫీ, కరెంట్ కోతలు, ఆరు గ్యారెంటీల అమలు, ఉద్యోగాల భర్తీతోపాటు ఇటీవలి హైడ్రా నిర్ణయం వరకు మంత్రులకు వరుస షాక్‌లు తగులుతూనే ఉన్నాయని అంటున్నారు.

మంత్రులకు తెలియకుండానే నిర్ణయాలు..

ప్రభుత్వంలో పలు కీలక నిర్ణయాలు మంత్రులకు తెలియకుండానే జరిపోతున్నట్టు సమాచారం. ముఖ్యంగా హైడ్రా ఏర్పాటు వంటి కీలక నిర్ణయం మంత్రులెవరికీ తెలియదని అంటున్నారు. చాలా నిర్ణయాలు అమల్లోకి వచ్చిన తర్వాత లేదా పేపర్లు, టీవీల్లో చూసి తమ తెలుసుకోవాల్సిన దౌర్భాగ్యం తమకు పట్టిందని ఓ కీలక మంత్రి తన సన్నిహితుల వద్ద ఆవేదన వ్యక్తం చేసినట్టు తెలిసింది. రాజీవ్ గాంధీ విగ్రహం ఏర్పాటు, తెలంగాణ తల్లి విగ్రహానికి భూమి పూజ, రుణమాఫీ కార్యక్రమాల నిర్వహణ వంటివి తమకు తెలియకుండానే నిర్ణయాలు జరిగిపోయినట్టు మంత్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నట్టు తెలిసింది.

మంత్రులను ముందుకు తోసి..

ప్రజల్లో ప్రభుత్వంపై వ్యతిరేకత వ్యక్తమవుతుందనుకునే అంశాల్లో సీఎం రేవంత్‌రెడ్డి అతి తెలివిగా వ్యవహరిస్తున్నారనే అభిప్రాయాలు పార్టీలో వినిపిస్తున్నాయి. ఇలాంటి విషయాలపై ముందుగా మంత్రులను ముందుకు ఎగదోసి వారితో మాట్లాడిస్తున్నారని తెలిసింది. మంత్రులు చెప్పే మాటలపై ప్రజల్లో స్పందనను బట్టి ఆ తర్వాత సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతున్నారని చెప్తున్నారు. రుణమాఫీ, ఎమ్మెల్యేల ఫిరాయింపులు, కౌశిక్‌రెడ్డి, గాంధీల వివాదంపై తొలుత మంత్రులను ముందుకు తోసినట్టు తెలిసింది. మంత్రులకు ఇష్టం లేకపోయినా వారితో మీడియా సమావేశాలు పెట్టించి ఏదో ఒకటి మాట్లాడిస్తున్నారని చెప్తున్నారు. తీరా మంత్రులు మాట్లాడిన తర్వాత వారికి పూర్తి విరుద్ధంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతున్నారనే చర్చ జరుగుతున్నది. దీంతో మంత్రులు సీఎం తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నట్టు సమాచారం.

ఉత్తర్వులు వచ్చేదాక చెప్పరా?


తెలంగాణ బిడ్డలను కాదని ఆంధ్రా ప్రాంతం వారికి పదవులు కట్టబెడుతూ ఉత్తర్వులు వచ్చేదాకా తమకు తెలియటం లేదని మంత్రులు రగిలిపోతున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఏకపక్షంగా వ్యవహరిస్తూ రాష్ట్రాన్ని ఆంధ్రప్రదేశ్ పునరావాస కేంద్రంగా మారుస్తున్నారని భగ్గుమంటున్నారు. రేవంత్‌రెడ్డి సమైక్యపాలకులను తలదన్నేలా తెలంగాణ ప్రయోజనాలను దెబ్బతీస్తున్నారని పార్టీలో సీనియర్ నేతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పార్టీ పదవులు, ప్రభుత్వ పదువులు అన్నీ తన ఇష్టానుసారం, తన ఇష్టమైనవారికే కట్టబెడుతూ సీఎం తమ ఉనికినే ప్రశ్నార్థకం చేస్తున్నారని మంత్రులు మండిపడుతున్నారని సమాచారం. ఏపీకి చెందిన నిమ్మగడ్డ రమేశ్‌కుమార్, ఆదిత్యనాథ్‌దాస్, అనిలా వావిల్ల, రఘునాథ్‌రెడ్డి, శ్రీనివాస్‌రాజు, శ్రీరాం కర్రీ, ఆంజనేయరెడ్డి వంటివారిని నియమించే సమయంలో కనీసం తమకు మాట మాత్రమైనా చెప్పలేదని సంబంధిత శాఖల మంత్రులు కుతకుతలాడిపోతున్నారని చర్చించుకుంటున్నారు.

చులకనవుతున్నాం

సీఎం తీరు వల్ల తాము ప్రజల్లో చులకనవుతున్నామని మంత్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నట్టు తెలిసింది. తమతో ఒక విధంగా మాట్లాడించి, ఆయన మాత్రం ఇంకో విధంగా మాట్లాడుతూ.. తమను పిచ్చోళ్లను చేస్తున్నారని వాపోతున్నారట. ఇందుకు రుణమాఫీ, అరికెపూడి గాంధీ వివాదాన్ని ఉదాహరణగా చూపుతున్నారు. రుణమాఫీ పూర్తి కాలేదని తాము చెప్తుంటే.. సీఎం మాత్రం పూర్తయిపోయిందని చెప్పడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రైతుల దృష్టిలో తాము విలన్లుగా మారిపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అరికెపూడి గాంధీ బీఆర్ఎస్‌కు చెందిన ఎమ్మెల్యే అని మంత్రులు శ్రీధర్‌బాబు, భట్టి విక్రమార్క చెప్పగా.. సీఎం రేవంత్‌రెడ్డి మాత్రం ఆయన తమ పార్టీకి చెందిన వారేనని చెప్పుకొచ్చారు. పైగా కౌశిక్‌రెడ్డి ఇంటిపై దాడి చేసింది తమ వాళ్లేనంటూ కుండబద్దలు కొట్టారు.

నాడు విలీనం.. నేడు ప్రజాపాలన!

- సెప్టెంబర్ 17పై ముఖ్యమంత్రి రేవంత్ రెండు నాల్కల ధోరణి
- విలీన దినోత్సవం నిర్వహించాలని గతంలో డిమాండ్
- అధికారంలోకి వచ్చాక 'ప్రజాపాలన దినోత్సవం'గా మార్పు



హైదరాబాద్, సెప్టెంబర్ 16 (నమస్తే తెలంగాణ): 'నిజాం సంస్థానాన్ని దేశంలో కలిపిన రోజును విలీన దినోత్సవంగా కాంగ్రెస్ పార్టీ నిర్వహిస్తుంది. రాష్ట్ర ప్రభుత్వం కూడా విలీన దినోత్సవంగానే నిర్వహించాలి..' టీపీసీసీ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు రేవంత్‌రెడ్డి 2022 సెప్టెంబర్‌లో చేసిన వ్యాఖ్యలివి. విలీనం జరిగి 75 ఏండ్లు పూర్తవుతున్న సందర్భంగా కాంగ్రెస్ తరపున 2022 సెప్టెంబర్ 17 నుంచి ఏడాదిపాటు 'విలీన వజ్రోత్సవాలు' పేరుతో కార్యక్రమాలు నిర్వహిస్తామని ప్రకటించిన రేవంత్‌రెడ్డి.. ఇప్పుడు అధికారం చేపట్టాక మాట మార్చారు. 'ప్రజాపాలన దినోత్సవం' పేరుతో అధికారిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. 'ప్రజాపాలన' అనేది అసెంబ్లీ ఎన్నికల ముందు నుంచి కాంగ్రెస్ నినాదంగా కొనసాగుతున్న విషయం అందరికీ తెలిసిందే. 'ప్రజాపాలన' పేరుతో ప్రజల నుంచి దరఖాస్తులు తీసుకున్నది. ఇప్పుడు ఆ పేరునే సెప్టెంబర్ 17 వేడుకలకు వినియోగిస్తుండటంపై తెలంగాణ వాదులు మండిపడుతున్నారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వం 'జాతీయ సమైక్యత దినోత్సవం' పేరుతో వేడుకలు నిర్వహించినప్పుడు తప్పుబట్టిన రేవంత్‌రెడ్డి.. ఇప్పుడు 'విలీన దినోత్సవం' పేరుతో వేడుకలను ఎందుకు నిర్వహించడం లేదని నిలదీస్తున్నారు. గతంలో టీపీసీసీ అధ్యక్షుడిగా 'విలీన దినోత్సవం' పేరు తో గాంధీభవన్‌లో జెండా ఎగురవేసిన ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఇప్పుడెందుకు మాట్లాడటం లేదని అడుగుతున్నారు. కాంగ్రెస్ మాత్రం విలీన దినోత్సవం పేరుతోనే కార్యక్రమం నిర్వహిస్తుందని చెప్పిన ఆ పార్టీ నేత అద్దంకి దయాకర్.. ఇప్పుడెందుకు 'ప్రజాపాలన'కు ఓటేస్తున్నారని ప్రశ్నిస్తున్నారు.

మాట మార్చిన సీపీఐ

సెప్టెంబర్ 17ను విలీన దినోత్సవంగా నిర్వహించాలని గతంలో సీపీఐ డిమాండ్ చేసింది. విలీన దినోత్సవం నిర్వ హించాలని పార్టీ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు నిరుడు ఆగస్టులో సీఎం కేసీఆర్‌కు లేఖ రాశారు. నిరుడు సెప్టెంబర్‌లో హై దరాబాద్‌లో నిర్వహించిన తెలంగాణ సాయుధ పోరాట వార్షికోత్సవాల్లో పార్టీ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. జాతీయ సమైక్యత దినోత్సవంగా నిర్వహించడమంటే తెలంగాణ సాయుధ పోరాటాన్ని నీరుగార్చడమేనని, కనుక సెప్టెంబర్ 17ను 'విలీన దినోత్సవం'గానే నిర్వహించాలని డిమాండ్ చేశారు. కానీ, ఇప్పుడు సీపీఐ నేతలంతా ఆ మాటలను మర్చిపోవడంపై తెలంగాణవాదులు మండిపడుతున్నారు.

నమస్తే తెలంగాణ

పంజరంలో చిలుక

ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు బెయిల్ మంజూరు కావడంతో మద్యం పాలసీ కేసులో ఒక అంకం పూర్తయింది. బెయిల్‌పై వాదనల సందర్భంగా సుప్రీంకోర్టు చేసిన వ్యాఖ్యలు కేంద్ర దర్యాప్తు సంస్థలకు, ముఖ్యంగా సీబీఐకి చెంపపెట్టు లాంటివని చెప్పాలి. 'బెయిల్ ఇవ్వడం సర్వదా వాంఛనీయం. కానీ, జైలు అనేది అసాధారణ పరిస్థితుల్లో మాత్రమే వర్తింపజేయాలి. పంజరంలో ఉన్న పెంపుడు చిలకలా ప్రవర్తించవద్దు. ఆ ముద్రను చెరిపేసుకోవాల్సిన బాధ్యత సీబీఐ మీదే ఉన్నద'ని సర్వోన్నత న్యాయస్థానం అభిప్రాయపడటమే అందుకు కారణం. ఈ మందలింపుల నేపథ్యంలో సీబీఐ ఏమైనా నేర్చుకుంటుందా? అనేది సందేహాస్పదమే. ఎందుకంటే, పెంపుడు చిలుక పంజరం నుంచి తనంతట తానుగా బయటకు వచ్చి స్వేచ్ఛగా ఎగరలేదు. అది ఎగరాలంటే దాన్ని పంజరంలో బంధించినవాళ్లు మొదట మారాలి. అప్పుడే బంధనాలను తెంపుకొని తనదైన వాస్తవ కర్తవ్యం దిశగా చిలుక ఎగురగలుగుతుంది.

ఒకప్పుడు జాతీయ దర్యాప్తు సంస్థలంటే వెన్నులో వణుకు పుట్టేది. అవి రంగంలోకి దిగాయంటే నేరస్థుల గుండెల్లో రైళ్లు పరుగెత్తేవి. ఎందుకంటే, ఎలాంటి లాలూచీ లేకుండా, రాజీపడకుండా అవి దర్యాప్తు జరుపుతాయని గట్టి నమ్మకం. ఇదంతా గత చరిత్ర. రానురాను వాటి పరిస్థితి దిగజారుతూ వస్తున్నది. ఈ దిగజారుడు ధోరణి కాంగ్రెస్ హయాంలోనే మొదలైంది. సుప్రీంకోర్టు ప్రస్తావించినట్టుగా సుకుమారమైన చిలుకలా కాకుండా, మెడలో గొలుసు ఉన్న పెంపుడు కుక్కలా వ్యవహరించేవని కేంద్ర దర్యాప్తు సంస్థలు అప్పట్లోనే తీవ్రమైన విమర్శలు ఎదుర్కొన్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వాలు తమ రాజకీయ అవసరాలకు అనుగుణంగా ఉపయోగించడం వల్ల వాటి ప్రతిష్ట కొంతమేరకు మసకబారగా.. బీజేపీ నేతృత్వంలోని మోదీ సర్కార్ ఇష్టారాజ్యంగా ఉపయోగిస్తున్న తీరుతో అది మరింతగా భ్రష్టుపట్టింది. అన్ని కేసులు అదే తరహాలో జరుగుతున్నాయని చెప్పలేం కానీ, రాజకీయ కేసుల విషయంలో మాత్రం దర్యాప్తు సంస్థల తీరు వివాదాస్పదమవుతూనే ఉన్నది. ఇది ఎవరూ కాదనలేని వాస్తవం. సుప్రీంకోర్టు అక్షింతలతో ఈ విషయం మరోమారు స్పష్టమైంది.


ఢిల్లీ మద్యం పాలసీ కేసులో సీబీఐ వ్యవహరించిన తీరు మొదటి నుంచీ సందేహాస్పదమే. నెలల తరబడి ఈడీ కేసు నడుస్తుంటే చూస్తూ కూర్చున్న సీబీఐ.. ఆ కేసులో బెయిల్ లభించగానే ఉన్నపళంగా ఆయనపై కేసు దాఖలు చేయడం గమనార్హం. విపక్ష నేతలపై సీబీఐ, ఈడీలను ప్రయోగించడం, వారు బీజేపీకి వత్తాసు పలకగానే కేసుల నుంచి విముక్తి కల్పించడం ఈ మధ్య పరిపాటిగా మారింది. మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ ఉదంతం అందుకు చక్కటి ఉదాహరణ. సుప్రీం వ్యాఖ్యల తర్వాతైనా దర్యాప్తు సంస్థల పనితీరు మెరుగుపడాల్సిన అవసరం ఉన్నది. అంతేకాదు, నిగ్గుతేలే కేసుల సంఖ్య కూడా పెరగాలి. అందుకు మొదటగా దర్యాప్తు సంస్థలు జవాబుదారీతనంతో వ్యవహరించాలి. అలా జరగాలంటే ముందుగా వాటిని కేంద్ర ప్రభుత్వ నియంత్రణలో నుంచి బయటపడేయాలి. ఆమూలాగ్రం పారదర్శకత తేవాలి. పూర్తిస్థాయి స్వతంత్ర ప్రతిపత్తి కల్పించాలి. వాటి నియంత్రణను పూర్తిగా పార్లమెంటరీ కమిటీకి అప్పగించాలి. ఇలాంటి విప్లవాత్మక మార్పులు జరిగితే తప్ప కేంద్ర దర్యాప్తు సంస్థల పనితీరు మెరుగుపడదు. అయితే బీజేపీ నేతృత్వంలోని ప్రస్తుత కేంద్ర ప్రభుత్వ హయాంలో అది జరుగుతుందని ఆశించడం అత్యాశే.

ప్రమాదపుటంచుల్లో ప్రజాస్వామ్యం

1948 సెప్టెంబర్ 17 అనేది హైదరాబాద్ స్టేట్‌కు విమోచన దినమా? లేదా భారత యూనియన్‌లో విలీనమైన రోజా? లేదా విద్రోహ దినమా? ఇది కొంతకాలంగా చర్చనీయాంశంగా మారుతున్న అంశం. బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం గత రెండేండ్లుగా దీన్ని విమోచన దినంగా జరుపుకొంటున్నది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం జాతీయ సమైక్యతా దినోత్సవంగా జరుపగా.. ప్రస్తుత కాంగ్రెస్ సర్కార్ మాత్రం ప్రజాపాలన దినోత్సవంగా పేర్కొంటున్నది. ఈ నేపథ్యంలో తెలంగాణ ప్రజలకు ఎంతో ముఖ్యమైన సెప్టెంబర్ 17 వెనకున్న అసలు వాస్తవమేమిటి? ఈ ప్రజా ఉద్యమానికి ఉన్న రాజకీయ వారసత్వ చట్టబద్ధత ఎవరికి సొంతం? అనేది ఇప్పుడు చర్చనీయాంశం.



డాక్టర్
చెన్నమనేని రమేశ్



కమ్యూనిస్టులు, సోషలిస్టులు, రైతు సంఘాల నేతృత్వంలోని రైతులు పోరాటాల ద్వారా సమ్మిళిత భారతదేశ పరిణామంలో కీలకపాత్ర పోషించారు. అనేక రైతాంగ పోరాటాలు చేశారు. కేరళలోని పున్నప్రవాయలార్‌లో భూసమస్యపై సాగించిన పోరాటాలు, బెంగాల్‌లో తెభాగ ఉద్యమం, అసోంలో సుర్మా వ్యాలీ పోరాటం, మహారాష్ట్రలో వార్లీ తిరుగుబాటు, భూ సంస్కరణలు, దోపిడీకి వ్యతిరేకంగా జరిగిన తెలంగాణ రైతాంగ పోరాటం వాటిలో ప్రధానమైనవి.

దేశానికి స్వాతంత్ర్యం రాకముందు హైదరాబాద్ రాష్ట్రం రాచరిక పాలనలో ఉండేది. నిజాం నాయకత్వంలోని హైదరాబాద్‌లో పోలీసు పటేల్ (శాంతిభద్రతలు), మాలి పటేల్ (రెవెన్యూ), పట్వారీ (భూ రికార్డులు)లతో కూడిన పాలనావ్యవస్థ ఉండేది. పై స్థాయిలో గిర్దావర్లు, తహశీల్దార్లు, తాలుక్‌దార్‌లు ఉండేవారు. వీరు నిజాంకు వీర విధేయులు. హైదరాబాద్ స్టేట్‌లోని నలభై శాతం భూములు నిజాం ఆధీనంలోనే ఉండేవి. భూస్వాముల చేతుల్లో ఉన్న మిగిలిన అరవై శాతం భూముల్లో వెట్టిచాకిరీ చేయించేవారు.

ఈ నేపథ్యంలో 1928లో మాడపాటి హనుమంతరావు, సురవరం ప్రతాపరెడ్డి తదితరుల నాయకత్వంలో ఆంధ్ర మహాసభ ఏర్పడింది. ఆంధ్ర మహాసభ నేతృత్వంలో రావి నారాయణ రెడ్డి, మఖ్దూం మొహియుద్దీన్, హసన్ నసీర్, భీంరెడ్డి నరసింహారెడ్డి, మల్లు వెంకట నరసింహారెడ్డి. మల్లు స్వరాజ్యం, ఆరుట్ల రాంచంద్రారెడ్డి, ఆరుట్ల కమలాదేవి, రాజ్ బహదూర్ గౌర్, బద్దం ఎల్లారెడ్డి, అనభేరి ప్రభాకర్, చెన్నమనేని రాజేశ్వరరావు తదితరులు నిజాం అణచివేతలపై సాయుధ పోరాటం సాగించారు. 1946-51 మధ్యకాలంలో జరిగిన ఈ ఉద్యమంలో 60 వేలమందికి పైగా ఆయుధాలు చేతబట్టి రజాకార్లకు వ్యతిరేకంగా పోరాడారు. ఈ పోరులో సుమారు 4,500 మందికి పైగా ప్రాణాలర్పించారు.

ఈ నేపథ్యంలో దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించిన తర్వాత 1948, సెప్టెంబర్ 13న పోలీస్ యాక్షన్ జరిగింది. అనంతరం జనరల్ జేఎన్ చౌధురీ నేతృత్వంలో మిలిటరీ పాలన ప్రారంభమైంది. చౌధురీ అణచివేతల కారణంగా నిజాం వ్యతిరేక పోరాటం కాస్త భారత మిలిటరీతో పోరాటంగా మారింది. అనంతరం జరిగిన పరిణామాల నేపథ్యంలో కమ్యూనిస్టు పార్టీలో కొత్త చర్చ మొదలైంది. రావి నారాయణరెడ్డి నాయకత్వంలోని సాయుధ దళాలు పోరాటాన్ని విరమించాలని నిర్ణయించుకున్నాయి. కానీ, అలా చేస్తే ప్రజల్లో విశ్వాసం కోల్పోతామని, ద్రోహులుగా మిగిలిపోతామని మరో వర్గం వాదించింది. అణచివేతలు, అరెస్టుల కారణంగా పోరాటాన్ని నిలిపివేస్తున్నట్టు 1951 అక్టోబర్ 21 సీపీఐ ప్రకటించింది. ఈ నేపథ్యంలో సెప్టెంబర్ 17ను మనం విశాలమైన దృక్పథంతో చూడాల్సిన అవసరం ఉన్నది. నిస్సందేహంగా తెలంగాణ సాయుధ పోరాటం ఫలితంగానే నిజాం పాలన ముగిసి, భారత యూనియన్‌లో హైదరాబాద్ స్టేట్ విలీనమైంది. 'పోలీస్ యాక్షన్ జరగరపోయినా నిజాంను మేం గద్దె దించేవాళ్లం' అని రావి నారాయణరెడ్డి స్వయంగా చెప్పారు.

నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో ఆర్య సమాజ్‌కు గాని, హిందూ మహాసభకు గాని, ఆర్ఎస్ఎస్‌కు గాని ఎలాంటి పాత్ర లేదు. దశాబ్దాల కిందటి వరకు గంగా జమునా తెహజీబ్‌లా అన్ని వర్గాల వారు కలసిమెలసి ఉన్న ఈ ప్రాంతంలో మతపరమైన విద్వేషాలు సృష్టించి, వారి ఐక్యతను విచ్ఛిన్నం చేయడమే వారు సాధించింది. ముస్లింల ఊచకోతపై భారత ప్రభుత్వం నియమించిన సుందర్‌లాల్ కమిటీ కూడా ఇదే నివేదించింది. ఈ ప్రాంతం నిజాం రాజ్యంగా ఉన్నప్పటికీ అది ఏ మతంతోనూ బలమైన బంధం కలిగిలేదు. ఈ నేపథ్యంలో నిజాంకు వ్యతిరేకంగా పోరాడిన హిందూ భూమిగా తెలంగాణను చిత్రీకరించడం, సర్దార్ వల్లభ్ భాయ్ పటేల్‌ను తెలంగాణ విముక్త యోధుడిగా చూపించే ఆలోచన బీజేపీ చేస్తున్నది. తెలంగాణ రైతాంగ పోరాటాన్ని ముస్లిం వ్యతిరేక ఉద్యమంగా, భారత యూనియన్‌లో విలీనం చేయడాన్ని విముక్తిగా చూపించే కుట్ర అందులో దాగి ఉన్నది.

ఎన్ని వక్రీకరణలు ఉన్నప్పటికీ, ఏడు దశాబ్దాల కిందట తెలంగాణ రైతాంగ పోరాటం జరిగిందనేది నిస్సందేహంగా వాస్తవం. ఆరు దశాబ్దాల కిందట 'దున్నేవాడిదే భూమి' అనే నినాదంతో కమ్యూనిస్టులు పోరాటం సలిపారు. ఐదు దశాబ్దాల కిందట ప్రత్యేక తెలంగాణ కోసం విద్యార్థి ఉద్యమం జరిగింది. నాలుగు దశాబ్దాల కిందట పౌరహక్కుల ఉద్యమానికి కేంద్రబిందువైంది. 1970ల దశకంలో దేశంలో మహిళల హక్కుల సంఘాలు ఏర్పడ్డాయి. ఇలా అన్ని వర్గాలు ప్రత్యేక తెలంగాణ కోసం డిమాండ్ చేసి, సాధించుకున్నాయి. ఈ నేపథ్యంలో రాజకీయ లబ్ధి కోసం తమ ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక ఎజెండాలను కొత్తగా ఆవిర్భవించిన తెలంగాణలో దశలవారీగా అమలు చేయాలని కొన్ని శక్తులు చూస్తున్నాయి. భారతదేశం తన 78వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఇటీవల జరుపుకొన్న తరుణంలో రాజకీయ, సామాజిక పోరాటాలను మనం విశ్లేషించుకోవాల్సిన అవసరం ఉన్నది. లౌకిక, ప్రజాస్వామ్య, రిపబ్లిక్, సమాఖ్య వ్యవస్థలతో కూడిన భారత రాజ్యాంగంపై ఆధారపడి మన రాజకీయ వ్యవస్థ నడుస్తున్నది.

భారత రాజ్యాంగానికి మూలాధారమైన నాలుగు పిల్లర్ల వంటి లౌకిక ప్రజాస్వామ్యం, సామాజిక న్యాయం, ఫెడరలిజం, ఆర్థిక స్వావలంబన ఇప్పుడు ప్రమాదంలో ఉన్నాయి. ఈ తరుణంలో వాటిని సంరక్షించుకోవడమే ఇప్పుడు ప్రజాస్వామ్యవాదులు, ప్రగతిశీల శక్తుల ముందున్న అతిపెద్ద సవాల్.

రాజకీయ లబ్ధి కోసం తమ ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక ఎజెండాలను కొత్తగా ఆవిర్భవించిన తెలంగాణలో దశలవారీగా అమలు చేయాలని కొన్ని శక్తులు చూస్తున్నాయి. భారతదేశం తన 78వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఇటీవల జరుపుకొన్న తరుణంలో రాజకీయ, సామాజిక పోరాటాలను మనం విశ్లేషించుకోవాల్సిన అవసరం ఉన్నది.

(వ్యాసకర్త: వేములవాడ మాజీ ఎమ్మెల్యే)



హైదరాబాద్ సంస్థాన సమరయోధుడు



సురభి వాణీదేవి

'వందేహం, మదురుం, శాంతం/ కాషాయాంబర శోభితం స్వాతంత్ర్యసరోల్లాసం/ రామానందాఖ్య నాయకం...' అని కళాప్రపూర్ణ డాక్టర్ దాశరథి అన్నారు. ఆయన చెప్పినట్టు.. హైదరాబాద్ స్టేట్ ప్రజలకు రాచరికం నుంచి విలీనం/ విముక్తి కలిగించిన వ్యక్తి స్వామి రామానంద తీర్థ.

బ్రిటిష్ ప్రభుత్వం 1947, ఆగస్టు 15న భారతదేశానికి స్వాతంత్ర్యం ప్రకటించింది. అయితే, హైదరాబాద్ సంస్థానం మాత్రం భారతదేశంలో కలవడానికి నిరాకరించింది. అప్పుడు హైదరాబాద్ సంస్థానాన్ని అసఫ్ జాహీ వంశపు 7వ రాజైన 'మీర్ ఉస్మాన్ అలీఖాన్' పరిపాలిస్తున్న రోజులు. యావత్ భారతంలో తమ అధికారాన్ని వదులుకొని బ్రిటిష్ ప్రభుత్వం నిష్క్రమిస్తుండగా, అఖండ దేశంలోని చిన్న భాగంలో ఫ్యూడల్ నిరంకుశ పాలన ఉండటం చూడలేమని స్వామి రామానంద తీర్థ హెచ్చరించారు. అంతేకాదు, 1946, జూలై 3న 'భారతదేశంలో రాజకీయ విప్లవం వస్తున్న తరుణంలో హైదరాబాద్ సంస్థానం దీని నుంచి తప్పుకోజాలదు' అంటూ ప్రభుత్వానికి ధిక్కార స్వరం వినిపించారు. స్వామిజీ ఇచ్చిన ఈ నినాదానికి ప్రభావితులైన అనేకమంది యువతీ యువకులు 'వందేమాతరం' అంటూ హైదరాబాద్ సంస్థాన విలీన/ విమోచన సంగ్రామంలో దూకారు.

సంస్థానంలో నానాటికీ విషమించిపోతున్న పరిస్థితుల నుంచి కవులు, కళాకారులు, సామాన్యులు, మహిళలు, సమస్త ప్రజలకు విముక్తి కలిగించే ఏకైక ఆశాదీపం స్వామి రామానంద తీర్థ. ఆయన శిష్యరికంలో జాతీయ ఉద్యమ ప్రభావం వల్ల మాజీ ప్రధాని పీవీ నరసింహారావుతో పాటు ఇతర ప్రముఖులు 'వందేమాతరం' అంటూ నినదించారు. ఈ ఉద్యమం ఔరంగాబాద్, వరంగల్, గుల్బర్గా, నాందేడ్, మహబూబ్‌నగర్ జిల్లాల్లోనూ మార్మోగింది. సంస్థానంలో ప్రతి తాలూకాలో, పట్టణంలో సత్యాగ్రహాలు పుంజుకున్నాయి. జాతీయ పతాకం ఎగురవేసినందుకు పద్మజానాయుడిని అరెస్టు చేశారు. దేశభక్తుడు పండిట్ నరేంద్ర, బూర్గుల రామకృష్ణారావు, జి.రామాచారి, గణపతిరావు, జ్ఞానకుమారి హెగ్డే, వందేమాతరం రామచంద్రరావు, కాటం లక్ష్మీనారాయణ, వట్టికోట ఆళ్వారు, బిర్దీ చంద్ చౌదరీ, జీఎస్ మెల్కొటే, కాళోజీ నారాయణరావు, ఎం.ఎస్ రాజలింగం, దామోదర్ పాంగ్రేకర్, డి.బిందూ, జమలాపురం కేశవరావు, కొండా లక్ష్మణ్‌బాపూజీ లాంటి అనేక మంది నాయకులను జైళ్లలో బంధించారు. 1947 ఆగస్టు 7న త్రివర్ణ పతాకాన్ని చేతబూని, 'ఇండియా యూనియన్‌లో హైదరాబాద్ కలవాల'ంటూ సుల్తాన్ బజార్‌లో సత్యాగ్రహం ప్రారంభించడంతో పోలీసులు వారిని అరెస్టు చేసి వరంగల్ జైలుకు పంపారు. సుప్రసిద్ధ కవి దాశరథి , ఇటిక్యాల మధుసూదన్‌రావు లాంటివారితో జైళ్లను నింపేశారు.

ఈ నేపథ్యంలో స్వామిజీ ఢిల్లీకి వెళ్లి సర్దార్ వల్లబ్ భాయ్ పటేల్, నెహ్రూలను కలిశారు. హైదరాబాద్ సంస్థాన స్థితిగతులను, ఖాసీం రజ్వీ జరుపుతున్న దురాగతాలను వారిముందు ఏకరువు పెట్టారు. రజాకార్ల నిషేధానికి శాంతిభద్రతల దృష్ట్యా బొల్లారంలో భారత సైన్యాన్ని దించుతామని 1948 ఆగస్టు 31న అప్పటి ఇండియా గవర్నర్ జనరల్ సి.రాజగోపాలాచారి తెలిపారు. 1948 సెప్టెంబర్ 13 తెల్లవారుజామున భారత ప్రభుత్వ సైన్యాలు హైదరాబాద్ సంస్థానంలో ప్రవేశించాయి. కమాండింగ్ ఇన్ చీఫ్ లెఫ్టినెంట్ జనరల్ మహారాజా, రాజేందర్ సింహజీ నేతృత్వంలో భారత సైన్యం షోలాపూర్ నుంచి, రెండవ దళం విజయవాడ నుంచి మూడవ దళం అహ్మద్‌నగర్ నుంచి మూకుమ్మడిగా చుట్టుముట్టడంతో హైదరాబాద్ స్టేట్ ప్రజల్లో ఆనందోత్సాహాలు వెల్లివిరిశాయి.

ఈ నేపథ్యంలో సుల్తాన్‌బజార్‌లో తన నివాసం వద్ద ప్రజలను ఉద్దేశించి స్వామిజీ ప్రసంగించారు. 'ఇది చరిత్రాత్మక పోరాటం, చెప్పలేని బాధలను అనుభవించిన మనం ఎన్నో అగ్ని పరీక్షలను ఎదుర్కొని ఘన విజయం సాధించాం. ఈ పోరాటంలో ప్రాణత్యాగం చేసిన వేలాదిమంది ప్రజలకు కార్యకర్తలకు, కర్షకులకు, కార్మికులకు, విద్యార్థులకు, మహిళామణులకు ఇదే నా అశ్రుతర్పణం' అని భావోద్వేగానికి గురయ్యారు.

1948, సెప్టెంబర్ 17న నిజాం నవాబ్ హైదరాబాద్ రేడియో స్టేషన్ నుంచి ప్రసంగిస్తూ భారత యూనియన్‌లో హైదరాబాద్ సంస్థానం బేషరతుగా విలీనమైందని ప్రకటించారు. 1972 జనవరి 22న స్వామిజీ శివైక్యం చెందారు. ఆ తర్వాత ఆయన అనుంగు శిష్యుడు అప్పటి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి పీవీ నరసింహారావు స్వామిజీ సంస్మరణార్థం 'స్వామి రామానంద తీర్థ మెమోరియల్' సంస్థను బేగంపేటలో స్థాపించారు. ఇక్కడే 'స్వామిజీ సమాధి' ఉండటం గమనార్హం.

(వ్యాసకర్త: శాసనమండలి సభ్యురాలు, స్వామి రామానంద తీర్థ మెమోరియల్ ప్రధాన కార్యదర్శి)

1940 దశకంలో ఉవ్వెత్తున ఎగసిపడ్డ నిజాం నిరంకుశ పాలన వ్యతిరేక పోరాటంలో బుర్రకథలు ప్రధాన భూమిక పోషించాయి. కథ పౌరాణికమైనా, చారిత్రకమైనా సమకాలీన సమాజాన్ని జోడించే వెసులుబాటు ఉండటం, నాటకం లాగా హంగు ఆర్భాటం అవసరం లేకపోవడం వల్ల బుర్రకథ పాటలాగే ప్రజలకు దగ్గరైంది. జంగం కథ, శారద కథ వంటి ప్రాచీన వారసత్వ ప్రజా కళా రూపాల కలయికతో గత శతాబ్దంలో కన్ను తెరిచిన బుర్రకథ ఎన్నో ఉద్యమాలకు ఊపిరి పోసింది.

బుర్ర కథలపై కర్ర పెత్తనం



డాక్టర్ అయాచితం శ్రీధర్
98498 93238



నిజాం వ్యతిరేక ఉద్యమ సమయంలో ఎన్నెన్నో సాంస్కృతిక, సాహిత్య రూపాలు అగ్నికి గాలి తోడైనట్టు నిలిచాయి. ప్రత్యేకించి కష్టజీవి, తెలంగాణ, సీతారామరాజు బుర్రకథలు నిజాం పాలకులకు నిద్ర లేకుండా చేశాయి. చరిత్ర సృష్టించిన 'మా భూమి' నాటక రచయితల్లో ఒకరైన సుంకర సత్యనారాయణ కష్టజీవి బుర్రకథ సృష్టికర్త. భూమి కోసం, భుక్తి కోసం జమీందారును రైతులు ఎదిరించడం కథ. ఈ కథలోని 'జాగేలనోయి రైతు బాబయ్య' లెండు లెండు నిద్రలేలా 'గొంతెత్తి కేకేయరా' పాటలు విడిగా కూడా విపరీత ప్రచారం పొందాయి. నాటి ఉద్యమకారులకు గొప్ప ఆయుధం లభించినట్టయింది. గాలి కంటే వేగంగా వ్యాపించిన కష్టజీవి బుర్రకథ ప్రదర్శించని గ్రామం నాడు తెలంగాణలో లేదంటే అతిశయోక్తి కాదు. ఈ బుర్రకథ రూపకల్పనలో సుంకరకు కాకునూరు సుబ్బారావు సహకరించారు. ఇదే కథను తిరునగరి రామాంజనేయులు హరికథగా మార్చగా, శ్రీకాకుళ ఉద్యమ సమయంలో సుబ్బారావు పాణిగ్రాహి జముకుల కథగా మార్చి రాశారు. సుంకర కష్టజీవి బుర్రకథపై నాటి నిజాం ప్రభుత్వం ఆంక్షలు విధించింది. ఇక సుంకర రాసిన మరో బుర్రకథ 'తెలంగాణ' పెను సంచలనమే సృష్టించింది. ఏకంగా నిజాం ప్రభువు మీదికే బాణం ఎక్కుపెట్టింది. రంగారెడ్డి అనే దేశ్‌ముఖ్‌తో పేద రైతైన గోపిరెడ్డి నాయకత్వంలో ఉద్యమకారులు జరిపిన భూ పోరాటం దాని వృత్తాంతం. ఈ బుర్రకథను గ్రామాల్లో ఎక్కడికక్కడ ప్రదర్శిస్తున్నారన్న సమాచారం అందుకున్న పోలీసులు ప్రభుత్వ ముఖ్య కార్యదర్శికి లేఖ రాశారు. ఆ లేఖనందుకున్న అధికారులు 'తెలంగాణ' బుర్రకథతో పాటు మరో బుర్రకథ 'సీతారామరాజు' బుర్రకథను, దేవులపల్లి వెంకటేశ్వరరావు రచించిన 'నిజాం ఆంధ్రుల పోరాటం' పుస్తకాలను నిషేధించాలని సిఫారసు చేశారు.

ఈ మేరకు నిజాం ప్రభుత్వం నిషేధపు ఉత్తర్వులు జారీచేసింది. 1946, డిసెంబర్ 8న వెలువడిన ఐదు వేల 'తెలంగాణ' బుర్రకథ ప్రతులు ఉద్యమకారుల చేతుల్లోకి వెళ్లిపోయాయి. పోలీసులకు ఎక్కడా లభించలేదు. చివరికి అంబర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని పెద్దపల్లి గ్రామానికి చెందిన కార్వ నారాయణరెడ్డి, బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన కోదండరామిరెడ్డి ఇండ్లలో బుర్రకథ ప్రతులు పోలీసులకు లభించాయి. 48 పేజీల పాకెట్ సైజ్ చిన్ని పుస్తకంలో విస్నూర్ దేశ్‌ముఖ్ గుండాల చేతుల్లో బలైన తెలంగాణ పోరాట యోధుడు 'బందగీ' పరిచయం, నాగలితో దున్నుతున్న రైతు, ఎద్దుల కాళ్ల కింద పడి నలిగిపోతున్న నిజాం తలపాగా ముఖచిత్రం నాటి ప్రభుత్వానికి కోపం తెప్పించింది. నిజాం ప్రభువుకు చిర్రెత్తించిన సుంకర మరో బుర్రకథ 'సీతారామరాజు'. 1946, అక్టోబర్ 19న వెలువడింది. దీని ప్రతులు కూడా పోలీసులకు నారాయణరెడ్డి, కోదండరామిరెడ్డి ఇళ్లల్లో దొరికాయి. అల్లూరి సీతారామరాజు ఉద్యమానికి, ఉద్యమ ప్రాంతానికి నిజాం రాజ్యానికి ఏ మాత్రం సంబంధం లేదు.

కానీ, అల్లూరి ఉద్యమస్ఫూర్తి ఎక్కడ తెలంగాణ ఉద్యమకారులను ప్రభావితం చేస్తుందోనని నిజాం ప్రభుత్వం నిషేధించింది. విజయవాడకు చెందిన పొన్నలూరి రాధాకృష్ణమూర్తి సీతారామ రాజు నవల రాయడం కోసం మన్యం ప్రాంతం పర్యటించి విస్తృతమైన సమాచారం సేకరించారు. ఆ రాత ప్రతులను బ్రిటిష్ పోలీసులకు దక్కకుండా సుంకర దాచి ఉంచాడు. బహుశా ఈ బుర్రకథకు అదే ప్రేరణ కావచ్చు.

ఈ బుర్రకథలను నియంత్రించడం నిజాం ప్రభుత్వానికి సాధ్యం కాలేదు. పుస్తక ప్రతుల అవసరం లేకుండా మౌఖికంగానే ఒకరి నుంచి ఒకరికి వ్యాప్తి చెందాయి. ఎక్కడ ఏ మూలకు ఎవరు ఈ బుర్రకథలు చెబుతున్నారో? ఏ సంచార బృందాలు ఏ గ్రామాల్లో తిరుగుతున్నాయో? పసిగట్టలేని నిస్సహాయ స్థితికి చేరుకున్నారు పోలీసులు. తుదకు నిజాం ప్రభువు ఏకంగా 'బుర్రకథ' కళారూపాన్ని నిషేధించాడు. అది పౌరాణికమైన, చారిత్రకమైన కథ ఏదైనా బుర్రకథ ప్రదర్శించడానికి వీల్లేదని ఫర్మానా జారీచేశాడు.

48 పేజీల పాకెట్ సైజ్ చిన్ని పుస్తకంలో విస్నూర్ దేశ్‌ముఖ్ గుండాల చేతుల్లో బలైన తెలంగాణ పోరాట యోధుడు 'బందగీ' పరిచయం, నాగలితో దున్నుతున్న రైతు, ఎద్దుల కాళ్ల కింద పడి నలిగిపోతున్న నిజాం తలపాగా ముఖచిత్రం నాటి ప్రభుత్వానికి కోపం తెప్పించింది.

మనం మరిచిన వీరచక్ర



బసవరాజు నరేందర్‌రావు
99085 16549



(నేడు కెప్టెన్ విజయ రఘునందన్‌రావు వర్ధంతి)

'వీరగంధము దెచ్చినారము- వీరు డెవ్వడొ తెల్పుడీ!

పూసి పోదుము, మెడను వైతుము-పూలదండలు భక్తితో!!' కవిరాజు త్రిపురనేని రామస్వామి చౌదరి కలం నుంచి వెలువడిన ఈ గీతం మన వీరుల పట్ల నాటి మన సమాజానికి ఉన్న భక్తి భావానికి దర్పణంగా నిలుస్తుంది. వీరుల వీరగాథలను పాటల రూపంలో, గేయాల రూపంలో వర్ణిస్తూ నాటి సాహిత్యం సమాజంలో దేశభక్తిని పెంపొందింపజేసేది. అయితే, కాలం మారింది. కాలంతో పాటు సాహిత్యం, దానితో పాటు సమాజ విలువలు కూడా మారిపోయాయి. ఈ మార్పుల పరిణామ క్రమంలో మన దేశ రక్షణలో తమ ప్రాణాలను బలిపెట్టిన వివిధ ప్రాంతాల మహా వీరులెందరినో మనం మరిచిపోయాం. ఆ విధంగా మరచిపోబడిన వారిలో మన తెలంగాణలోని సిరిసిల్లకు చెందిన వీరచక్ర అవార్డీ (మరణానంతరం వచ్చింది) కెప్టెన్ విజయరఘునందన్‌రావు కూడా ఒకరు.

1965లో పాకిస్థాన్‌తో జరిగిన యుద్ధంలో మిలిటరీలోని గూర్ఖా రైఫిల్స్ విభాగానికి చెందిన కెప్టెన్ విజయరఘునందన్‌రావు తన దళానికి సారథ్యం వహించి అఖ్నూర్-చాంబ్ సెక్టార్‌లో పాకిస్థాన్ సైన్యంతో పోరాడుతూ శత్రువుల బుల్లెట్ల దాడికి గురై 1965, సెప్టెంబర్ 17న యుద్ధభూమిలోనే వీర స్వర్గం పొందారు. తన శరీరం నుంచి రక్తం వెల్లువలా ప్రవహిస్తున్నా, తనకవి చివరి క్షణాలని తెలిసినా లెక్క చేయకుండా తన కింది కమాండర్‌కు తన బాధ్యతలను అప్పగిస్తూ శత్రువుతో పోరాడమని ప్రోత్సహిస్తూ తుదిశ్వాస విడిచాడు. ఆయన త్యాగం ఆ సెక్టార్‌లో మన దేశానికి విజయాన్నందించింది. ఆయన త్యాగాన్ని, నేతృత్వాన్ని, పోరాట పటిమను గుర్తించిన భారత ప్రభుత్వం 1966లో వీరచక్ర పురస్కారంతో (మరణానంతర) గౌరవించింది. ఆయన బెటాలియన్‌కు, ఉమ్మడి ఏపీ రాష్ట్రానికి అదే మొదటి వీరచక్ర పురస్కారం. రాజన్న సిరిసిల్ల జిల్లాలోని బోనాల గ్రామంలో 1939, ఆగస్టు 5న బోనాల కూచగిరిరావు-కాంతమ్మ దంపతులకు విజయ రఘునందన్‌రావు జన్మించారు. ఆయన ప్రాథమిక విద్యాభ్యాసం బోనాలలోనే జరిగింది. ఇక, హైదరాబాద్‌లోని చాదర్‌ఘాట్ హైస్కూల్ నుంచి, మెట్రికులేషన్, నిజాం కాలేజీ నుంచి ఇంటర్, ఓయూ నుంచి ఎల్ఎల్‌బీ పూర్తిచేశారు. ఇంటర్మీడియెట్ రోజుల్లోనే ఆయన ఎన్‌సీసీలో చేరి ఉత్తమ క్యాడెట్‌గా, రైఫిల్‌మెన్‌గా గుర్తించబడినారు. న్యాయశాస్త్ర పట్టా ఉన్నందువల్ల న్యాయవాదిగా వృత్తిని ఆరంభించి, రెండుచేతులా సంపాదించే అవకాశం ఉన్నా, దేశభక్తిని తన అణువణువునా రంగరింపజేసుకొన్న విజయ రఘునందన్‌రావు మిలిటరీలో చేరాలనుకొని 1962లో జాయింట్ సర్వీసింగ్ వింగ్ నిర్వహించిన ఎంపిక పరీక్షలో దక్షిణ భారతంలోనే ప్రథముడిగా నిలిచి సైన్యంలో సెకండ్ లెఫ్టినెంట్‌గా నియమించబడ్డారు. తన కృషి ఫలితంగా తన ప్రతిభా పాటవాలతో అతి కొద్ది కాలంలోనే కెప్టెన్ పదవిని పొందారు. 1965లో ఆయన స్వర్గస్థుడయ్యేనాటికి ఆయన వయస్సు 26 ఏండ్లు మాత్రమే.

ఆయన స్మృతి చిహ్నంగా 2000లో కరీంనగర్ పట్టణంలో ఆయన విగ్రహాన్ని నెలకొల్పారు. అప్పటి రక్షణమంత్రి జార్జ్ ఫెర్నాండెజ్ ఆ విగ్రహాన్ని ఆవిష్కరించారు. అంతేగాక కరీంనగర్ ఐబీ గెస్ట్‌హౌజ్ నుంచి ప్రభుత్వ వైద్యశాలకు వెళ్లే మార్గానికి కెప్టెన్ విజయ రఘునందన్‌రావు రోడ్‌గా నామకరణం చేశారు. వీటితో పాటు బోనాల-సిరిసిల్ల రోడ్ మార్గంలో విజయ నగరమనే ఊరు వెలసింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక నాటి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు నిర్ణయం మేరకు రాష్ట్ర ప్రభుత్వం 7వ తరగతి తెలుగు పాఠ్య పుస్తకంలో గర్వించదగిన తెలుగు బిడ్డ కెప్టెన్ విజయ రఘునందన్ రావు శీర్షికతో ఒక పాఠ్యాంశాన్ని రూపొందించింది. ఏదేమైనా అతి పిన్న వయస్సులో దేశం కోసం ప్రాణాలర్పించిన కెప్టెన్ విజయ రఘునందన్ రావు జీవితం నేటి యువతకు స్ఫూర్తిదాయకం, భావితరాలకు పూజనీయం.



జితేందర్‌సాయి (ఫైల్)



పామర్తి శశాంక్ (ఫైల్)

ప్రాణాలు తీసిన ఆట సరదా

సీతారామ కాల్వలో పడి ఇద్దరు చిన్నారుల మృతి

సత్తుపల్లిటౌన్, సెప్టెంబర్ 16: నీళ్లలో ఆట సరదా ఇద్దరు చిన్నారులను బలి తీసుకున్నది. ఈ ఘటన సోమవారం ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలం బుగ్గపాడు గ్రామంలో చోటుచేసుకుంది. సోమవారం సెలవు దినం కావడంతో బుగ్గపాడు గ్రామానికి చెందిన మడుపల్లి జితేందర్‌సాయి (9), పామర్తి శశాంక్ (9) మరో మిత్రుడు చరణ్‌తో కలిసి మధ్యాహ్నం భోజనం తర్వాత ఆడుకునేందుకు గ్రామ సమీపంలోని సీతారామ ప్రాజెక్టు కాల్వ వద్దకు వెళ్లారు. ఆడుకునేందుకు శశాంక్, జితేందర్‌సాయి నీటిలోకి దిగగా.. ఒడ్డునే ఉన్న చరణ్ వారిద్దరినీ వారించాడు. కాల్వలో నిలిచిన నీటిలోకి ప్రమాదవశాత్తు జారి ఇద్దరూ పడిపోయారు. మిత్రులు ఎంతకూ కనిపించకపోవడంతో ఆందోళన చెందిన చరణ్ పరిగెత్తుకుంటూ వెళ్లి కుటుంబ సభ్యులకు చెప్పాడు. దీంతో జితేందర్‌సాయి తండ్రి శ్రీను, మరికొందరు గ్రామస్థులతో కలిసి కాల్వకు వద్దకు వెళ్లి చూడగా.. ఇద్దరు చిన్నారులు నీటిపై తేలియాడుతూ కనిపించారు. వారిని బయటకు తీసి ప్రైవేటు వాహనంలో సత్తుపల్లి ప్రభుత్వ దవాఖానకు తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్టు నిర్ధారించారు. ఈ మేరకు సత్తుపల్లి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. అధికారులు, కాంట్రాక్టు సంస్థ నిర్లక్ష్యంతోనే సీతారామ ప్రాజెక్టు కాల్వ నీటిలో పడి ఇద్దరు చిన్నారులు మృతి చెందారని, దీనికి కాంట్రాక్టు సంస్థ ప్రసాద్ కో కంపెనీ బాధ్యత వహించాలని డిమాండ్ చేస్తూ గ్రామస్థులు కంపెనీ కార్యాలయం ఎదుట సోమవారం రాత్రి ఆందోళన చేపట్టారు. తక్షణమే కంపెనీ యాజమాన్యం స్పందించి మృతిచెందిన చిన్నారుల కుటుంబాలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

సీఎం పదవి నుంచి దించేదాకా వదలను

- ప్రజలపక్షాన మాట్లాడితే చంపుతవా?
- ఈటల వద్ద 25 కోట్లు తీసుకున్నవ్ : కౌశిక్‌రెడ్డి
- రేవంత్‌ది అరాచక పాలన: కేపీ వివేకానంద



తెలంగాణ భవన్‌లో సోమవారం మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి. చిత్రంలో ఎమ్మెల్యేలు కేపీ వివేకానంద, డాక్టర్ సంజయ్‌కుమార్, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్ రెడ్డి తదితరులు

హైదరాబాద్, సెప్టెంబర్ 16 (నమస్తే తెలంగాణ) : ప్రజల పక్షాన మాట్లాడుతున్నందుకు, హామీల అమలుపై నిలదీస్తున్నందుకు సీఎం రేవంత్‌రెడ్డి తనను చంపాలని ప్రయత్నిస్తున్నాడని, అందుకే తన ఇంటిపై దాడి చేశారని ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ఆరోపించారు. రేవంత్‌రెడ్డిని పీసీసీ అధ్యక్షుడిగా తానే చేశానని, ఇప్పుడు రేవంత్ సీఎం పదవి నుంచి దిగిపోయేదాకా నిద్రపోను అని, కేసీఆర్ ముఖ్యమంత్రి అయ్యేదాకా విశ్రమించకుండా పనిచేస్తానని ప్రకటించారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు చేసేదాకా రేవంత్‌రెడ్డి గుండెల్లో నిద్రపోతానని తెలిపారు. తనకు ఏదైనా జరిగితే రేవంత్‌రెడ్డే బాధ్యుడని, తనను చంపేందుకు యత్నించిన రేవంత్‌రెడ్డిపై సెక్షన్ 307 కింద కేసు నమోదు చేయాలని డీజీపీ, సీపీని డిమాండ్ చేశారు. లేకుంటే గవర్నర్‌ను కలుస్తామని చెప్పారు. తెలంగాణ భవన్‌లో సోమవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ తన ఇంటిపై దాడికి వెళ్లింది తమవాళ్లేనని సీఎం ఒప్పుకొన్నారని, స్వయంగా ఎమ్మెల్యే ఇంటిపై దాడికి పంపించానని చెప్పడం సిగ్గుచేటని మండిపడ్డారు. తనను ఎందుకు హత్య చేయాలని అనుకుంటున్నారో సీఎం చెప్పాలని డిమాండ్ చేశారు. సమస్యలపై, కాంగ్రెస్ హామీలపై నిలదీస్తున్నందుకు తనను హత్య చేయాలనుకుంటున్నారా? అని ప్రశ్నించారు. కౌశిక్‌రెడ్డి ఇంటిపైకి తమ వాళ్లే వెళ్లారని సీఎం చెప్పినా డీజీపీ, హోం సెక్రటరీ ఎందుకు స్పందించడంలేదని నిలదీశారు. ఎమ్మెల్యే ఇంటిపై దాడి జరిగితే సైబరాబాద్ సీపీ ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. నెక్నాంపూర్ వాసవి ఇంజినీరింగ్ కాలేజీ సమీపంలోని వేసెల్లా విల్లాస్ శివానందరెడ్డి అనే బిల్డర్‌ను బెదిరించి రేవంత్‌రెడ్డి తన సోదరుడు తిరుపతిరెడ్డికి ఫ్లాట్ ఇప్పించాడని, ప్రజల నుంచి ఒత్తిడి రావడంతో ఇల్లు కూలగొడతానని తన సోదరుడికి చెప్పి నోటీసులతో సరిపెట్టారని గుర్తుచేశారు. హుజూరాబాద్ ఉప ఎన్నికలో రేవంత్‌రెడ్డి పీసీసీ అధ్యక్షుడిగా ఈటల రాజేందర్ దగ్గర రూ.25 కోట్లు తీసుకొని ఈటెల గెలుపు కోసం సహకరించారని, అందుకే తాను కాంగ్రెస్ నుంచి బీఆర్‌ఎస్‌లో చేరానని తెలిపారు.

హైకోర్టు తీర్పుతో కాంగ్రెస్‌లో ప్రకంపనలు : కేపీ వివేకానంద

ఫిరాయింపులపై హైకోర్టు తీర్పు తర్వాత కాంగ్రెస్‌లో ప్రకంపనలు మొదలయ్యాయని ఎమ్మెల్యే కేపీ వివేకానంద దుయ్యబట్టారు. రేవంత్‌రెడ్డి సంకుచిత మనస్తత్వంతో మాట్లాడి తన దీనస్థితిని బయటపెట్టుకున్నారని విమర్శించారు. పార్టీ మారిన పది మంది ఎమ్మెల్యేలు అభద్రతాభావంలో ఉన్నారని చెప్పారు. పది మంది ఎమ్మెల్యేలపై చర్యల కోసం స్పీకర్‌ను కోరితే తమకు సమాధానం చెప్పలేక కౌశిక్‌రెడ్డి ఇంటిపైకి అరికెపూడి గాంధీని ఉసిగొల్పారని ఆరోపించారు. రేవంత్‌రెడ్డి రాష్ట్రంలో ఆటవిక, అరాచక పాలన కొనసాగిస్తున్నారని మండిపడ్డారు.

దిగజారుడు మాటలు బంద్‌చెయ్ : సంజయ్

రేవంత్‌రెడ్డి దిగజారుడు మాటలను బంద్ చేయాలని, ఆయన పొద్దునోమాట, రాత్రో మాట మాట్లాడుతున్నాని ఎమ్మెల్యే డాక్టర్ కే సంజయ్ కుమార్ మండిపడ్డారు. ఢిల్లీలో గాంధీ బీఆర్‌ఎస్ అని చెప్పి, హైదరాబాద్ రాగానే కాంగ్రెస్ ఎమ్మెల్యే అంటున్నారన్నారు. రాజకీయమంటే తిట్టాలి, కొట్టాలి అనే విధంగా తయారైందని, ఎందుకు రాజకీయాల్లోకి వచ్చామా అని రోజూ బాధపడుతున్నామని చెప్పారు. రేవంత్‌రెడ్డి ఎప్పటికీ కేసీఆర్ అంత గొప్పోడు కాలేడని చెప్పారు. ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ పార్టీ మారిన ఎమ్మెల్యేలు ఎటు కాకుండా పోయారన్నారు.దానం నాగేందర్, అరికెపూడి గాంధీ తమ ఎమ్మెల్యే పదవులకు రాజీనామా చేయాలని డిమాండ్‌చేశారు. బీఆర్‌ఎస్ కారు గుర్తుపై గెలిచిన దానం నాగేందర్, అరికెపూడి గాంధీ బీఆర్‌ఎస్‌పైనే విమర్శలు చేయడం విడ్డూరంగా ఉన్నదని మండిపడ్డారు.

ముఖ్యమంత్రి గారూ.. రుణమాఫీ ఎప్పుడు?

- తీవ్ర నిరాశలో రుణమాఫీకాని రైతులు
- కొందరు రైతులు ఆత్మహత్య చేసుకున్నారు
- షరతులు లేకుండా తక్షణమే మాఫీ చేయండి
- సీఎంకు రైతుల లేఖ.. సోషల్ మీడియాలో వైరల్

హైదరాబాద్, సెప్టెంబర్ 16 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలో రుణమాఫీకాని రైతులంతా తీవ్ర నిరాశలో ఉన్నారని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం అర్హులందరికీ రూ.2 లక్షల రుణ మాఫీ చేయాలని.. రుణమాఫీకాని రైతుల సంఘం సోమవారం సీఎంకు లేఖ రాసింది. ప్రతి కుటుంబానికి 2 లక్షల రుణమాఫీ చేస్తానని చెప్పి మాఫీ కాకపోవడం వల్లనే తాము లేఖ రాస్తున్నట్టు రైతులు పేర్కొన్నారు. రుణమాఫీ అవుతుందో లేదోననే ఆందోళనతో కొందరు రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని లేఖలో పేర్కొన్నారు. రెండు లక్షల కన్నా అధికంగా ఉన్న రుణాన్ని చెల్లిస్తేనే రుణమాఫీ అన్న నిబంధనతో రైతులు దిక్కుతోచనిస్థితిలో ఉన్నారని, తక్షణమే ఆ నిబంధనలు ఎత్తివేయాలని కోరారు. ప్రతి కుటుంబంలో కనీసం ఒకరికైనా రెండు లక్షల వరకు రుణమాఫీ షరతులు లేకుండా చేయాలని సీఎం రేవంత్‌రెడ్డికి విన్నవించారు.

లేఖ సారాంశం..

'గౌరవ నీయులైన తెలంగాణ ముఖ్యమంత్రి గారికి..

అయ్యా..

మేమంతా రాష్ట్రంలో రుణమాఫీ కాని రైతులం. మాకు వివిధ బ్యాంకు ఖాతాలో రెండు లక్షలకు పైగా వ్యవసాయ రుణాలు కలవు. ప్రభుత్వం ప్రతి కుటుంబానికి 2 లక్షల రుణ మాఫీ చేస్తానని ఇప్పటివరకు రెండు లక్షలలోపు రైతులకే మాఫీ చేసింది. రుణమాఫీ ఎందుకు కాలేదో తెలియక వ్యవసాయశాఖ, బ్యాంకు అధికారుల చుట్టూ రైతులు తిరుగుతున్నారు. కొంత మంది తీవ్ర నిరాశతో ఆత్మహత్యలు చేసుకున్నారు. ఒకొక్కరి కుటుంబంలో నాలుగైదు లక్షలకుపైగా ఉన్నందున పైన ఉన్న డబ్బులు కడితేనే మాఫీ అవుతుందని చెప్పేసరికి దిక్కుతోచనిస్థితిలో రైతులు ఉన్నారు. ప్రతి కుటుంబంలో కనీసం ఒకరికైనా రెండు లక్షల వరకు రుణ మాఫీ షరతులు లేకుండా చేయాలని మీకు విన్నవించుకుంటున్నాం. మాయందు దయతలచి మాకు న్యాయం చేయాలని కోరుతున్నాం.' అని రెండు లక్షల పైనా అప్పు ఉండి రుణమాఫీ కానీ బాధిత రైతులు పేర్కొన్నారు.ఈ లేఖ ఇప్పుడు సోషల్‌మీడియాలో వైరల్‌గా మారింది.

కాలగర్భంలోకి అప్పర్ ప్రైమరీ స్కూళ్లు!

- ప్రాథమిక బడుల్లో విలీనానికి సర్కారు యోచన
- రద్దయ్యే ప్రమాదంలో 3,144 స్కూళ్లు

హైదరాబాద్, సెప్టెంబర్ 15 (నమస్తే తెలంగాణ): అప్పర్ ప్రైమరీ స్కూళ్లు.. వీటినే ప్రాథమికోన్నత బడులంటారు. 1 –7 తరగతుల వరకు ఉండే ఈ బడులు ఇక కాలగర్భంలో కలవనున్నాయి. వీటిని రద్దుచేసి, ప్రాథమిక బడుల్లో విలీనంచేసే అంశాన్ని రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పరిశీలిస్తుంది. ఇదే జరిగితే రాష్ట్రంలోని 3,144స్కూళ్లు కనుమరుగు కానున్నాయి. ఇటీవలి నిర్వహించిన విద్యాసంస్కరణల క్యాబినెట్ సబ్ కమిటీ సమావేశంలో ప్రాథమికోన్నత బడులపై చర్చ జరిగింది. విలీన అంశంపై అధ్యయనం చేసి నివేదికను అందించాలని విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశంను ఆదేశించింది. నివేదిక అనంతరం ప్రాథమికోన్నత బడుల విలీనం లాంఛనమేకానుంది.

తగ్గుతున్న ఎన్‌రోల్‌మెంట్

సర్కారు బడుల్లో కొంత కాలంగా ఎన్‌రోల్‌మెంట్ తగ్గుతున్నది. గతంలో 23 లక్షలుండగా, ఈ ఏడాదికి ఎన్‌రోల్‌మెంట్ 20– 18లక్షలకు తగ్గింది. 65.47శాతం సర్కారు బడులుంటే.. ఎన్‌రోల్‌మెంట్ 34.23శాతం మాత్రమే. ప్రాథమికోన్నత బడుల విషయానికి వస్తే 3,144 స్కూళ్లల్లో 15,491 మంది విద్యార్థులున్నారు. వీటిల్లో ఉపాధ్యాయ, విద్యార్థి నిష్పత్తిని పరిశీలిస్తే 1: 14గా ఉంది. అంటే విద్యార్థులు తక్కువ ఉండగా, టీచర్ల సంఖ్య అధికంగా ఉంది. ఎన్‌రోల్‌మెంట్ ఏటా తగ్గుతుండటంతో కొంతకాలంగా బడుల రేషనలైజేషన్‌ను అమలుచేస్తున్నారు. ఇటీవలీ టీచర్ల బదిలీల్లోనూ అంతర్గతంగా బడుల రేషనలైజేషన్‌ను అమలుచేశారు. దీనికి కొనసాగింపుగా ప్రాథమికోన్నత బడులను ప్రాథమిక బడుల్లో విలీనంచేసేందుకు రంగం సిద్ధంచేస్తుంది. 1,864 జీరో ఎన్‌రోల్‌మెంట్ స్కూళ్లుండగా.. ఇందులో పనిచేస్తున్న 1,617 మంది టీచర్లను ఇతర స్కూళ్లకు బదిలీచేయనుంది. దీంతో జీరో ఎన్‌రోల్‌మెంట్ స్కూళ్లు మూతపడ్డట్టే.

రాష్ట్రంలో ప్రాథమికోన్నత బడులు.. వాటిల్లోని విద్యార్థులు

విద్యార్థుల సంఖ్య	బడులు	టీచర్లు
0	36	73
1- 10	00	00
11-20	03	02
21-30	01	04
31-40	05	18
41-50	07	22
50 మంది	10	36



స్పీకర్, కాలె యాదయ్య మధ్య కోల్డ్‌వార్!

వికారాబాద్ సెగ్మెంట్‌లో కాంగ్రెస్ ఎమ్మెల్యేల మధ్య ఆధిపత్యపోరు

వికారాబాద్, సెప్టెంబర్ 16 (నమస్తే తెలంగాణ): స్పీకర్ ప్రసాద్‌కుమార్–చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య మధ్య కోల్డ్‌వార్ మొదలైంది. స్పీకర్‌కు తెలియకుండా యాదయ్య వికారాబాద్ నియోజకవర్గంలో రాజకీయం చేయడం అంతర్గత కుమ్ములాటకు దారి తీసింది. స్పీకర్ షిర్డీ వెళ్లిన సమయంలో వికారాబాద్ సెగ్మెంట్‌కు చెందిన పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులను యాదయ్య సీఎం వద్దకు తీసుకెళ్లడంపై ప్రసాద్‌కుమార్ గుర్రుగా ఉన్నట్టు సమాచారం. బీఆర్‌ఎస్ టికెట్‌పై గెలిచి కాంగ్రెస్‌లో చేరిన చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్యను నియోజకవర్గమంతటా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు వ్యతిరేకించడం, దాడులకు తెగబడుతుండటంతో ఆయన చేవెళ్ల కంటే వికారాబాద్ సెగ్మెంట్‌కే అధికంగా ప్రాధాన్యమిస్తున్నట్టు సమాచారం. ఆ విధంగా వికారాబాద్‌కు చెందిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలను రెండుమార్లు యాదయ్య సీఎం వద్దకు నడిపించినట్టు తెలిసింది. తాము కేవలం అభివృద్ధి పనుల కోసమే సీఎంను కలిసినట్టు యాదయ్య చెప్తున్నప్పటికీ ఆయన తన సొంత నియోజకవర్గం నేతలను కాకుండా స్పీకర్ అసెంబ్లీ సెగ్మెంట్‌కు చెందిన నాయకులకు సన్నిహితంగా కావడంపైనే రచ్చ మొదలైంది. తన నియోజకవర్గంలో కాలె యాదయ్య చేస్తున్న రాజకీయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి స్పీకర్ ప్రసాద్‌కుమార్ త్వరలోనే తీసుకెళ్తారని పార్టీ వర్గాలు స్పష్టం చేస్తున్నాయి.



నాగర్‌కర్నూల్ జిల్లాలో మునిగిన వట్టెం పంపుహౌస్ నుంచి నీటి తోడివేతను పరిశీలిస్తున్న మాజీ మంత్రి డాక్టర్ నాగం జనార్దన్‌రెడ్డి

ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే 'వట్టెం' మునక

మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డి

నాగర్‌కర్నూల్, సెప్టెంబర్ 16 (నమస్తే తెలంగాణ) : ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే వట్టెం పంప్‌హౌజ్ నీట మునిగిందని మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ నేత డాక్టర్ నాగం జనార్దన్‌రెడ్డి ఆరోపించారు. నాగర్‌కర్నూల్ జిల్లా కుమ్మెర సమీపంలో నీట మునిగిన వట్టెం(వెంకటాద్రి)రిజర్వాయర్ పంప్‌హౌజ్‌ను సోమవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా టన్నెల్‌లోకి వెళ్లి పంప్‌హౌజ్‌లో నీట మునిగిన మోటర్లను, అక్కడ జరుగుతున్న పనితీరును పరిశీలించారు. ఈఈ పార్థసారథితో మాట్లాడారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. పంప్‌హౌజ్ మునకకు వందశాతం ప్రభుత్వానిదే బాధ్యత అన్నారు. నీళ్లతో పంప్‌హౌజ్ మునుగుతుందని ప్రజలు తెలిపినా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారని ధ్వజమెత్తారు. అసలు అధికారులకు బుద్ధి ఉందా..? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. పనుల నిర్వహణలో బాధ్యతారాహిత్యానికి కారణమైన ఏజెన్సీపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వీలైనంత త్వరగా టన్నెల్‌లోని నీటిని తోడి బురుదలో కూరుకుపోయిన మోటర్లను వెలికి తీయాలని సూచించారు. లేకుంటే రూ.2,600 కోట్ల విలువైన మోటర్లకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఈ ప్రాజెక్టును గత కేసీఆర్ ప్రభుత్వం దాదాపుగా పూర్తిచేసిందని, దీన్ని ప్రారంభిస్తే తమకు పేరు రాదనే ఉద్దేశంతోనే కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డి నిర్లక్ష్యం చేస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో అత్యంత నిర్లక్ష్యానికి గురైన ప్రాజెక్టు ఏదైనా ఉందంటే.. అది పాలమూరు ఎత్తిపోతల పథకమే అని పేర్కొన్నారు. పాలమూరు బిడ్డను అని చెప్పుకొనే సీఎం రేవంత్‌రెడ్డి దాదాపు పూర్తయిన పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో అధిక వర్షాలకు దెబ్బతిన్న పంటల వివరాలను బయటపెట్టాలన్నారు. రూ.2లక్షల రుణమాఫీ వందశాతం చేయాలని డిమాండ్ చేశారు.

నీళ్లు విడుదల చేయాలని రైతుల ఆందోళన

పంటలు ఎండుతున్నాయని సర్కారుపై ఆగ్రహం

తిప్పర్తి, సెప్టెంబర్16: నల్లగొండ జిల్లా తిప్పర్తి మండలానికి సాగునీరు అందించే డీ–40 కాల్వకు నీటిని విడుదల చేయాలని పలు గ్రామాల రైతులు సోమవారం కాల్వ వద్ద నిరసన తెలిపారు. రైతులు మాట్లాడుతూ.. నిరుడు సాగర్ ప్రాజెక్టులో నీళ్లు లేవని కాల్వకు నీటి విడుదల చేయలేదని, ప్రస్తుతం నాగార్జునసాగర్ పూర్తిస్థాయిలో నిండినప్పటికీ కాల్వకు నీరు విడుదల చేయడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. డీ–40 కాల్వ ద్వారా తిప్పర్తి, పజ్జూరు, ఎర్రగడ్డలగూడెం, వెంకటాద్రిపాలెం, ఇండ్లూరు, సర్వారంతోపాటు మాడ్గులపల్లి, వేములపల్లి మండలాల్లోని పలు గ్రామాలకు సాగునీరు అందుతుందని తెలిపారు. వానకాలం సీజన్ ముగిసే దశకు వచ్చినా నేటికీ కాల్వకు నీరు విడుదల చేయకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయని వాపోతున్నారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి స్పందించి వెంటనే నీటిని విడుదల చేయించాలని డిమాండ్ చేశారు.

ప్రాజెక్టుల స్వాధీనానికే కేంద్రం మొగ్గు

మొదటిపేజీ తరువాయి...

తెలపాలని సుప్రీంకోర్టు ఆదేశించడంతో కేంద్ర జల్‌శక్తి శాఖ తాజాగా అఫిడవిట్‌ను దాఖలు చేసింది. ప్రాజెక్టుల స్వాధీనానికి, నిర్వహణకు సిద్ధంగా ఉన్నామని, అందుకు సంబంధించి గెజిట్‌ను కూడా జారీ చేశామని, అయితే ఇరు రాష్ట్రాలు సీడ్‌మనీని చెల్లించాల్సి ఉన్నదని కోర్టుకు నివేదించింది.

సాగర్‌ను గాలికొదిలేసిన రేవత్ సర్కారు

నాగార్జునసాగర్ డ్యామ్‌ను తెలంగాణ ఆధీనంలోకి తీసుకువచ్చే అంశాన్ని రేవంత్‌రెడ్డి సర్కారు పూర్తిగా గాలికి వదిలేసినట్టు స్పష్టమవుతున్నది. ఆ డ్యామ్ 10 నెలల నుంచి సీఆర్పీఎఫ్ బలగాల ఆధీనంలోనే ఉంది. అయినా కాంగ్రెస్ ప్రభుత్వం దృష్టి సారించకపోవడమే ఇందుకు నిదర్శనం. అసెంబ్లీ ఎన్నికలకు ముందు నిరుడు నవంబర్ 29న అర్ధరాత్రి వేళ ఏపీ సర్కారు అప్రజాస్వామికంగా సాయుధబలగాలతో సాగర్ డ్యామ్‌పైకి తరలివచ్చి సీసీ కెమెరాలు ధ్వంసం చేసి కుడికాలువ హెడ్ రెగ్యులేటరీని,13వ నంబర్ వరకు ఉన్న గేట్లను ఆక్రమించింది. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన రేవంత్ సర్కారు ఈ ఘటనపై కొన్ని రోజులు హడావుడి చేసింది. సాగర్ డ్యామ్‌ను ఎట్టిపరిస్థితుల్లో బోర్డుకు అప్పగించబోమని, తిరిగి తెలంగాణ ఆధీనంలోకి తీసుకొస్తామని ప్రగల్భాలు పలికింది. ఆ తర్వాత అందుకు విరుద్ధంగా డ్యామ్‌తోపాటు పలు అవుట్‌లెట్లను అప్పగిస్తామని జనవరి 17న కేంద్ర జల్‌శక్తి శాఖ, ఫిబ్రవరి 1న కేఆర్‌ఎంబీ నిర్వహించిన సమావేశాల్లో అంగీకరించింది. దీనిపై తెలంగాణవాదులు, ఇంజినీర్లు ఆగ్రహం వ్యక్తం చేయడంతో మాటమార్చిన కాంగ్రెస్ సర్కారు.. ప్రాజెక్టులను బోర్డుకు అప్పగించేదిలేదని అసెంబ్లీలో తీర్మానం చేసింది. కంటితుడుపు చర్యగా కేంద్ర జల్‌శక్తిశాఖకు లేఖ రాసి చేతులు దులుపుకున్నది.



ఎల్‌ఎండీ గేట్ల ఎత్తివేత

తిమ్మాపూర్, సెప్టెంబర్ 16: కరీంనగర్ శివారులోని లోయర్ మానేరు జలాశయం పూర్తిస్థాయి నీటి మట్టానికి చేరుకోవడంతో సోమవారం ఉదయం ఎల్‌ఎండీ ఎస్‌ఈ రమేశ్ స్విచ్ ఆన్ చేసి 10, 11 నంబర్ గేట్లను ఎత్తి 3000 క్యూసెక్కుల నీటిని దిగువన మానేరు వాగులోకి వదిలారు. ఉదయం 9.30 గంటల సమయానికి ప్రారంభించిన గేట్లు 11 గంటలకే మూసివేశారు. శ్రీ రాజరాజేశ్వర జలాశయం నుంచి ఇన్‌ఫ్లో తగ్గడంతో మూసివేసినట్లు అధికారులు తెలిపారు. కాకతీయ కాలువ ద్వారా 2 వేల క్యూసెక్కుల నీటి విడుదలను కొనసాగిస్తున్నారు.

ఇప్పటికీ సీఆర్పీఎఫ్ ఆధీనంలోనే

కేఆర్‌ఎంబీ ఆధీనంలో ఉన్న సాగర్ డ్యామ్ ఇప్పటికీ సీఆర్పీఎఫ్ నిఘాలోనే కొనసాగుతున్నది. డ్యామ్‌కు మరమ్మతులు చేపట్టాలన్నా, ఇరు రాష్ట్రాల అధికారులను అనుమతించాలన్నా కేఆర్‌ఎంబీ అనుమతి తప్పనిసరి అని కేంద్రం గతంలోనే సీఆర్పీఎఫ్‌కు స్పష్టమైన ఆదేశాలు జారీచేసింది. దీంతో బోర్డు నుంచి అనుమతిపత్రాన్ని తీసుకుంటేతప్ప డ్యామ్‌పైకి సీఆర్పీఎఫ్ ఎవరినీ అనుమతించడంలేదు. ఏపీ మాత్రం 13 గేట్లు, హెడ్ రెగ్యులేటరీ తమ ఆధీనంలో ఉంటాయని రోజుకో పేచీ పెడుతున్నది. గత వేసవిలో సాగర్ టెయిల్‌పాండ్ నుంచి రాత్రికి రాత్రే 3 టీఎంసీల జలాలను తరలించుకుపోయిన ఏపీ.. బోర్డు అనుమతితో తెలంగాణ ఏ చిన్న పని చేపట్టినా మోకాలడ్డుతున్నది. డ్యామ్‌పై సీఆర్పీఎఫ్ బలగాల మోహరింపుతో తెలంగాణ ఇంజినీర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇంత జరుగుతున్నా రేవంత్ సర్కారు ఆ వైపు కన్నెత్తి చూడటం లేదు. ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నల్లగొండ జిల్లాకు చెందినవారే అయినప్పటికీ సాగర్ డ్యామ్‌ను తిరిగి తెలంగాణ ఆధీనంలోకి తీసుకొచ్చేందుకు చర్యలు చేపట్టకపోగా కనీసం ఆ అంశంపై మాట్లాడటం లేదు.

మేడిగడ్డకు తగ్గిన వరద

మహదేవపూర్: జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం అంబట్‌పల్లిలోని మేడిగడ్డ బరాజ్ వద్ద వరద ప్రవాహం సోమవారం తగ్గుముఖం పట్టింది. బరాజ్ ఇన్‌ఫ్లో 1,75,430 క్యూసెక్కులు ఉండగా 85 గేట్లు ఎత్తి నీటిని దిగువకు వదులుతున్నారు. ప్రస్తుత ప్రవాహం రివర్ బెడ్ నుంచి 91.00 మీటర్ల ఎత్తులో కొనసాగుతున్నది.

21న సీతారాం ఏచూరి సంస్మరణ సభ

హైదరాబాద్, సెప్టెంబర్16 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సీతారాం ఏచూరి సంస్మరణ సభ ఈనెల 21న నిర్వహిస్తామని సీపీఎం రాష్ట్రకార్యదర్శి తమ్మినేని వీరభద్రం తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. పార్టీ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ సభకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్, సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, ఎమ్మెల్సీ కోదండరాం తదితరులు హాజరుకానున్నారని పేర్కొన్నారు. వామపక్ష మేధావులు, ప్రజాస్వామిక వాదులు ఈ సభకు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

మునక 500 ఎకరాలు.. ఎండేది 50 వేల ఎకరాలు

మొదటిపేజీ తరువాయి...

తర్వాత నీటిని విడుదల చేసినా పొలాలకు నీరు చేరాలంటే ఇంకో పదిహేను రోజులు పడుతుంది. అప్పటివరకు మరో 20 వేల ఎకరాలకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉంది. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఇద్దరు మంత్రులు ఉన్నా ఖమ్మం జిల్లా మంత్రులు షట్టర్లు వెల్డింగ్ చేసి నీటిని తరలించుకుపోతే నోరు మెదపకపోవడంతో కాలువ గండి పడిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పుడు కండ్ల ఎదుటే వరి పంట ఎండిపోతుంటే పట్టించుకోవడం లేదని మండిపడుతున్నారు.

మంత్రుల అసమర్థతే శాపం

నాగార్జునసాగర్ ఆయకట్టు రైతులకు ఉమ్మడి నల్లగొండ జిల్లా మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అసమర్థత శాపంగా మారింది. బీఆర్‌ఎస్ హయాంలో నాగార్జునసాగర్ డెడ్ స్టోరేజీ లెవల్‌లోనూ పంటలకు నీళ్లిచ్చి రైతులను ఆదుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గత యాసంగి సీజన్‌లో ఒక్క తడికి నీళ్లను ఇవ్వాలని రైతులు గగ్గోలు పెట్టినా ఇవ్వకపోవడంతో దాదాపు లక్షన్నర ఎకరాల్లో పంట ఎండింది. అదే సమయంలో ఖమ్మం జిల్లాకు సాగు, తాగు నీటి కోసం ఆ జిల్లా మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సూర్యాపేట జిల్లాలోని కాల్వల ద్వారా నీటిని తరలించుకుపోయారు. ఎక్కడైనా రైతులు తూములు ఎత్తి పంటలను కాపాడుకుంటారేమోనని ఎస్కేప్ రెగ్యులేటర్లు, తూముల షట్టర్లను తెరువరాకుండా వెల్డింగ్ చేసి మరీ నీటిని తీసుకుపోయారు. జిల్లా మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి దానిపై కనీసం నోరు మెదపలేదు. మరోపక్క వెల్డింగ్‌లు తొలగించకుండానే వానకాలం పంటల సాగుకు నీటిని విడుదల చేయడంతో ఇటీవల భారీ వర్షాలకు నడిగూడెం మండలం కాగిత రామచంద్రాపురం వద్ద సాగర్ కాల్వకు గండి పడి దాదాపు 500 ఎకరాల్లో పంట నీటి మునిగింది. ఇప్పుడు దాదాపు 30 వేల ఎకరాల్లో వరి పంట ప్రశ్నార్థకంగా మారింది.



సూర్యాపేట జిల్లా అనంతగిరి మండలం తెల్లబండతండాలో ఎండి వరి పైరు

ప్రశ్నార్థకంగా 50 వేల ఎకరాల పంటలు

కాగితరామచంద్రాపురం వద్ద సాగర్ ఎడమ కాల్వకు గండి పడడంతో ఎగువన నాగార్జునసాగర్ ఎడమకాల్వపై తడకమళ్ల, పొనుగోడు రిజర్వాయర్, మునగాల వద్ద షట్టర్లను క్లోజ్ చేసి నీటి ప్రవాహాన్ని తగ్గించారు. గండి పడే కంటే ముందు సాగర్ మెయిన్ కెనాల్‌లో 9వేల క్యూసెక్కుల నీరు ప్రవహించగా గండి ప్రభావంతో ప్రస్తుతం 4వేలకు తక్కువే ఉన్నట్టు అధికారులు చెప్తున్నారు. గండి కారణంగా కోదాడ, నడిగూడెం, అనంతగిరి, మునగాల మండలాల్లో దాదాపు పూర్తిగా నీళ్లు రావడం లేదు. నేరేడుచర్ల, గరిడేపల్లి, పాలకీడు, హుజూర్‌నగర్, మఠంపల్లి, మేళ్లచెరువు, పెన్‌పహాడ్ మండలాలకు కొంత మేర అందుతున్నాయి. పదిహేను రోజులుగా నీటి ప్రవాహం తగ్గడంతో ఆయా మండలాల్లో ఇప్పటికే దాదాపు 30వేల ఎకరాల్లో పంటలు ఎండిపోతున్నట్టు తెలుస్తున్నది. మరో వారం రోజుల్లో గండి పూడుస్తామని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆదివారం చెప్పారు. గండి పూడ్చిన తరువాత నీటిని విడుదల చేసినా ప్రస్తుతం ఎండిపోయి నెర్రెలు బారి ఉన్నందున పంట పొలాల్లోకి పూర్తి స్థాయిలో నీరు చేరాలంటే మరో పదిహేను రోజులు పడుతుందని రైతులు వాపోతున్నారు. నీళ్లు వచ్చే సమయానికి మరో 20 వేల ఎకరాలకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉంది. అంతేగాక ఎండుదశలో ఉన్న పొలాలకు నీళ్లు వచ్చినా వరితోపాటు కలుపు విపరీతంగా పెరిగి అదే స్థాయిలో ఎరువుల వాడకం ఉంటుందని, దిగుబడి కూడా భారీగా పడిపోతుందని వ్యవసాయ శాఖ అధికారుల ద్వారా తెలిసింది.

పొలాలు నెర్రెలు వారుతున్నాయి



సాగర్ ఎడమ కాల్వ కింద 20 ఎకరాల్లో వరి సాగు చేశాను. కాగితరామచంద్రాపురం వద్ద పడ్డ గండితో నీళ్లు బంద్ పెట్టారు. పొలాలకు నీళ్లు లేక నెర్రెలు వారి ఎండిపోతున్నాయి. ప్రభుత్వం త్వరగా పనులు పూర్తి చేసి పంటలను కాపాడాలి.

- గునుగుంట్ల నరేశ్, రైతు, నడిగూడెం

ఇండస్ట్రియల్ పార్క్‌ల్లో వసూళ్ల దందా!

- నిర్మాణం మొదలుకాగానే గద్దల్లా వాలుతున్న నేతల అనుచరులు
- లబోదిబోమంటున్న పారిశ్రామికవేత్తలు

హైదరాబాద్, సెప్టెంబర్ 16(నమస్తే తెలంగాణ): తెలంగాణ రాష్ట్రం ఆవిర్భావం తరువాత గత పదేండ్లలో దాదాపు 56 కొత్త పారిశ్రామికవాడలు ఏర్పాటయ్యాయి. ఆయా పారిశ్రామికవాడల్లో పరిశ్రమల ఏర్పాటుకు ముందుకొచ్చే వారి కోసం ప్రభుత్వం సబ్సిడీ ధరకు భూములను కేటాయించింది. ఇందులో చాలా మంది ఇదివరకే పరిశ్రమలు ఏర్పాటు చేసుకోగా, ఇంకా అనేకమంది వివిధ కారణాలతో పరిశ్రమలు ఏర్పాటు చేసుకోలేకపోయారు. బ్యాంకుల నుంచి రుణ సహాయం, భాగస్వామ్యాలు కుదుర్చుకోవడం, సాంకేతికత సమకూర్చుకోవడం, మార్కెటింగ్ అంశాల వల్ల జాప్యం జరిగినట్టు చెప్తున్నారు. ఇవన్నీ సమకూర్చుకొని ఇప్పుడు పరిశ్రమల ఏర్పాటుకు ముందుకొస్తుంటే వారికి స్థానిక నేతల నుంచి బెదిరింపులు ఎదురవుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. తమకు కొంత సమర్పించుకుంటే తప్ప నిర్మాణాలు ముందుకు సాగవని పారిశ్రామికవేత్తలను భయాందోళనకు గురిచేస్తున్నట్టు తెలిసింది. ముఖ్యంగా మేడ్చల్, పటాన్‌చెరు జోన్ల పరిధిలో ఈ సమస్య ఎక్కువగా ఉన్నది. చందన్‌వల్లి, కర్కపట్ల బయోటెక్ పార్క్, బండ తిమ్మాపూర్ జనరల్ పార్క్, ముప్పిరెడ్డిపల్లి, కుచారం, బండ మైలారం, తునికి బొల్లారం, వర్గల్, మందపల్లి, పాశమైలారం, శివనగర్ తదితర ఇండస్ట్రియల్ క్లస్టర్లలో స్థానిక నేతల అనుచరులు బెదిరింపులకు పాల్పడుతున్న ఆరోపణలున్నాయి.

అన్నీ సిద్ధం చేసుకున్నాక ఊహించని షాక్

టీజీఐఐసీకి బాధితుల నుంచి ఫిర్యాదులు అందుతున్నా.. వారు ఏమీ చేయలేక చేతులెత్తేస్తున్నారు. ఒక్కసారి భూమి విక్రయించిన తరువాత పరిశ్రమ ఏర్పాటు చేసుకునే బాధ్యత కొనుగోలుదారుపై ఉంటుందని, భూమికి సంబంధించి ఏమైనా న్యాయపరమైన, టైటిల్ పరమైన ఇబ్బందులు తలెత్తుతే మాత్రమే తాము జోక్యం చేసుకుంటామని టీజీఐఐసీ అధికారులు చెప్తున్నారు. నాయకులు పెట్టే ఇబ్బందులను క్షేత్రస్థాయిలో పరిష్కరించుకోవాలని సలహా ఇస్తున్నారు.

పదేండ్లు సాఫీగా సాగిన పారిశ్రామికం

కేసీఆర్ హయాంలో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటే భూముల కేటాయింపు జరగగా, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు స్వేచ్ఛగా పరిశ్రమలను ఏర్పాటు చేశారు. అటు అధికారులు కానీ, ఇటు నాయకులు గానీ వారిని ఇబ్బందులకు గురిచేసిన దాఖలాలు లేవు. పరిశ్రమల శాఖ మంత్రిగా కేటీఆర్ ఉండటంతో పారిశ్రామికవేత్తలను ఇబ్బంది పెట్టే సాహసం చేయలేదు.

అన్నా.. నెల దాటిందే!

మొదటిపేజీ తరువాయి...

ఉన్న నిర్మాణాలను కూల్చివేయాలని ఆగస్టు 8న సీఎం అన్నకు నోటీసులు ఇచ్చినా.. వాటిని ముట్టుకొనే ధైర్యం చేయటం లేదు.

నెల గడిచినా అటువైపు కన్నెత్తి చూడలె

కాంగ్రెస్, టీడీపీ పాలనలోనే చెరువులు అన్యాక్రాంతం అయినట్టు వచ్చిన ఆరోపణలకు అమర్ కో ఆపరేటివ్ సొసైటీ నిదర్శనం. కేబుల్ బ్రిడ్జి నిర్మాణంతో ప్రస్తుతం పర్యాటక కేంద్రంగా నిలిచిన దుర్గం చెరువు 85 ఎకరాల విస్తీర్ణంలో విస్తరించి ఉన్నది. ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్లలోని ప్రాంతాలను పూడ్చివేసి కాలనీలు, రెసిడెన్షియల్ ప్రాజెక్టులను దశాబ్దాల క్రితమే నిర్మించారు. అలా ఏర్పడినవే అమర్ కో ఆపరేటివ్ హౌజింగ్ సొసైటీ, కావూరి హిల్స్, కల్యాణ్‌నగర్, బృందావన్ కాలనీ, హెక్టార్ గార్డెన్ కాలనీలు. 2000లో వచ్చిన వరదలోనూ ఈ ప్రాంతంలోని పలు కాలనీలు నీట మునిగాయని ఇరిగేషన్, రెవెన్యూశాఖలు గుర్తించాయి. అప్పట్లోనే చెరువు భూముల్లో నిర్మించిన భవనాలను వ్యతిరేకిస్తూ కొందరూ కోర్టును ఆశ్రయించగా.. ఎఫ్‌టీఎల్ పరిధిలో అనుమతుల్లేని భవనాలను ఇరిగేషన్, రెవెన్యూ, హుడా అధికారులు తొలగించారు. కానీ పెద్దల ప్రోద్బలం ముందు అధికారులు ముందుకు వెళ్లలేకపోయారు. దీంతో ఆక్రమణలపై చర్యలు నిలిచిపోయాయి. ఇరిగేషన్, హెచ్‌ఎండీఏ, రెవెన్యూ అధికారులు ఇచ్చిన ఆధారాలతో ఈ భూములు రెసిడెన్షియల్ కార్యాకలాపాలకు అనుకూలం కాదని, రీక్రియేషనల్ జోన్‌గా మార్చాలని అప్పట్లోనే హైకోర్టు ఆదేశించింది. అయినా ఆ ఆదేశాలను బేఖాతరు చేస్తూ యథేచ్ఛగా నిర్మాణాలు సాగుతూనే ఉన్నాయి. కూల్చివేతలతో హడావుడి చేసిన హైడ్రా.. సంపన్నుల భవనాలు, విల్లాలతో నిండిపోయిన అమర్ కో ఆపరేటివ్ సొసైటీకి మాత్రం నోటీసులతో సరిపెట్టింది. ఇప్పటికి నెలన్నర గడిచినా అటువైపు చూడటం లేదు.



హైడ్రా కూల్చివేతల్లో భాగంగా సున్నం చెరువు వద్ద అధికారులు కరెంట్ కట్ చేయడంతో సోలార్ లైట్ వెలుతురులో చదువుకుంటున్నామని సోలార్ లైట్ చూపిస్తున్న విద్యార్థి

- నోటీసుల్లేవ్.. అక్రమ నిర్మాణాలు కూల్చుడే అన్నరు!
- మరెందుకు సీఎం సోదరుడికి నోటీసులు ఇచ్చినరు?
- బుల్డోజర్లతో సామాన్యుల ఇండ్లు బూడిద చేసింర్రు!
- మరెందుకు సీఎం సోదరుడి ఇల్లు ఇంకా ముట్టుకోలె?
- చెరువు కట్టల దగ్గర ఏ కట్టడమున్నా తుక్కుతుక్కు చేసింర్రు!
- మరి సీఎం సోదరుడు ఉండే అమర్ సొసైటీ సంగతేంది?
- నోటీసులిచ్చి నెల గడిచిపాయె! చర్యల జాడ లేకపాయె!!
- హైడ్రా సారూ.. గిట్లుంటదా లెక్క?

సీఎం సోదరుడికీ నోటీసులు

అక్రమ నిర్మాణాల విషయంలో హైడ్రా తీరు మొదట్నుంచీ అనుమానంగా ఉన్నది. అమర్ కో ఆపరేటివ్ సొసైటీలో ఉండే సీఎం రేవంత్‌రెడ్డి సోదరుడి ఇంటికి కూడా రెవెన్యూ అధికారులు నోటీసులు జారీచేశారు. కానీ ఆ తర్వాత అటు వైపు కన్నెత్తి చూడలేకపోయారు. కూల్చివేతలు దేవుడెరుగు.. కనీసం ఆయా నిర్మాణాల ఆక్రమణల విస్తీర్ణం కూడా తేల్చలేకపోయారు. సీఎం సోదరుడికీ నోటీసులు ఇచ్చామంటూ చెప్పుకున్నా కూల్చివేతల విషయంలో మాత్రం వెనకడుగు వేసినట్టు విమర్శలు వస్తున్నాయి. ప్రభుత్వ పెద్దల ఆదేశాలతోనే హైడ్రా నడుస్తున్నదన్న ఆరోపణలు వస్తున్నాయి.

సామాన్యుడికే హైడ్రా దెబ్బలు

చెరువులు, కుంటలను ఆక్రమించి చేపట్టిన నిర్మాణాల విషయంలో దూకుడుగా వ్యవహరిస్తున్న హైడ్రా కమిషనర్ రంగనాథ్.. సామాన్యుడు నిర్మించుకున్న ఇండ్లపైనే ప్రతాపం చూపుతుందనే విమర్శలను మూటగట్టుకుంటున్నారు. బిల్డర్లు, డెవలపర్లు చేసే తప్పిదాలతో సామాన్యుల కలల సౌధాలను కండ్ల ముందే కూలివేస్తున్నారు. గుండెలు బాదుకొని.. కంట నీరు తెచ్చుకుంటున్నా.. కనికరం లేకుండా కుటుంబాలను రోడ్డున పడేస్తున్నారు. కానీ రాజకీయ పలుకుబడితో చెరువులను చెరబట్టిన సంపన్నుల నిర్మాణాల జోలికిపోయే ధైర్యం మాత్రం చేయటం లేదు. ఎన్ కన్వెన్షన్ లాంటి నిర్మాణాలను కూల్చివేసి హడావుడి చేసినా.. అమర్ కో ఆపరేటివ్ సొసైటీ లాంటివి హైదరాబాద్‌లో లెక్కకు మించి ఉన్నాయి. కానీ ఇప్పటివరకు వాటిని గుర్తించింది లేదు. ఒకవేళ గుర్తించినా.. నోటీసులు చేరుతున్నాయి కానీ, బుల్డోజర్లు మాత్రం దరికి రావటంలేదు.

రంగనాథ్ దూకుడు ఎక్కడ?

నిబంధనలు అతిక్రమిస్తే ఎంతపెద్ద వారైనా, లీగల్ ఎదుర్కొని అక్రమ నిర్మాణాలు కూల్చివేస్తామని బీరాలు పోయిన హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఈ సొసైటీ విషయంలో దూకుడు ఎక్కడ? అని హైదరాబాద్‌వాసులు ప్రశ్నిస్తున్నారు. జల వనరులను నిర్వీర్యం చేసిన సంపన్నవర్గాల నిర్మాణాలను ఎందుకు కూల్చడం లేదని నిలదీస్తున్నారు. నోటీసులు లేకుండానే నిర్మాణాలు కూల్చివేతలకు దిగుతున్న హైడ్రా.. సంపన్నులు, రాజకీయ నేతలు నిర్మించుకున్న భవంతుల విషయంలో అదే తీరుగా ఎందుకు స్పందించటం లేదని ప్రశ్నిస్తున్నారు. రాత్రికిరాత్రి.. పొద్దుపొద్దగాల.. ఎంతోమంది పేదల ఇండ్లను కూల్చివేసిన హైడ్రా.. నెల అవుతున్నా అమర్ కో ఆపరేటివ్ సొసైటీ నిర్మాణాలను కూల్చివేయడం లేదెందుకు? అని నిగ్గదీసి అడుగుతున్నారు.

19 వరకు దోస్త్ సెల్ఫ్ రిపోర్టింగ్ గడువు

హైదరాబాద్, సెప్టెంబర్ 16 (నమస్తే తెలంగాణ): డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ (దోస్త్) ఆన్‌లైన్ సెల్ఫ్ రిపోర్టింగ్ గడువును అధికారులు పొడిగించారు. విద్యార్థుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఈ నెల 19 వరకు అవకాశమిచ్చినట్టు ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ ఆర్ లింబాద్రి తెలిపారు.

రెడ్ అలర్ట్ ప్రకటించిన 24 గంటల్లో కుంభవృష్టి

- 204.5 మిల్లీమీటర్ల వర్షం కురిస్తే అత్యంత భారీ వర్షం
- ఏడబ్ల్యూఎస్‌లతో వాతావరణ సమాచారంలో కచ్చితత్వం
- వాతావరణ శాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ శ్రావణి వెల్లడి

హైదరాబాద్, సెప్టెంబర్ 16 (నమస్తే తెలంగాణ):వాతావరణ హెచ్చరికలపై వాతావరణశాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ శ్రావణి పలు విషయాలు వెల్లడించారు. ఎల్లో అలర్ట్, ఆరెంజ్ అలర్ట్, రెడ్ అలర్ట్‌ల జారీ, ఉష్ణోగ్రతలు, వర్షపాతాల లెక్కింపు, తుఫానులు, వర్షపాతాన్ని కొలవటం.. వాటి కోసం వాడే పరికరాల పనితీరును వివరించారు. 'వర్షపాతం వివరాలతో పాటు 4 నెలల పాటు నైరుతి రుతుపవనాలు దేశానికి ముఖ్యమైనవి. వీటిపై పూర్తి వివరాలు తెలుసుకునేందుకు అబ్జర్వేటిస్ (రెయిన్‌గోస్), శాటిలైట్ మీజర్‌మెంట్స్, మేఘాలు (క్లౌడ్స్) కీలకమైనవి. మేఘాలు రెడ్ కలర్‌లో ఉంటే వర్షం కురిసే అవకాశం ఉంటుంది. శాటిలైట్‌లో 3డీ మీజర్‌మెంట్స్‌ను తీసుకుంటాం. దీంతో వచ్చే 10 రోజుల్లో ఏ ప్రాంతంలో ఎక్కువ వర్షపాతం ఉంటుందో తెలుసుకోవచ్చు. మేఘాల దిశ ఆధారంగా వచ్చే 3 గంటల్లో ఎక్కడ వర్షపాతం కురుస్తుందనేది తెలుసుకోవచ్చు. పిన్ పాయింట్ లోకేషన్‌లో వచ్చే అరగంటలో ఎక్కడెక్కడ వర్షం కురుస్తుందనేది తెలుసుకునేలా 'రెయిన్ అలారం యాప్'కు అనుసంధానం చేశాం. ఇది దేశంలోని అన్ని రాడార్‌ల చిత్రాల సమాచారాన్ని సేకరిస్తుంది. దీని ద్వారా చుట్టూ 10 కిలోమీటర్ల పరిధిలో ఎటువైపు వర్షం కురుస్తుందనేది తెలుసుకోవచ్చని' వెల్లడించారు.

24 గంటల్లో ప్రభుత్వానికి నివేదిక

'వర్షపాతాన్ని కొలిచేందుకు ముఖ్యంగా రెయిన్‌గేజ్ పరికరాన్ని ఉపయోగిస్తాం. 204.5 మిల్లీమీటర్లకు పైగా వర్షపాతం కురిసే అవకాశం ఉంటే దానిని అత్యంత భారీ వర్షంగా పేర్కొని.. రెడ్ అలర్ట్‌గా ప్రకటిస్తాం. రెడ్ అలర్ట్ ప్రకటించిన ప్రాంతాల్లో 24 గంటల్లో కుంభవృష్టి వర్షం కురుస్తుంది. వెంటనే ప్రభుత్వానికి నివేదిక ఇస్తాం' అని డాక్టర్ శ్రావణి తెలిపారు. బంగాళాఖాతం, అరేబియా మహాసముద్రంలో ఏర్పడిన ఆవర్తనం ఒకటి, రెండు రోజుల్లోనే అల్పపీడనంగా మారుతుంది. ఇది కొనసాగితే వాయుగుండంగా మారుతుంది.

వర్షపాతం కొలిచే సమయాలు

తెలంగాణలో అధికారికంగా రామగుండం, నిజామాబాద్, హైదరాబాద్‌లో ఐఎండీ కేంద్రాలు ఉన్నాయని వాతావరణశాఖ అధికారి రామారావు తెలిపారు. 'ఈ మూడు ప్రధాన కేంద్రాలతో పాటు రాష్ట్రవ్యాప్తంగా జిల్లా కేంద్రాలు, ఎంఆర్వో కేంద్రాలతో పాటు 60 ఆటోమెటిక్ వెదర్ స్టేషన్లు (ఏడబ్ల్యూఎస్) ఏర్పాటు చేశాం. ప్రతిరోజు ఉదయం 8.30, సాయంత్రం 5.30 గరిష్ఠ, కనిష్ఠ ఉష్ణోగ్రతలు, 12 గంటలు, 15 గంటలకోసారి వర్షపాతాన్ని లెక్కిస్తాం. జీహెచ్‌ఎంసీ సహకారంతో 140 కేంద్రాల నుంచి కూడా వాతావరణ సమాచారం సేకరిస్తున్నాం. రెయిన్‌గేజ్ ద్వారా వర్షపాతం గుర్తిస్తాం. 3 గంటలకు ఒకసారి లెక్కిస్తాం. ఎన్ని గంటలకు ఎంత వర్షపాతం నమోదైందని దీంతో తెలుస్తుం ది. స్టీవెన్ సన్‌స్క్రీన్ పరికరంతో ఉష్ణోగ్రతలను కొలుస్తాం. ఈ స్క్రీన్‌లో 4 థర్మామీటర్లు ఉంటాయని వెల్లడించారు.

జానీ మాస్టర్‌పై రేప్ కేసు

- ముంబై హోటల్‌లో లైంగికదాడి
- మతం మార్చుకుని వివాహం చేసుకోవాలని ఒత్తిడి
- పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధిత యువతి.. కేసు నమోదు



హైదరాబాద్ సిటీబ్యూరో/బండ్లగూడ, సెప్టెంబర్ 16 (నమస్తే తెలంగాణ): సినీ కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్‌పై లైంగిక వేధింపుల కేసు నమోదైంది. బాధితురాలు, పోలీసుల కథనం ప్రకారం.. 2017లో ఒక టీవీ షోలో పాల్గొన్న మహిళా డ్యాన్సర్‌తో కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్‌కు పరిచయం ఏర్పడింది. అప్పటి నుంచి జానీ మాస్టర్ లైంగిక వేధింపులకు గురిచేస్తున్నట్టు బాధితురాలు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. ముంబైలోని ఓ హోటల్‌లో తనపై లైంగిక దాడికి పాల్పడినట్టు తెలిపింది. నార్సింగి పోలీసులు జానీమాస్టర్‌పై 376,506,323 సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. బాధితురాలిని పోలీసులు ఇంట్లోనే విచారించారు. అనంతరం ఆమె నార్సింగి పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని మరిన్ని వివరాలను తెలిపింది. మతం మార్చుకుని వివాహం చేసుకోవాలని వేధిస్తున్నాడని చెప్పింది. ఒప్పుకోకుంటే అవకాశాలు రాకుండా అడ్డుకుంటానని బెదిరించినట్టు తెలిపింది. విచారణ తరువాత చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు.

ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తా.. రిజెక్ట్!

- హైడ్రా ఎఫెక్ట్‌తో అప్లికేషన్ల తిరస్కరణల వెల్లువ
- ఇప్పటికే 25 లక్షల్లో 3 లక్షల దరఖాస్తుల నిరాకరణ
- తీవ్ర ఒత్తిడికి లోనవుతున్న అధికారులు

హైదరాబాద్, సెప్టెంబర్ 16 (నమస్తే తెలంగాణ): లే అవుట్ రెగ్యులరైజేషన్ (ఎల్‌ఆర్‌ఎస్)పై హైడ్రా ప్రభావం పడింది. జీహెచ్‌ఎంసీ పరిధిలో జరుగుతున్న హైడ్రా కూల్చివేతల నేపథ్యంలో ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను అధికారులు తిరస్కరిస్తున్నారు. భవిష్యత్తులో తమకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా ఉండేందుకు అధికారులు చిన్న చిన్న కారణాలతోనూ అప్లికేషన్లను రిజెక్ట్ చేస్తున్నారు. ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్, నాలాలు సమీపంలో ఉన్నట్టు తెలిస్తే చాలు.. దరఖాస్తులను ఆమడదూరం పెడుతున్నారు. ఎఫ్‌టీఎల్ ఖరారు కాని చెరువులు, కుంటల పరిధిలోని అన్ని సర్వే నంబర్ల దరఖాస్తులను వెనక్కి పంపించేస్తున్నారు. మరికొన్ని ప్రాంతాల్లో షార్ట్ ఫాల్ డాక్యుమెంట్ పేరుతో దరఖాస్తుదారులను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్, నాలాలపై నీటి పారుదలశాఖ అధికారులు ఎన్వోసీ ఇస్తేనే ముందడుగు వేస్తున్నారు. వాస్తవానికి రాష్ట్రంలో దాదాపు ఏ చెరువుకూ ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లను ఖరారు చేయలేదు. కానీ ఎల్‌ఆర్‌ఎస్ పరిశీలిస్తున్న అధికారులు మాత్రం ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ పరిధిలోకి వస్తుందేమోనన్న ఉద్దేశంతో ఎన్వోసీ కావాలని అడుగుతున్నారు. దీంతో ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులు ముందుకు కదలటం లేదు. కొన్ని నిర్మాణాలకు అనుమతులు ఇచ్చినందుకు పలువురు అధికారులపై కేసులు నమోదయ్యాయి. ఈ నేపథ్యంలో తాము ఎల్‌ఆర్‌ఎస్‌కు ఓకే చేస్తే భవిష్యత్తులో ఇబ్బందులు వచ్చే ప్రమాదం ఉన్నదన్న ఆందోళనతో తిరస్కరించడం లేదా షార్ట్‌ఫాల్ డాక్యుమెంట్ రిమార్క్ చెప్తూ చేతులు దులుపుకుంటున్నారు. కొన్ని లేఅవుట్లలోని ప్లాట్లకు ఇప్పటికే ఎల్‌ఆర్‌ఎస్ క్లియరెన్స్ ఇచ్చినా.. అదే లేఅవుట్‌లోని మిగతా ప్లాట్లకు క్లియరెన్స్ ఇవ్వటానికి అధికారులు తర్జనభర్జన పడుతున్నారు. రాష్ట్రంలో ఎల్‌ఆర్‌ఎస్ కోసం 25.70 లక్షల దరఖాస్తులు రాగా, 65 వేల దరఖాస్తులను ఆమోదించారు. దాదాపు 3 లక్షల అప్లికేషన్లను తిరస్కరించడం, షార్ట్‌ఫాల్ డాక్యుమెంట్స్ పేరుతో ఆమోదించలేదు. మరోవైపు, ఎల్‌ఆర్‌ఎస్ ద్వారా ఖజానాను నింపుకోవచ్చని ప్రభుత్వం ఆశపడింది. కానీ, ఆ ఆశకు హైడ్రా గండికొడుతున్నది. అంటే.. పరోక్షంగా ప్రభుత్వం కూడా ఇరకాటంలో పడుతున్నది. ఈ పర్యవసానాల నేపథ్యంలో అటు ప్రజలు, ఇటు ప్రభుత్వం మరికొన్ని నెలలు ఎదురుచూసే పరిస్థితి ఏర్పడింది.

టీచర్ల కొరత తీర్చేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు

- విద్యాశాఖ వివరణ

హైదరాబాద్, సెప్టెంబర్ 16 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని మాడల్ స్కూళ్లలో టీచర్ల కొరతను తీర్చేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలంగాణ మాడల్ స్కూల్స్ డైరెక్టర్ శ్రీనివాసాచారి ఒక ప్రకటనలో తెలిపారు. '17 మాడల్ స్కూళ్లలో జీరో టీచర్లు' శీర్షికతో 'నమస్తే తెలంగాణ'లో సోమవారం కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆయన సోమవారం పత్రికా ప్రకటనను విడుదల చేశారు. రాష్ట్రంలోని 98 స్కూళ్లకు ప్రిన్సిపాళ్లు లేరు.. ఆయా పాఠశాలల్లో సీనియర్ టీచర్‌కు ప్రిన్సిపాల్ బాధ్యతలు అప్పగించడంతో పాటు, పీజీటీ, టీజీటీ టీచర్లు లేనిచోట అవర్లీ బేస్డ్ టీచర్లను తీసుకుంటామని తెలిపారు. ఇక ఇటీవల నిర్వహించిన బదిలీలతో కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని సిర్పూరు(యూ), మెదక్ జిల్లాలోని రేగోడు మాడల్ స్కూళ్లలో టీచర్లు లేరని ఆయన పేర్కొన్నారు.

ఏఐఎఫ్‌టీవో వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పింగిలి శ్రీపాల్‌రెడ్డి



హైదరాబాద్, సెప్టెంబర్ 16 (నమస్తే తెలంగాణ): అఖిల భారత ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య నేషనల్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా రాష్ట్రానికి చెందిన పింగిలి శ్రీపాల్‌రెడ్డి ఎన్నికయ్యారు. పీఆర్టీయూ టీఎస్ రాష్ట్ర అధ్యక్షుడిగా కొనసాగుతున్న ఆయనను ఆది, సోమవారాల్లో జరిగిన ఏఐఎఫ్‌టీవో జాతీయ సాధారణ కౌన్సిల్ సమావేశాల్లో వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎన్నుకున్నారు. 2021-24 వరకు జాతీయ ఉపాధ్యక్షుడిగా పని చేశారు. ఈ సందర్భంగా శ్రీపాల్‌రెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన యూపీఎస్‌ను రద్దుచేసి, పాత పెన్షన్‌ను పునరుద్ధరించే వరకు అన్ని ఉపాధ్యాయ సంఘాలను ఏకంచేసి పోరాడుతామని తెలిపారు. జాతీయ ఉపాధ్యక్షురాలు గీత, జాతీయ ముఖ్య సలహాదారు, ఎమ్మెల్సీ కూర రఘోత్తం రెడ్డి, మహిళా కార్యదర్శులు త్రివేణిదేవి, విజయలక్ష్మి, ఆనంద్‌రెడ్డి, రామేశ్వర్, రజిత, జ్యోతి హాజరయ్యారు. ఇక రాష్ట్రానికి చెందిన మరో ఉపాధ్యాయ సంఘం నేత మహమ్మద్ అబ్దుల్లా ఏఐఎఫ్‌టీవో సెక్రటరీగా ఎన్నికయ్యారు.

అటకెక్కిన 'ఎక్సైజ్' ఫైల్

- అతీగతీలేని కొత్త పోలీస్‌స్టేషన్ల ఏర్పాటు
- గత ప్రభుత్వ నిర్ణయాన్ని తొక్కిపెట్టిన రేవంత్ సర్కార్
- పని భారాన్ని తగ్గించాలని కోరుతున్న ఆబ్కారీ సిబ్బంది



హైదరాబాద్, సెప్టెంబర్ 16 (నమస్తే తెలంగాణ): ఎక్సైజ్ శాఖ ద్వారా వేల కోట్ల ఆదాయం పొందుతున్న రాష్ట్ర ప్రభుత్వం ఆ విభాగానికి వనరుల కల్పనను మాత్రం అటకెక్కించింది. ఎక్సైజ్ శాఖ నిర్వహణ సామర్థ్యాన్ని పెంచుతూ, యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు కొత్త ఎక్సైజ్ పోలీసు స్టేషన్లు ఏర్పాటు చేయాలన్న గత ప్రభుత్వ నిర్ణయాన్ని రేవంత్‌రెడ్డి ప్రభుత్వం తొమ్మిది నెలలుగా పట్టించుకోవడం లేదు. ఏడాదికి రూ. 200 కోట్లకు పైగా ఆదాయం ఉన్న ఎక్సైజ్ పోలీసుస్టేషన్లలో నిర్వహణ ఇబ్బందిగా ఉందని క్షేత్రస్థాయి నుంచి ఫిర్యాదులు వచ్చిన నేపథ్యంలో వాటిని రెండు స్టేషన్లుగా విభజించాలని గత కేసీఆర్ ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు 2022 ఆగస్టులో ఉత్తర్వులు జారీ చేసింది. ఆ మేరకు గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో 13 ఎక్సైజ్ పోలీసుస్టేషన్లు, ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఒక స్టేషన్‌ను కొత్తగా ఏర్పాటు చేయవచ్చని ఎక్సైజ్ కమిషనర్ కార్యాలయం నివేదికలు రూపొందించింది. ఇందుకు ఆర్థిక శాఖ నుంచి కూడా అనుమతులు వచ్చాయి. శేరిలింగంపల్లి, బాలానగర్, కూకట్‌పల్లి, మల్కాజిగిరి, ఘట్‌కేసర్, హయత్‌నగర్, సరూర్‌నగర్, శంషాబాద్, పటాన్‌చెరు, సికింద్రాబాద్, హన్మకొండ ఎక్సైజ్ పోలీసు స్టేషన్లను రెండుగా విభజించాలని సూచిస్తూ కమిషనర్ కార్యాలయం నివేదికలు సిద్ధం చేసింది. ఆ నివేదికను 2023 డిసెంబర్‌లో ఎక్సైజ్ అధికారులు ప్రభుత్వ అనుమతి కోసం పంపారు. ఈ లోగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం పోయి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఇక అప్పటి నుంచి ఫైల్ అటకెక్కింది.

నిరుద్యోగులకు అవకాశాలు వచ్చేవి

కొత్త ఎక్సైజ్ పోలీసుస్టేషన్లకు అనుమతించి ఉంటే.. ప్రతి స్టేషన్‌కు ఒక సర్కిల్ ఇన్‌స్పెక్టర్, ఇద్దరు సబ్ ఇన్‌స్పెక్టర్లు, ఇద్దరు హెడ్ కానిస్టేబుళ్లు, కనీసం 10 మంది కానిస్టేబుళ్లు మొత్తం 15 మందికి, 14 స్టేషన్లలో కలిపి కనీసం 210 మంది నిరద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు దక్కేవి. సర్వీస్‌లో ఉన్న వారికి పదోన్నతులు వచ్చేవి. ఉద్యోగ బదిలీలు జరిగేవి. ఒక్క సంతకంతో పూర్తయ్యే పనిని కాంగ్రెస్ ప్రభుత్వం తొమ్మిది నెలలుగా తొక్కి పెడుతున్నది. కొత్త ఎక్సైజ్ పోలీసుస్టేషన్లు ఏర్పాటు చేస్తే కేసీఆర్‌కు పేరు వస్తుందన్న ఏకైక కారణంతోనే ఫైల్‌ను పక్కన పెట్టారని ఎక్సైజ్ ఉద్యోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా కొత్త పోలీసుస్టేషన్లను ఏర్పాటు చేసి పని భారాన్ని తగ్గించటంతోపాటు, పదోన్నతులు, బదిలీలకు మార్గం సుగమం చేయాలని కోరుతున్నారు. దీనిపై ఎక్సైజ్ కమిషనర్ వివరణ కోసం ప్రయత్నించగా ఆయన అందుబాటులోకి రాలేదు.



కులగణన మార్చ్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న జాజుల శ్రీనివాస్‌గౌడ్ తదితరులు

25న కులగణన మార్చ్

- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్

ఖైరతాబాద్, సెప్టెంబర్ 16 : బీసీ సంక్షేమ సంఘం, బీసీ కులసంఘాల జేఏసీ ఆధ్వర్యంలో ఈ నెల 25న సమగ్ర కులగణన, బీసీలకు 42శాతం రిజర్వేషన్ల పెంపు డిమాండ్‌తో మిలియన్ మార్చ్ తరహాలో హైదరాబాద్‌లో లక్షలాది మందితో 'కులగణన మార్చ్' నిర్వహించనున్నట్టు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో బీసీ కులసంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేశ్ చారి, కన్వీనర్ బాలగాని బాలరాజుగౌడ్, వేముల వెంకటేశ్, మణిమంజరితో కలిసి కులగణన మార్చ్ పోస్టర్ ఆవిష్కరించారు. కులగణనపై కేంద్రంలో రాహుల్ గాంధీ ఓ మాట మాట్లాడుతుండగా, రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి అందుకు భిన్నంగా వ్యవహరిస్తుండడం కాంగ్రెస్ కుటిల నీతిని తెలియజేస్తుందని మండిపడ్డారు. కులగణనపై 48 గంటల్లోపు సీఎం స్పష్టమైన హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇంటికొకరు తరలిరావాలని పిలుపునిచ్చారు.

జడ్జి పోస్టుల్లో బీసీలకు అన్యాయం: ఆర్ కృష్ణయ్య

హైదరాబాద్, సెప్టెంబర్16 (నమస్తే తెలంగాణ) : జూనియర్ సివిల్ జడ్జి, డిస్ట్రిక్ట్ జడ్జి పరీక్షలు రాసిన బీసీలకు తీవ్ర అన్యాయం జరుగుతున్నదని, అందుకు ప్రస్తుత నోటిఫికేషన్‌లోని నిబంధనలే అడ్డంకిగా మారాయని, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్ కృష్ణయ్య అన్నారు. ప్రభుత్వం వెంటనే నిబంధనలు సవరించి ఓబీసీలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ జూనియర్ అడ్వకేట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం హైదరాబాద్‌లో నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కే లక్ష్మణ్, వీ హన్మంతరావు, జస్టిస్ చంద్రకుమార్, జక్కుల వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు పోషకాల్లేని పుడ్డు!

- భోజనానికి చెల్లిస్తున్నది రూ.27.59 మాత్రమే
- 3-6 ఏండ్లలోపు పిల్లల భోజనం ఖరీదు రూ.11.50
- మూడేండ్లలోపు పిల్లలకు ఇస్తున్నది 9.68 రూపాయలే
- రాష్ట్రంలోని అంగన్‌వాడీకేంద్రాల్లో దారుణ పరిస్థితులు




హైదరాబాద్, సెప్టెంబర్ 16 (నమస్తే తెలంగాణ): ప్లేట్‌మీల్స్ తినాలంటే రూ.80.. ఫుల్ మీల్స్ అయితే రూ.100 ఖర్చు అవుతుంది. అలాంటిది.. గర్భిణులు, బాలింతలు తినే భోజనానికి రాష్ట్ర ప్రభుత్వం పెడుతున్న ఖర్చు ఎంతో తెలుసా.. రూ.27.59 మాత్రమే. అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, చిన్నారులకు అన్ని రకాల పోషకాలతో భోజనం పెడుతున్నామని చెప్పుకుంటున్న ప్రభుత్వం.. ఇంత తక్కువ ఖర్చుతో ఏ స్థాయి పోషకాల పుడ్డు పెడుతున్నదో అర్థం అవుతున్నది. చాలీ చాలని ఆహార పదార్థాలు, అరకొరగా చెల్లించే కూరగాయల బిల్లులతో అంగన్‌వాడీకేంద్రాలను ఎలా నడిపించాలో తెలియక అక్కడి టీచర్లు లబోదిబోమంటున్నారు.

పోషకాలు లేని భోజనమే గతి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల లెక్కల ప్రకారం గర్భిణులు, బాలింతలకు 1192.38 క్యాలరీలు, 37.04 గ్రాముల ప్రొటీన్లు, 578.56 మిల్లీగ్రాముల క్యాల్షియం అందించాలి. ఈ పోషకాలు ఉండే భోజనం అందించాలంటే రూ.27.59 ఏం సరిపోతాయి? అని అంగన్‌వాడీ టీచర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బియ్యం, పప్పులు, నూనె వంటి వస్తువులను నేరుగా అంగన్‌వాడీలకు సరఫరా చేస్తున్న ప్రభుత్వం.. వంట ఖర్చులు/కూరగాయల కోసం డబ్బు చెల్లిస్తున్నది. అయితే కూరగాయల కోసం ఒక్కొక్కరికి రూ.1.50 మాత్రమే ఇస్తున్నది. చిన్నారులకు ఇందులో సగం.. అంటే రూ.0.75 చెల్లిస్తున్నది. ఒక అంగన్‌వాడీ కేంద్రంలో 10 మంది బాలింతలు ఉంటే వారికి రూ.15 చెల్లిస్తున్నది. చిన్నారులు 10 మంది ఉంటే వారికి రూ.7.50 మాత్రమే. అంటే 20 మందికి 22.50 తోనే కూరగాయల భోజనం పెట్టాలన్న మాట. 3-6 ఏండ్ల చిన్నారులకు 11.50, 7 నెలల నుంచి 3 ఏండ్లలోపు చిన్నారులకు రూ.9.68 చొప్పున వంట ఖర్చుల కోసం చెల్లిస్తున్న డబ్బులూ సరిపోవటం లేదన్నది టీచర్ల వాదన. 8 ఏండ్ల కిం దట నిర్ణయించిన ధరలనే ఇప్పటికీ అమలు చేస్తున్నారు.

వంట ఖర్చులకు రూ.8.67 చెల్లిస్తున్న విద్యాశాఖ

రాష్ట్రంలోని పాఠశాల విద్యాశాఖ పరిధిలో మధ్యాహ్న భోజన పథకంలో విద్యార్థులను మూడు క్యాటగిరీలుగా విభజించారు. మార్కెట్ లెక్కల ప్రకారం వంట ఖర్చులు (కూరగాయల కోసం) చెల్లిస్తున్నారు. వంటఖర్చులకు 1-5 స్కూల్ విద్యార్థులకు రూ.5.40, 6-8 తరగతుల వారికి రూ.8.17, 9-10 తరగతుల వారికి రూ.8.67 చొప్పున చెల్లిస్తున్నారు. అలాంటప్పుడు అంగన్‌వాడీ కేంద్రాలకు రూ.1.50 మాత్రమే ఎందుకు చెల్లిస్తున్నారోనని అంగన్‌వాడీ టీచర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



ధర్నాలో పాల్గొన్న రాములుయాదవ్, ఇతర యాదవ నాయకులు


గాంధీభవన్ ఎదుట యాదవుల ధర్నా

- మంత్రివర్గంలో చోటు కల్పించాలని డిమాండ్

హైదరాబాద్, సెప్టెంబర్ 16(నమస్తే తెలంగాణ) : తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం గాంధీభవన్ ఎదుట యాదవ సంఘం నాయకులు ధర్నాకు దిగారు. జాతీయ యాదవహక్కుల పోరాట సమితి అధ్యక్షుడు మేకల రాములు యాదవ్ నేతృత్వంలో బైఠాయించి యాదవ నేతలకు మంత్రివర్గంలో చోటుకల్పించడంతో పాటు నామినేటెడ్ పదవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్‌కు వినతిపత్రం అందించారు. గొల్లకురుమలకు మంత్రి పదవి, మూడు ఎమ్మెల్సీలు, ఆరు కార్పొరేషన్ చైర్మన్లు ఇవ్వాలని కోరారు.

సత్తా ఉన్నా.. సీఎం పోస్టు ఇవ్వరా?

- నాలాంటి దళితులకు ముఖ్యమంత్రి పీఠం అందని ద్రాక్షగానే ఉంటుందా?
- అధిష్ఠానంపై అసహనం వ్యక్తం చేసిన కర్ణాటక హోంమంత్రి పరమేశ్వర



(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, సెప్టెంబర్ 16 (నమస్తే తెలంగాణ): కర్ణాటక కాంగ్రెస్‌లో కుర్చీలాట రసకందాయంలో పడింది. సీఎం పీఠంపై తమకున్న ఆసక్తిని సీనియర్ నేతలు బహిరంగంగానే చెప్తున్నారు. ముఖ్యమంత్రి పదవికి తాను ఏ విధంగా అర్హుడిని కాదో చెప్పాలంటూ హోం మంత్రి డాక్టర్ జీ పరమేశ్వర ఏకంగా అధిష్ఠానాన్నే ప్రశ్నించిన తీరు ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ముడా, వాల్మీకి కుంభకోణాలతో పీకల్లోతు కష్టాల్లో చిక్కుకొన్న ముఖ్యమంత్రి సిద్ధరామయ్యకు ఈ పరిణామం మింగుడు పడటం లేదు.

పరమేశ్వర ఏమన్నారంటే?

తుమకూరులో ఆదివారం నిర్వహించిన ఓ కార్యక్రమానికి హాజరైన జీ పరమేశ్వర సీఎం పదవిపై తనకున్న ఆసక్తిని బయటపెట్టారు. ఆయన మాట్లాడుతూ.. 'బసవలింగప్ప, మల్లికార్జున స్వామి, కేహెచ్ రంగనాథ్, మల్లికార్జున ఖర్గే వంటి ఎందరో సీనియర్లు సీఎం పీఠానికి అర్హులు. ఆ మాటకొస్తే, నేను కూడా అర్హుడినే. అయితే, సీఎం పదవి మమ్మల్ని వరించదు. దళితులకు సీఎం పదవి అనేది అందని ద్రాక్షగానే ఉన్నది? సత్తా ఉన్నప్పటికీ నాలాంటి వారికి ముఖ్యమంత్రి పదవి ఎందుకు ఇవ్వరు? ఒకవిధంగా, ఆ బస్సును (పదవిని) మేం మిస్ అయ్యామనిపిస్తున్నది' అని పరమేశ్వర కాంగ్రెస్ అధిష్ఠానంపై ఒకింత అసహనం వ్యక్తం చేశారు. దీంతో 'మీరు ఆ బస్సును ఇంకా మిస్ అవ్వలేదం'టూ కార్యకర్తలు సభలో నినాదాలు చేశారు.

కొనసాగుతున్న కుర్చీలాట

వరుస స్కాంలతో ముఖ్యమంత్రి సిద్ధరామయ్యకు పదవీ గండం పొంచి ఉంది. ఈ నేపథ్యంలో ఆయన కుర్చీ దిగితే వెంటనే అందులో కూర్చునేందుకు కాంగ్రెస్ సీనియర్ నేతలు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్, హోంమంత్రి జీ పరమేశ్వర, సీనియర్ మంత్రి సతీశ్ జార్కిహోళి సీఎం పదవి కోసం తమ వంతు ప్రయత్నాలు చేస్తున్నారు. ఒకానొక సమయంలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే పేరు కూడా చర్చకు వచ్చింది. అయితే, సిద్ధరామయ్య తర్వాత ఎవరిని ముఖ్యమంత్రిని చేయాలనే అంశంలో కాంగ్రెస్ హైకమాండ్ సామాజికవర్గ సమీకరణాలను బేరీజు వేసుకుంటున్నట్టు తెలుస్తున్నది. బీసీ నాయకుడైన సిద్ధరామయ్యను తప్పిస్తే మరో బీసీ నేతకే అవకాశం ఇవ్వకపోతే బీసీలు దూరం అవుతారనే ఆందోళన హైకమాండ్‌కు ఉన్నట్టు తెలుస్తున్నది. ఈ అంశాన్ని పరిగణనలోకి తీసుకుంటే బీసీ నాయకుడైన జార్కిహోళి పేరును పరిశీలించవచ్చని తెలుస్తున్నది. ఈ క్రమంలోనే పరమేశ్వర పై వ్యాఖ్యలు చేసినట్టు రాజకీయ విశ్లేషకులు చెప్తున్నారు.

'వాల్మీకి స్కామ్' పాత్రధారికి కీలక పదవి

కర్ణాటక సర్కారు నిర్ణయంపై సర్వత్రా విమర్శలు

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, సెప్టెంబర్ 16 (నమస్తే తెలంగాణ): కర్ణాటకతో పాటు తెలంగాణ రాజకీయాలను కుదిపేస్తున్న 'వాల్మీకి కార్పొరేషన్' స్కామ్‌లో పాత్రధారిగా ఉండి, సస్పెన్షన్‌కు గురైన అధికారికి కర్ణాటక ప్రభుత్వం తిరిగి పోస్టింగ్ ఇచ్చింది. కార్పొరేషన్‌కు గతంలో డైరెక్టర్‌గా విధులు నిర్వహించి సస్పెన్షన్‌కు గురైన కల్లేశ్‌ను కర్ణాటక ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్‌కు చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ (సీఏవో)గా నియమిస్తూ ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. వాల్మీకి కార్పొరేషన్‌కు సంబంధించిన నిధుల వినియోగంపై వివరాలు ఇవ్వడంలో కల్లేశ్ ఉద్దేశపూర్వకంగా జాప్యం వహించాడన్న ఆరోపణలు ఉన్నాయి. అంతేకాదు, ఈ స్కామ్‌లో ఆయన పాత్ర కూడా ఉన్నదని విపక్షాలు ఆరోపించాయి. దీంతో సర్వత్రా ఒత్తిళ్లు రావడంతో గత జూన్‌లో ఆయన్ని సస్పెండ్ చేస్తూ ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది. అయితే, మూడు నెలలు గడువకముందే ప్రభుత్వం కల్లేశ్‌కు మళ్లీ కీలక పోస్టింగ్ ఇవ్వడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

కర్ణాటకలో 'వైద్య' సంక్షోభం!

- విష జ్వరాలతో అల్లాడుతున్న ప్రజలు
- దవాఖానల్లో సరిపడా లేని మందులు
- రాష్ట్రవ్యాప్తంగా 2 వేల మంది డాక్టర్ల కొరత
- సీఎం కుర్చీలాటలో బిజీగా కాంగ్రెస్ ప్రభుత్వం

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, సెప్టెంబర్ 16 (నమస్తే తెలంగాణ): విష జ్వరాలతో ప్రజలు అల్లాడిపోతున్నారు. గ్రామాల్లో పరిస్థితి మరింత అధ్వానంగా తయారైంది. రోగులకు వైద్యం చేయడానికి సరిపడా డాక్టర్లు లేరు. మందులు అసలే లేవు. ఇదీ కాంగ్రెస్ ఏలుబడిలో కర్ణాటకలో కనిపిస్తున్న ప్రస్తుత పరిస్థితి. అయితే, ప్రజారోగ్యాన్ని పట్టించుకోని సిద్దరామయ్య ప్రభుత్వం.. వరుస స్కాంలు, రాజకీయాలతో బిజీగా ఉండటం సర్వత్రా విమర్శలకు దారితీస్తున్నది.

మందులు లేవు.. డాక్టర్లు అసలే లేరు

ఇటీవల కురిసిన వర్షాలతో రాష్ట్రంలోని పలు గ్రామాలు, ఏజెన్సీల్లో డెంగ్యూ, చికెన్‌గున్యా, టీబీ వంటి విష జ్వరాలు పెద్దయెత్తున ప్రబలాయి. దీంతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు, జిల్లా దవాఖానలకు వేలాది మంది రోగులు క్యూకట్టారు. అయితే, ప్రభుత్వ దవాఖానల్లో తగినంత ఆరోగ్య సిబ్బంది, డాక్టర్లు లేకపోవడంతో వైద్య సేవలు ఎక్కడికక్కడ నిలిచిపోయే దుస్థితి వాటిల్లింది. రాష్ట్రంలోని ప్రభుత్వ దవాఖానల్లో 1,940 డాక్టర్ పోస్టులు ఖాళీగా ఉన్నట్టు హెల్త్ కమిషనర్ శివకుమార్ కేబీ స్వయంగా వెల్లడించారు. ఇక, ఏజెన్సీ ప్రాంతాల్లోని ఆరోగ్య కేంద్రాల్లో పారాసిటమాల్ వంటి మందు గోలీలు కూడా లేకపోవడం ఆందోళన కలిగిస్తున్నది. ఇది ఇలాగే కొనసాగితే, రాష్ట్రంలో ఆరోగ్య సంక్షోభం నెలకొనవచ్చని ఆరోగ్య నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాగా ప్రభుత్వ దవాఖానలకు సరఫరా చేయాల్సిన అత్యవసర మందుల్లో 190 రకాల మందులు అందుబాటులో లేవని ఆరోగ్యమంత్రి దినేశ్ గుండురావు ఇటీవల పేర్కొనడం ప్రస్తుత దుస్థితికి అద్దంపడుతున్నది.




ప్రభుత్వ దవాఖానల్లో వైద్యుల పోస్టులు ఖాళీ ఇలా..	
స్పెషలిస్టులు	744
జనరల్ డ్యూటీ మెడికల్ ఆఫీసర్లు	613
మెడికల్ ప్రొఫెషనల్స్	558
డెంటల్ డాక్టర్లు	25

రాజకీయాలతో బిజీబిజీ

ప్రజలు విషజ్వరాలతో ఒకవైపు అల్లాడిపోతుంటే సీఎం సిద్ధరామయ్య తన పదవిని కాపాడుకోవడంలో బిజీగా ఉన్నారని ప్రతిపక్షాలు మండిపడుతున్నాయి. ముడా, వాల్మీకి స్కాం ఆరోపణలతో సిద్ధరామయ్య సీఎం పదవి నుంచి దిగిపోతే, ఆ పోస్టును దక్కించుకోవడంలో ఇతర మంత్రులు బిజీగా ఉన్నట్టు ఎద్దేవా చేస్తున్నాయి. కాగా, విష జ్వరాలకు సంబంధించి గ్రామాల్లో కేసులు అంతకంతకూ పెరుగుతున్నాయని, అయితే, అక్కడి ఆరోగ్య కేంద్రాల్లో తగినంత మంది సిబ్బంది, మందులు, సదుపాయాలు లేకపోవడంతో తాము ఏమీ చేయలేని దుస్థితి వాటిల్లిందని బెంగళూరు మెడికల్ కాలేజీ అండ్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌కు చెందిన ఓ సీనియర్ డాక్టర్ ఆవేదన వ్యక్తం చేశారు.

చితకబాది.. నగ్నంగా పరుగెత్తించి

- బెంగళూరులో ఓ వ్యక్తిపై రౌడీషీటర్ అరాచకం
- సిద్ధరామయ్య సర్కారుపై ప్రతిపక్షాల తీవ్ర విమర్శలు



బెంగళూరు, సెప్టెంబర్ 16: కాంగ్రెస్ పాలిత కర్ణాటకలో శాంతిభద్రతల డొల్లతనాన్ని ఎత్తిచూపేలా ఓ షాకింగ్ ఘటన చోటు చేసుకున్నది. ఐటీ నగరం బెంగళూరులో ఓ రౌడీ షీటర్ రెచ్చిపోయాడు. ఓ వ్యక్తిని చితకబాదడమే కాకుండా నగ్నంగా వీధుల్లో పరుగెత్తించిన అమానుష ఘటన నగరంలోని కామాక్షిపాల్యలో జరిగింది. గుర్తు తెలియని ఆ వ్యక్తిని రౌడీషీటర్ దారుణంగా కొట్టాడు. బతికి ఉండాలంటే బట్టలిప్పేసి నగ్నంగా పరుగెత్తాలని ఆదేశించడంతో బాధిత వ్యక్తి అలా అందరూ చూస్తుండగా నడిరోడ్డుపై పరుగులు తీశాడు. అందరూ అతడిని అలా చూస్తూ ఉండిపోయారే తప్ప అతడిని ఆదుకోవడానికి ఎవరూ ధైర్యంగా ముందుకు రాలేదు. దీనికి సంబంధించిన వీడియో సోమవారం వైరల్ కావడంతో బెంగళూరు పోలీసులు నిందితుడిని పవన్ గౌడగా గుర్తించి అతడిని అరెస్ట్ చేశారు. బట్టలిప్పి నగ్నంగా మారాలంటూ పవన్ అతడిని బెదిరించడం, తనపై దయ చూపాలంటూ బాధితుడు అతడిని వేడుకుంటున్న దృశ్యం ఈ వీడియోలో ఉంది. తొలుత బాధితుడు బట్టలు తీసివేసి, తర్వాత వాటిని ధరించాడు. అయితే అలా చేసినందుకు అతడిని ఆ రౌడీషీటర్ కొట్టడమే కాక, నగ్నంగానే ఉండాలని ఆదేశించాడు. ప్రాణాలతో ఉండాలంటే బట్టల్లేకుండా పరుగెత్తాలని పవన్ బెదిరించడంతో బాధితుడు అలాగే చేయక తప్పలేదు. ఈ ఘటన 10 రోజుల క్రితం జరిగినట్టు తెలిసింది. ఈ అమానుష ఘటనతో కాంగ్రెస్ పాలిత కర్ణాటకలో పౌరుల భద్రతపై విపక్షాలు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నాయి. అయితే ఈ దాడికి కారణాలు తెలియరాలేదు.

ఢిల్లీలో ముందస్తు ఎన్నికలు లేనట్టే!

- మహారాష్ట్రతోపాటే ఎన్నికల నిర్వహణకు సుముఖంగా లేని ఈసీ
- కేంద్ర ఎన్నికల సంఘం వర్గాల వెల్లడి



న్యూఢిల్లీ, సెప్టెంబర్ 16: ఢిల్లీ అసెంబ్లీకి ముందస్తు ఎన్నికలు నిర్వహించాలంటూ సీఎం కేజ్రీవాల్ చేసిన డిమాండ్‌కు కేంద్ర ఎన్నికల సంఘం సుముఖంగా లేదని తెలిసింది. అధికార పార్టీ లేదా ఒక రాజకీయ పార్టీ ఆదేశాలతో ఎన్నికల షెడ్యూల్‌ను నిర్ణయించలేమని ఈసీ వర్గాలు తెలిపాయి. ఢిల్లీలో ఆప్ సర్కార్‌కు కావాల్సినంత సంఖ్యా బలముందని, అలాంటప్పుడు ముందస్తు ఎన్నికలు జరపాల్సిన అవసరమేముందని ఈసీ భావిస్తున్నది. మహారాష్ట్ర, జార్ఖండ్‌లతో కలిపి ఢిల్లీ ఎన్నికలు నిర్వహించాలనుకుంటే, అందుకు బలమైన కారణం ఈసీ చూపాల్సి ఉంటుందని రాజకీయ విశ్లేషకులు చెప్పారు.

నేడు కేజ్రీవాల్ రాజీనామా

అరవింద్ కేజ్రీవాల్ మంగళవారం ఢిల్లీ సీఎం పదవికి రాజీనామా చేయనున్నారు. ఆయన లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా అపాయింట్‌మెంట్‌ను కోరగా మంగళవారం సాయంత్రం 4.30 గంటలకు సమయం ఇచ్చారు. దీంతో కేజ్రీవాల్ ఎల్జీని కలిసి తన రాజీనామాను సమర్పించనున్నారు. ఆప్ ఎమ్మెల్యేలతో మంగళవారం సమావేశం కానున్నారు. ఈ సమావేశంలోనే కేజ్రీవాల్ తన పదవికి రాజీనామా చేస్తారని పార్టీ వర్గాలు తెలిపాయి. అలాగే ఈ సమావేశంలో కాబోయే కొత్త ముఖ్యమంత్రి పేరుపై కూడా చర్చిస్తారు. కాగా, సోమవారం పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ సమావేశంలో పాల్గొన్న కేజ్రీవాల్ కొత్త ముఖ్యమంత్రి అభ్యర్థి పేరుపై కొందరు నేతలతో ముఖాముఖీ సమావేశమయ్యారు.



కెనడాలో నీట మునిగి హైదరాబాద్ విద్యార్థి మృతి

హైదరాబాద్, సెప్టెంబర్ 16: హైదరాబాదీ యువకుడొకరు కెనడాలో ప్రమాదవశాత్తు నీట మునిగి మరణించాడు. రంగారెడ్డి జిల్లా మీర్‌పేటకు చెందిన ప్రణీత్ ఇటీవల కెనడా యూనివర్సిటీలో మాస్టర్స్ పూర్తి చేసి ఉద్యోగాన్వేషణ చేస్తూ స్నేహితులతో కలిసి ఉంటున్నాడు. శనివారం తన సోదరుడి పుట్టిన రోజు సందర్భంగా సోదరుడు, స్నేహితులతో కలిసి టొరంటో లేక్‌కు వెళ్లాడు. అయితే బోటింగ్ చేస్తుండగా, ప్రమాదవశాత్తు నీటిలో పడి మరణించాడు. అతని మృతదేహం కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. మృతుని కుటుంబ సభ్యులకు ప్రవీణ్ స్నేహితుడు సోమవారం సమాచారం అందించాడు. కాగా, ఆస్ట్రేలియాలోని క్వీన్‌ల్యాండ్స్‌లో ఇటీవల జరిగిన ప్రమాదంలో కూడా ఇద్దరు తెలుగు విద్యార్థులు ఇలాగే నీటిలో పడి మరణించారు.

చట్టాలు కాదు.. మన మైండ్‌సెట్ మారాలి

అప్పుడే మహిళల హక్కులకు రక్షణ: సీజేఐ

న్యూఢిల్లీ: దేశంలో బహిరంగ, ప్రైవేట్ ప్రదేశాలలో మహిళల హక్కుల పరిరక్షణకు చట్టపరమైన నిబంధనల కొరత ఏమీ లేనప్పటికీ, చట్టం ఒక్కటే న్యాయమైన వ్యవస్థను ఏర్పాటు చేయలేదని, సమాజం కూడా పితృస్వామ్య సామాజిక వైఖరిని విడనాడాల్సిన అవసరం ఉందని చీఫ్ జస్టిస్ డీవై చంద్రచూడ్ అన్నారు. సోమవారం ఆయన ఓ జాతీయ మీడియా సంస్థ నిర్వహించిన స్త్రీ శక్తి కార్యక్రమంలో ప్రసంగిస్తూ మంచి, కఠిన చట్టాలు మాత్రమే మహిళలకు పూర్తి ప్రయోజనాన్ని చేకూర్చలేవని, వీటన్నింటికీ అతీతంగా ముందు మన ఆలోచనా విధానంలో మార్పు రావాలని అన్నారు. మహిళల హక్కుల గురించి మాట్లాడటమంటే అది మహిళలకు సంబంధించినది కాదని అన్నారు. తాను అద్భుతమైన పాఠాలను, మహిళా సహచరుల నుంచి నేర్చుకున్నానని ఆయన చెప్పారు. ఉన్నతమైన సమాజం కావాలంటే మహిళలకు సమాన ప్రాతినిధ్యం కావాలని తాను నమ్ముతానని అన్నారు. తాము భారత రాజ్యాంగాన్ని ఆమోదించడానికి ముందే మహిళల జీవిత శాసనాన్ని స్త్రీవాది అయిన హన్సా మెహతా రూపొందించారని చంద్రచూడ్ అన్నారు.

రాహుల్ నాలుక కోస్తే రూ. 11 లక్షలు

శివసేన ఎమ్మెల్యే సంజయ్ గైక్వాడ్

ముంబై, సెప్టెంబర్ 16 (నమస్తే తెలంగాణ): రిజర్వేషన్లను రద్దు చేస్తామని మాట్లాడిన కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ నాలుక కోసిన వ్యక్తికి రూ.11 లక్షల బహుమతి ఇస్తానని మహారాష్ట్రలోని బుల్దానా శివసేన (షిండే వర్గం) ఎమ్మెల్యే సంజయ్ గైక్వాడ్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. రాహుల్ వ్యాఖ్యలతో రిజర్వేషన్లపై కాంగ్రెస్ వైఖరి బట్టబయలైందని మండిపడ్డారు. మహారాష్ట్రతో పాటు దేశవ్యాప్తంగా రిజర్వేషన్లపై ఆందోళనలు కొనసాగుతున్న తరుణంలో రాహుల్ ఈ విధంగా మాట్లాడడం ఎంత వరకు సబబు అని నిలదీశారు. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ వైఖరితో రాజ్యాంగం ప్రమాదంలో పడిందని ప్రచారం చేసి ఓట్లు దండుకున్న రాహుల్, ఇప్పుడు అంబేద్కర్ కల్పించిన రిజర్వేషన్లను తొలగిస్తామని చెప్పడం సరికాదన్నారు.



'నమో భారత్' రైలు ప్రారంభం

అహ్మదాబాద్, సెప్టెంబర్ 16: 'వందే మెట్రో' రైళ్ల పేరును 'నమో భారత్ ర్యాపిడ్ రైల్'గా కేంద్ర ప్రభుత్వం మార్చింది. ఈ మేరకు మొదటి రైలు ప్రారంభానికి ముందు నిర్ణయం తీసుకుంది. ఇప్పటివరకు మెట్రో రైళ్లు నగరాల్లోనే నడిచేవి. నగరాల మధ్య మెట్రో రైళ్లు నడిపించాలనే ఆలోచనతో ఈ నూతన రైళ్లను రైల్వే శాఖ తీసుకువస్తున్నది. గుజరాత్‌లోని అహ్మదాబాద్ – భుజ్ మధ్య నడిచే మొదటి 'నమో భారత్ ర్యాపిడ్ రైల్'ను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సోమవారం అహ్మదాబాద్‌లో ప్రారంభించారు. నాగ్‌పూర్ – సికింద్రాబాద్ మధ్య వందేభారత్ రైలు సహా పలు ఇతర రైళ్లు, అభివృద్ధి పనులను సైతం ఆయన ప్రారంభించారు.

మలప్పురంలో మాస్క్ మస్ట్

తిరువనంతపురం, సెప్టెంబర్ 16: నిఫా వైరస్‌తో 23 ఏండ్ల వ్యక్తి మరణించటంతో, కేరళలోని మలప్పురం జిల్లాలో తీవ్ర భయాందోళన నెలకొన్నది. వైరస్ ప్రభావిత ప్రాంతాల్లో స్కూల్స్, కాలేజీలు, అంగన్‌వాడీ కేంద్రాలు, సినిమా థియేటర్లను ప్రభుత్వం మూసేయించింది. ప్రస్తుతం జిల్లాలో ముగ్గురు వ్యక్తులు నిఫా వైరస్ లక్షణాలతో దవాఖానలో చికిత్స పొందుతున్నారు. దీంతో పలు వార్డులను కంటైన్‌మెంట్ జోన్లుగా ప్రకటించారు. ఇక్కడి ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. అందరూ మాస్కులు తప్పనిసరిగా ధరించాలని, జనం ఎక్కడా గుమికూడరాదంటూ జిల్లా కలెక్టర్ వీఆర్ వినోద్ నిషేధాజ్ఞలు జారీచేశారు. వైరస్ వ్యాప్తికి సంబంధించి కాంటాక్ట్ ట్రేసింగ్, పర్యవేక్షణ, ఫీవర్ సర్వే కోసం ఆరోగ్య శాఖ 16 కమిటీలను ఏర్పాటుచేసింది. మిలాద్-ఉన్-నబీ సందర్భంగా సోమవారం తలపెట్టిన ఊరేగింపును రద్దు చేసుకోవాల్సిందిగా మలప్పురం జిల్లా కలెక్టర్ మసీదు కమిటీలను కోరారు. దుకాణాలు, షాపింగ్ మాల్స్ ఉదయం 10 నుంచి రాత్రి 7 గంటల వరకు తెరిచి ఉంచుతున్నారు.

జమిలి సాధ్యం కాదు

- ప్రస్తుత రాజ్యాంగం అందుకు అనుమతించదు
- అలా చేయాలంటే ఐదు సవరణలు చేయాలి
- కాంగ్రెస్ సీనియర్ నేత పీ చిదంబరం వెల్లడి

ఛత్తీస్‌గఢ్, సెప్టెంబర్ 16: బీజేపీ సారథ్యంలోని ఎన్డీయే ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న 'వన్ నేషన్.. వన్ ఎలక్షన్ (ఒకే దేశం.. ఒకే ఎన్నిక)పై కాంగ్రెస్ సీనియర్ నేత పీ చిదంబరం ఘాటుగా స్పందించారు. ప్రస్తుత రాజ్యాంగం ప్రకారం ఇది ఎంతమాత్రమూ సాధ్యం కాదని, అలా చేయాలంటే రాజ్యాంగంలో కనీసం ఐదు సవరణలు చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఎన్డీయే హయాంలోనే జమిలి అమలుపై చిదంబరం స్పందిస్తూ.. రాజ్యాంగ సవరణలు చేసేందుకు ప్రధాని మోదీకి ఇటు లోక్‌సభలో కానీ, అటు రాజ్యసభలో కానీ సరిపడా బలం లేదని పేర్కొన్నారు. ఇండియా కూటమి దీనికి వ్యతిరేకమని తేల్చిచెప్పారు.

జమిలి ఎన్నికలు కేంద్రం గారడీ: టీఎంసీ

జమిలి ఎన్నికలపై కేంద్ర ప్రభుత్వ వర్గాలు ఇచ్చిన సమాచారంపై టీఎంసీ, సీపీఐ ఘాటుగా స్పందించాయి. టీఎంసీ ఎంపీ డెరెక్ ఒబ్రెయిన్ మాట్లాడుతూ, ప్రజాస్వామ్య వ్యతిరేక బీజేపీ చేస్తున్న మరో జిమ్మిక్ 'ఒక దేశం–ఒకేసారి ఎన్నికలు' అన్నారు. హర్యానా, జమ్ము కశ్మీరు శాసన సభల ఎన్నికలతోపాటు మహారాష్ట్ర శాసన సభ ఎన్నికలను కూడా ఎందుకు ప్రకటించ లేదని ప్రశ్నించారు. మహారాష్ట్ర ప్రభుత్వం ఈ బడ్జెట్‌లో లడకీ బహిన్ పథకాన్ని ప్రకటించిందని, మొదటి విడత సొమ్ము మహిళల బ్యాంకు ఖాతాలకు ఆగస్టులో చేరిందని చెప్పారు. రెండో విడత నిధులు లబ్ధిదారులకు అక్టోబరులో చేరే అవకాశం ఉందన్నారు. అందుకే మహారాష్ట్ర ఎన్నికలను ప్రకటించలేదని చెప్పారు. సీపీఐ ప్రధాన కార్యదర్శి డీ రాజా మాట్లాడుతూ, జమిలి ఎన్నికలను తమ పార్టీ సమర్థించదని చెప్పారు. భారత దేశం వైవిధ్య భరితమైన దేశమని, లోక్‌సభ, శాసన సభల పదవీ కాలాలు, ఎన్నికైన ముఖ్యమంత్రులు, రాష్ట్ర ప్రభుత్వాల అధికారాల గురించి రాజ్యాంగం స్పష్టంగా చెప్పిందన్నారు. ఎన్డీయే ప్రస్తుత పదవీ కాలంలోనే జమిలి ఎన్నికలనుఅమలు చేయబోతున్నట్లు కేంద్ర ప్రభుత్వ వర్గాలు తెలిపిన సంగతి తెలిసిందే.

ఒకే యాప్‌లో అన్ని రైల్వే సేవలు

- త్వరలో 'సూపర్ యాప్'
- రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 16: రైల్వేకు సంబంధించిన సేవలన్నీ ఒకే యాప్ ద్వారా అందుబాటులోకి తెస్తామని రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ సోమవారం ప్రకటించారు. ఈ దిశగా తమ ప్రభుత్వం సూపర్ యాప్ తీసుకురావడానికి కృషి చేస్తున్నట్టు వెల్లడించారు. ప్రస్తుతం రైల్వే సేవలు అందించే యాప్‌లపై ప్రయాణికుల్లో గందరగోళం ఉన్నది. రకరకాల యాప్‌లు ఉన్నాయి. వీటిల్లో కొన్ని ప్రైవేటువి కూడా ఉన్నాయి. దీంతో ఏ సేవల కోసం ఏ యాప్ వాడాలో అర్థం కాని పరిస్థితి ఉంది. కాగా, గత ఏడాది దేశంలో 5,300 కిలోమీటర్ల కొత్త రైల్వే లైన్ వేశామని, ఇది స్విట్జర్లాండ్ మొత్తం రైల్వే వ్యవస్థతో సమానమని మంత్రితెలిపారు. పదేండ్ల క్రితం ఏడాదికి సగటున 171 రైలు ప్రమాదాలు జరిగేవని, ఇప్పుడు 40కి తగ్గాయని ఆయన పేర్కొన్నారు.

ట్రంప్‌పై హత్యాయత్నం

- గోల్ఫ్ ఆడుతుండగా కాల్పులకు దుండగుడు యత్నం
- సీక్రెట్ సర్వీస్ ఏజెంట్ల కాల్పులతో పరారీ
- వెంబడించి పట్టుకున్న భద్రతా సిబ్బంది



వాషింగ్టన్, సెప్టెంబర్ 16: అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌పై మరోసారి హత్యాయత్నం జరిగింది. ఆయన గోల్ఫ్ ఆడుతుండగా ఓ దుండగుడు కాల్పులు జరిపేందుకు విఫలయత్నం చేశాడు. ఆదివారం ఫ్లోరిడాలోని వెస్ట్ పామ్ బీచ్ వద్ద ఉన్న ట్రంప్ ఇంటర్నేషనల్ గోల్ఫ్ కోర్టులో ఈ ఘటన చోటు చేసుకుంది. రక్షణ కంచె వద్ద నుంచి దుండగుడు ట్రంప్ లక్ష్యంగా ఏకే-47 తుపాకీ గురిపెట్టాడు. ఈ విషయాన్ని వెంటనే గుర్తించిన సీక్రెట్ సర్వీస్ ఏజెంట్లు దుండగుడిపై కాల్పులు జరిపారు. దీంతో అతడు కారులో పారిపోగా, ఏజెంట్లు వెంబడించి అరెస్టు చేశారు. ట్రంప్‌పై హత్యాయత్నం జరగడం రెండు నెలల్లో ఇది రెండోసారి. జూలైలో పెన్సిల్వేనియాలోని బట్లర్ పట్టణంలో థామస్ మాథ్యూ క్రూక్స్ అనే యువకుడు ట్రంప్‌పై కాల్పులు జరిపిన సంగతి తెలిసిందే.

నిందితుడు ట్రంప్ వ్యతిరేకి

ట్రంప్‌పై హత్యాయత్నానికి ప్రయత్నించిన నిందితుడిని హవాయ్‌కు చెందిన ర్యాన్ వెస్లీ రౌత్(58)గా భద్రతా సంస్థలు గుర్తించాయి. నార్త్ కరోలినాలో రౌత్‌కు పెద్ద నేరచరిత్ర ఉన్నట్టు ప్రాథమికంగా తేలింది. అతడు ట్రంప్ వ్యతిరేకి అని స్థానిక మీడియా పేర్కొన్నది.

నేను ఎప్పటికీ లొంగను: ట్రంప్

హత్యాయత్నం ఘటనపై ట్రంప్ స్పందించారు. 'నా సమీపంలో కాల్పులు జరిగాయి. నేను సురక్షితంగా ఉన్నా. నన్ను ఏదీ నిలువరించలేదు. నేను ఎప్పటికీ లొంగను' అని ఆయన పేర్కొన్నారు. తన ప్రాణాలు కాపాడిన సీక్రెట్ సర్వీస్ ఏజెంట్లకు కృతజ్ఞతలు తెలిపారు. కాగా, ఈ ఘటనను అమెరికా అధ్యక్షుడు బైడెన్ ఖండించారు.

అంతరిక్ష ధూళితోనే జీవం ఆవిర్భావం!

శాస్త్రవేత్తల కొత్త సిద్ధాంతం



న్యూయార్క్: భూమిపై జీవం ఆవిర్భావానికి సంబంధించి శాస్త్రవేత్తలు కొత్త సిద్ధాంతాన్ని తెరపైకి తెచ్చారు. గ్రహశకలాలు ఒకదానితో ఒకటి ఢీకొట్టినప్పుడు ఏర్పడ్డ అంతరిక్ష ధూళి కారణంగానే భూమిపై జీవం ఉద్భవించిందని తెలిపారు. ఈ అధ్యయన వివరాలు 'నేచర్ ఆస్ట్రానమీ' జర్నల్‌లో ప్రచురితమయ్యాయి. భూమిపై జీవం ఎలా ఆవిర్భవించిందనే అంశంపై ఇప్పటివరకు అనేక సిద్ధాంతాలు తెరపైకి వచ్చాయి. 'ప్రీబయోటిక్ కెమిస్ట్రీ' ద్వారా ఏర్పడ్డ రసాయన సమ్మేళనాల ఫలితంగా జీవం మొదలయ్యిందనే సిద్ధాంతం ఇప్పటివరకు ప్రాచుర్యంలో ఉంది. అయితే, ఈ ప్రక్రియకు అవసరమైన భాస్వరం, సల్ఫర్, నత్రజని, కర్బనం వంటి మూలకాలు భూమిపై ఉన్న శిలల్లో ప్రతిక్రియాశీల, కరిగే రూపంలో సరిపడేంత లేవని ఈ అధ్యయనంలో శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. కాబట్టి, 'ప్రీబయోటిక్ కెమిస్ట్రీ' పద్ధతిలో జీవం ఏర్పడి ఉండకపోవచ్చన్నారు.

విరామ సమయంలో శృంగారం

- లంచ్ బ్రేక్‌లు ఉపయోగించుకోండి
- పిల్లల్ని కనాలని రష్యా సూచన
- జననాల రేటు తగ్గడంపై ఆందోళన

మాస్కో: జననాల రేటు తగ్గిపోతుండటంపై రష్యా తీవ్ర ఆందోళన చెందుతున్నది. పరిస్థితి ఇలాగే కొనసాగితే దేశంలో జనాభా గణనీయంగా పడిపోతుందని భావిస్తున్నది. ఈ నేపథ్యంలో ప్రజలు పిల్లలను కనేలా ప్రోత్సహించేందుకు కొత్త ప్రయత్నాలు ప్రారంభించింది. ఈ మేరకు ప్రజలకు ఆరోగ్య మంత్రి యెగ్వెని షెస్కోపలోవ్ పలు సూచనలు చేశారు. 'పనిలో తీరిక లేకుండా ఉన్నామని చెప్పడం సరైన కారణం కాదు. ఇలా చెప్పడం సాకు మాత్రమే. మీరు పనిలో ఉన్నప్పటికీ లంచ్, కాఫీ బ్రేక్‌లను పిల్లలను కనేందుకు ఉపయోగించుకోండి' ఆయన ప్రజలకు సూచించారు. రష్యా ప్రభుత్వం 18 నుంచి 40 ఏండ్ల మహిళలకు ఉచిత సంతాన సాఫల్య కేంద్రాలు సైతం నిర్వహిస్తున్నది.

6జీతో 30 నిమిషాల్లోనే ఫోన్ చార్జింగ్ డ్రెయిన్

- మరింత సమర్థ బ్యాటరీలు అవసరం
- అభిప్రాయపడుతున్న శాస్త్రవేత్తలు
- 2030లో 6జీ అందుబాటులోకి
- 5జీ కంటే 100 రెట్లు అధిక వేగం
- సెకనుకు 1 టెరాబైట్ల డాటా బదిలీ




లండన్, సెప్టెంబర్ 16: కమ్యూనికేషన్ల రంగంలో ఇప్పటికే ఎంతో పురోగతి సాధించిన ప్రపంచ దేశాలు తదుపరి తరం (6జీ) వైర్‌లెస్ కమ్యూనికేషన్ టెక్నాలజీని అందుబాటులోకి తీసుకొచ్చేందుకు సిద్ధమవుతున్నాయి. కానీ, మనలో చాలా మంది మొబైల్ ఫోన్లలో ఎన్నటికీ ఈ టెక్నాలజీని ఉపయోగించలేకపోవచ్చని షెఫీల్డ్ యూనివర్సిటీకి చెందిన రేడియో ఇంజినీరింగ్ నిపుణుడు ఎడ్డీ బాల్ చెప్తున్నారు. 2030 నాటికి లేదా కాస్త అటు ఇటుగా 6జీ నెట్‌వర్క్ అందుబాటులోకి రావచ్చని, ఈ నూతన సాంకేతికతతో డౌన్‌లోడ్ల వేగం విపరీతంగా పెరుగుతుందని పేర్కొన్నారు. సెకనుకు 1 టెరాబైట్ల డాటాను బదిలీ చేయగలిగే 6జీ నెట్‌వర్క్ ప్రస్తుతం అందుబాటులో ఉన్న 5జీ నెట్‌వర్క్ కంటే 100 రెట్లు వేగంగా పనిచేస్తుందని, 5జీ నెట్‌వర్క్ ద్వారా కొన్ని సెకన్లలో పూర్తయ్యే డౌన్‌లోడ్.. 6జీ నెట్‌వర్క్‌తో కేవలం మిల్లీసెకన్ల వ్యవధిలోనే పూర్తవుతుందని వివరించారు. కానీ, 6జీ నెట్‌వర్క్ చాలా శక్తిమంతమైనదని, దీన్ని వినియోగించేందుకు చాలా శక్తి అవసరమవుతుందని చెప్పారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న చాలా మొబైల్ ఫోన్లు 6జీ నెట్‌వర్క్‌ను సపోర్ట్ చేయవని, కొన్ని మొబైల్ ఫోన్లు ఈ సాంకేతికతను సపోర్ట్ చేసినప్పటికీ వాటి బ్యాటరీలు కేవలం 30 నిమిషాల్లోనే డ్రెయిన్ అయిపోతాయని వివరించారు.

స్మార్ట్‌ఫోన్ స్క్రీన్‌తో చార్జింగ్

స్మార్ట్‌ఫోన్ స్క్రీన్‌తో బ్యాటరీ చార్జ్ అయ్యే సరికొత్త పద్ధతిని శాస్త్రవేత్తలు అభివృద్ధి చేశారు. బిల్డింగులు, కార్లకు అమర్చే గ్లాస్‌ల ద్వారానూ చార్జింగ్ చేయొచ్చని దక్షిణ కొరియాకు చెందిన ఉస్లాన్ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ శాస్త్రవేత్తలు వివరించారు. 'పారదర్శకత కలిగిన సోలార్ సెల్‌ను గ్లాస్‌కు అమర్చి చార్జ్ చేయొచ్చు. ఈ సోలార్ సెల్‌కు రంగు ఉండదు. ఇది అత్యంత సామర్థ్యం కలిగినది' అని వెల్లడించారు. చార్జింగ్‌లో ఇది కీలక మార్పులు తెస్తుందన్నారు.

జీవం, మరణం లేని 'మూడో దశ'

- జీవి మరణించినా ప్రాణంతోనే కణాలు
- బయోలాజికల్ రోబోల్లో వినియోగం



న్యూఢిల్లీ: ఏ ప్రాణికి అయినా జీవం, మరణం అనే రెండు దశలే ఉంటాయనేది గతంలో ఉన్న అభిప్రాయం. అయితే, జీవి మరణించినా కొన్ని అవయవాలు మాత్రం పని చేస్తూనే ఉంటాయని అవయవ మార్పిడి ద్వారా నిరూపితమైంది. ఇప్పుడు పరిశోధకులు సరికొత్త విషయాన్ని గుర్తించారు. జీవి మరణించినా, దానిలోని కొన్ని కణాలు మాత్రం కొంతకాలం బతికే ఉంటాయని వెల్లడించారు. జీవం, మరణానికి ఇది భిన్నమైన మూడో దశ అని తెలిపారు. ఇందుకు సంబంధించి జరిపిన అధ్యయన వివరాలు 'ఫిజియాలజీ' జర్నల్‌లో ప్రచురితమయ్యాయి. సింథటిక్ బయోలజీ రంగంలో సరికొత్త మార్పులు తెస్తున్న బయోలాజికల్ రోబోల్లో(బయోబోట్) ఈ కణాలను వినియోగించే అవకాశం ఉందని పరిశోధకులు తెలిపారు. అయితే, ముందుగా కణాలు ఎలా స్పందిస్తాయనేది గుర్తించడం శాస్త్రవేత్తలకు సవాల్‌గా ఉంటుందని అధ్యయనంలో పాల్గొన్న పీటర్ నోబెల్, అలెక్స్ పోజిట్కోవ్ తెలిపారు. జీవి మరణం తర్వాత కూడా ఈ కణాలు ఎలా జీవించగలుగుతున్నాయి అనేది శాస్త్రవేత్తలకు అర్థం కావడం లేదని వీరు పేర్కొన్నారు.

అబద్ధాల సీఎం అశోక్‌నగర్‌కు రా..?

- నేనే 65 వేల ఉద్యోగాలిచ్చానని చెప్పు
- సీఎం రేవంత్‌రెడ్డికి ఓ నిరుద్యోగి సవాల్



హైదరాబాద్, సెప్టెంబర్ 16 (నమస్తే తెలంగాణ) : అబద్ధాల సీఎం అశోక్‌నగర్‌కు రా.. నేనే 65 వేల ఉద్యోగాలిచ్చానని అశోక్‌నగర్‌లో చెప్పు.. అని ఓ నిరుద్యోగి సోమవారం ఎక్స్ వేదికలో సీఎం రేవంత్‌రెడ్డికి సవాల్ విసిరాడు. 65 వేల ఉద్యోగాలు తానే ఇచ్చానని చెప్పుకుంటున్న రేవంత్‌రెడ్డి.. అశోక్‌నగర్‌కు వచ్చి అదే మాట చెప్పగలవా..? అని నిలదీశాడు. ప్రతి ఏడాది 2 లక్షల ఉద్యోగాలు ఇస్తానని చెప్పి, చివరకు 65 వేలు అని చెబుతున్నావని విమర్శించాడు. ఆ 65 వేల ఉద్యోగాల్లో కేసీఆర్ ఇచ్చినవే 30 వేలకు పైగా ఉన్నాయని పేర్కొన్నాడు. గతంలో కేసీఆర్ నోటిఫికేషన్లు వేసి.. ఫలితాలు విడుదలయ్యాక కోర్టు కేసులతో ఆగిపోతే, ఆ తర్వాత ఎల్బీ స్టేడియంలో నియామకపత్రాలిచ్చి ఆ ఉద్యోగాలు నేనే ఇచ్చానని సిగ్గులేకుండా చెప్పుకుంటున్నాడని మండిపడ్డాడు. ఏదో చేస్తావని భావించి.. నీకు ఓట్లేసి గెలిపిస్తే, ఇప్పుడేమో నిరుద్యోగులను లెక్కచేయడం లేదని నిరుద్యోగ యువకుడు నిప్పులు చెరిగాడు. ఈ వీడియో సోమవారం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

గల్ఫ్ మృతుల కుటుంబాలకు 5 లక్షలు

- ప్రత్యేకంగా 'ప్రవాసీ ప్రజావాణి' కౌంటర్: సీఎస్

హైదరాబాద్, సెప్టెంబర్ 16 (నమస్తే తెలంగాణ): గల్ఫ్ కార్మికుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. బహ్రెయిన్, కువైట్, ఇరాక్, ఒమన్, ఖతార్, సౌదీ అరేబియా, యూఏఈలో పనిచేస్తున్న వారిని గల్ఫ్ కార్మికులుగా గుర్తించింది. సోమవారం సీఎస్ శాంతికుమారి ఉత్తర్వులు జారీ చేశారు. గల్ఫ్‌లో కార్మికులు మరణిస్తే వారి కుటుంబసభ్యులకు రూ.5 లక్షల పరిహారం అందించనున్నది. బాధితుల కోసం ప్రత్యేకంగా ప్రజావాణిలో 'ప్రవాసి ప్రజావాణి' పేరుతో కౌంటర్‌ను ఏర్పాటు చేయనున్నది.

ఇద్దరు మున్సిపల్ కార్మికుల ఆత్మహత్యాయత్నం

- చేసిన పనికి జీతాలు ఇవ్వడం లేదని మనస్తాపం
- వికారాబాద్ జిల్లా తాండూరు మున్సిపల్ ఆఫీసులో ఘటన
- పెండింగ్ జీతాలు చెల్లించాలని అయిజలో ఆందోళన



అయిజ మున్సిపల్ కార్యాలయ సమీపంలో నిరసన తెలుపుతున్న ఔట్ సోర్సింగ్ కార్మికులు

యాలాల/అయిజ, సెప్టెంబర్ 16: చేసిన పనికి జీతాలు ఇవ్వకపోవడంతో ఇద్దరు కాంట్రాక్టు పారిశుధ్య కార్మికులు ఆత్మహత్యాయత్నం చేశారు. ఈ ఘటన సోమవారం వికారాబాద్ జిల్లాలోని తాండూరులో జరిగింది. తాండూరు మున్సిపల్‌లో నర్సింహులు, జ్యోతితోపాటు మరో ఏడుగురు ఓ బృందంగా ఏర్పడి కాంట్రాక్టు పారిశుధ్య కార్మికులుగా పనిచేస్తున్నారు. మిగిలిన వారికి జీతాలు వచ్చాయి. కానీ నర్సింహులు, జ్యోతికి రాకపోవడంతో మనస్తాపానికి గురయ్యారు. పెట్రోలు డబ్బాతో మున్సిపల్ కార్యాలయానికి వచ్చి ఆత్మహత్యాయత్నం చేశారు. మున్సిపల్ కమిషనర్ విక్రమ్‌సింహారెడ్డి మాట్లాడుతూ.. పారిశుధ్య కార్మికులు ఏర్పాటు చేసుకున్న గ్రూప్‌లో వారి పేర్లు లేవని, అందువల్లే వారికి జీతాలు ఇవ్వలేదని చెప్పారు. ప్రజా పాలనలో కలెక్టర్‌కు దరఖాస్తు ఇస్తే అధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. పోలీసులు ఘటనాస్థలికి చేరుకొని పెట్రోల్ డబ్బాను స్వాధీనం చేసుకున్నారు. జోగుళాంబ గద్వాల జిల్లా అయిజ మున్సిపాలిటీలో పనిచేసే ఔట్ సోర్సింగ్ కార్మికులకు రెండు నెలలుగా జీతాలు చెల్లించకపోవడంతో నీటి వి భాగం, హరితహారం, ఎలక్ట్రికల్, ఇంజినీరింగ్ విభాగాల్లో విధులు నిర్వర్తిస్తున్న 86 మంది ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు మున్సిపల్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. ప్రతి నెలా ఒకటో తేదీనే జీతాలు చెల్లిస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటనలిస్తున్నదే తప్పా.. ఆచరించడం లేదని చెప్పారు. జూలై, ఆగస్టు నెలల జీతాలు చెల్లించకపోవడంతో కుటుంబపోషణ భారంగా మారిందని వాపోయారు. జీతాలు సకాలంలో చెల్లించకుంటే ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.



అనుచరులతో కలిసి కార్ల ర్యాలీ తీస్తున్న ఎమ్మెల్యే రోహిత్

మైనంపల్లి రోహిత్ కార్ల ర్యాలీపై చర్యలేవి?

- ఎమ్మెల్యేపై చర్యలు తీసుకోవాలని డీజీపీకి డిమాండ్
- సోషల్ మీడియాలో కార్ల ర్యాలీ వీడియో వైరల్

హైదరాబాద్, సెప్టెంబర్ 16 (నమస్తే తెలంగాణ): మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ మరో వివాదంలో చిక్కుకున్నారు. వందల కార్లతో హైదరాబాద్ నుంచి సిద్దిపేట వెళ్తూ.. కారు ఓపెన్‌టాప్‌పై ఆయన, అనుచరగణం చేసిన స్టంట్లపై నెటిజన్లు విరుచుకుపడుతున్నారు. తక్షణం ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. సోమవారం తన ఎక్స్ వేదికగా రోహిత్ ఓ వీడియో అప్‌లోడ్ చేశారు. అందులో తాను వందల కార్ల కాన్వాయ్‌తో రోడ్డు మొత్తం బ్లాక్ చేస్తూ వెళ్తున్నట్టు స్పష్టంగా ఉన్నది. ఆ వీడియోకు 'హరీశ్‌రావు ఇగ కాస్కో బిడ్డా.. మైనంపల్లి దెబ్బ..' అంటూ ట్యాగ్ లైన్ ఇచ్చారు. ఆ వీడియోలో.. రోహిత్ కారు ఓపెన్‌టాప్‌పై నుంచి అభివాదం చేస్తూ వాహనదారులకు ఇబ్బందులు కలిగించారు. దీనికితోడు ఆయన అనుచరులు కార్ టాప్‌లపై హల్‌చల్ చేస్తున్నట్టు స్పష్టంగా కనిపించింది. ఓ ప్రజాప్రతినిధి అయ్యుండి.. తన ప్రవర్తనతో ప్రజలను ఇబ్బంది పెట్టడం ఏమాత్రం బాగోలేదని నెటిజన్లు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. 'తక్కువస్థాయికి పడిపోతున్నావ్' అని, 'ఒక ఎమ్మెల్యేగా ఇలాంటి థర్డ్ క్లాస్ స్టంట్స్ చేయడానికి సిగ్గుండాలి. తెలంగాణలో న్యాయబద్ధమైన పాలన ఉన్నదా?' అంటూ ఓ నెటిజన్ డీజీపీని ట్యాగ్ చేశారు. 'ఇట్లాంటివి చేయడం హేళనకరం, ఇండియా కూటమికి ఓటు వేసిన ప్రజలు మూర్ఖులు' అంటూ మరో నెటిజన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇట్లాంటి అసభ్య ప్రవర్తనలకు కూడా అనుమతి ఇస్తారా' అని కొరీనా సురేశ్ అనే నెటిజెన్ డీజీపీని ట్యాగ్ చేశారు. 'ఇలా చేయడం పూర్తిగా చట్ట విరుద్ధం. వెంటనే చర్యలు తీసుకోవాలి. ఇది ప్యూడల్ హైదరాబాద్ కాదు' అని సీఎంవో, డీజీపీకి మరో నెటిజన్ విజ్ఞప్తి చేశారు.

వచ్చే నెల నుంచి స్మార్ట్ రేషన్‌కార్డులు

- వచ్చే నెల నుంచి రాష్ట్రవ్యాప్తంగా జారీ
- జనవరి నుంచి సన్నబియ్యం పంపిణీ
- మంత్రులు ఉత్తమ్, పొంగులేటి వెల్లడి

హైదరాబాద్, సెప్టెంబర్ 16 (నమస్తే తెలంగాణ): వచ్చే నెల నుంచి రాష్ట్రవ్యాప్తంగా ప్రజలకు స్మార్ట్ రేషన్‌కార్డులు, స్మార్ట్ హెల్త్‌కార్డులను విడివిడిగా అందజేయనున్నట్టు మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ప్రకటించారు. కొత్త రేషన్‌కార్డులు, హెల్త్‌కార్డుల జారీ కోసం సలహాలు, సూచనలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం నియమించిన క్యాబినెట్ సబ్ కమిటీ సోమవారం మరోసారి భేటీ అయ్యింది. సబ్‌కమిటీ చైర్మన్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నేతృత్వంలో ఎర్రమంజిల్‌లోని జలసౌధలో జరిగిన ఈ సమావేశంలో కమిటీ సభ్యులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు. సమావేశానంతరం మంత్రులు ఉత్తమ్, శ్రీనివాస్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. ప్రస్తుతం రాష్ట్రంలో 89.96 లక్షల రేషన్‌కార్డులు ఉన్నట్టు వెల్లడించారు. కొత్త రేషన్‌కార్డుల జారీకి సంబంధించిన మార్గదర్శకాలను ఈ నెలాఖరులోగా పూర్తిచేసి, ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామని చెప్పా రు. జనవరి నుంచి రాష్ట్రంలోని రేషన్‌కార్డుదారులందరికీ సన్నబియ్యం పంపిణీ చేస్తామని, సన్నవడ్లను పండించిన రైతులకు క్వింటాకు రూ.500 చొప్పున బోనస్‌ను కూడా ఈ సీజన్ నుంచే అమలు చేస్తామని చెప్పారు.





ఎస్సీ వర్గీకరణపై సబ్‌కమిటీ భేటీ

ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పును అధ్యయనం చేసేందుకు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నేతృత్వంలో ఏర్పాటైన క్యాబినెట్ సబ్‌కమిటీ సోమవారం జలసౌధలోనే ప్రత్యేకంగా భేటీ అయ్యింది. సబ్‌కమిటీ కో-చైర్మన్, సభ్యులుగా ఉన్న మంత్రులు దామోదర రాజనర్సింహ, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, సీతక్క, పొన్నం ప్రభాకర్‌తోపాటు రాష్ట్ర న్యాయశాఖ కార్యదర్శి, సాంఘిక సంక్షేమ శాఖ కమిషనర్ టీకే శ్రీదేవి తదితరులు ఈ సమావేశంలో పాల్గొని సుప్రీంకోర్టు తీర్పులోని అంశాలపై చర్చించారు.

వరదలతో కూలిన జైలు గోడలు.. ఖైదీల పరార్

న్యూఢిల్లీ: నైజీరియాలోని బోర్నో స్టేట్‌లో సంభవించిన వరదలతో మైదుగురి మీడియం సెక్యూరిటీ కస్టోడియల్ సెంటర్, దాని పక్కన ఉన్న స్టాఫ్ క్వార్టర్స్ గోడలు కూలిపోయాయి. దీంతో 81 మంది ఖైదీలు తప్పించుకుని, పారిపోయారు. వారిలో ఏడుగురిని పట్టుకున్నట్లు నైజీరియన్ కరక్షనల్ సర్వీస్ అధికార ప్రతినిధి అబుబకర్ ఉమర్ చెప్పారు. పారిపోయినవారిని గుర్తించామని, గాలింపు చర్యలు ప్రారంభించామని తెలిపారు. వరదల వల్ల 229 మంది ప్రాణాలు కోల్పోగా, 3,86,000 మంది నిరాశ్రయులయ్యారు.

హాస్పిటల్ బ్రేక్‌ఫాస్ట్‌లో లక్క పురుగులు

- రోగుల ప్రాణాలతో కాంట్రాక్టర్ చెలగాటం
- అల్పాహారం ఎలా తినాలని రోగుల ఆగ్రహం
- జగిత్యాల ఎంసీహెచ్‌లో బయటపడ్డ నిర్లక్ష్యం



జగిత్యాల, సెప్టెంబర్ 16: దవాఖాన అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా రోగులకు అందించిన అల్పాహారంలో లక్క పురుగులు బయటపడ్డాయి. ఈ ఘటన సోమవారం జగిత్యాల మాతాశిశు కేంద్రంలో వెలుగుచూసింది. జగిత్యాలలోని ఎంసీహెచ్‌కు రోగుల తాకిడి ఎక్కువ. నిత్యం 100 మందికి పైగా బాలింతలు, వారి సహాయకులతో కిటకిటలాడుతది. ఇందులో ఇన్‌పేషెంట్లుగా చేరిన వారికి, వారి సహాయకులకు రోజూ పాలు, బ్రెడ్, అల్పాహారం, మధ్యాహ్నం భోజనం అందిస్తారు. రోజు మాదిరిగానే.. ఉదయం అటుకుల అల్పాహారం ఇవ్వడంతో అందులో లక్కపురుగులు కనిపించాయి. దీంతో రోగులు ఆగ్రహం వ్యక్తంచేశారు. 'మరీ ఇంత అధ్వానమా? దీనిని ఎలా తినాలి? అని మండిపడ్డారు. నాలుగు రోజులుగా నాసిరకం అల్పాహారం, ఉడికీఉడకని అన్నం అందిస్తున్నారని, తినలేకపోతున్నామని, ఒకవేళ తింటే వాంతులు, విరేచనాలు అవుతున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. పురుగుల టిఫిన్ పెట్టి రోగుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని? మీడియాకు సమాచారం అందించారు. సదరు కాంట్రాక్టరుకు 'నమస్తే తెలంగాణ' ఫోన్ చేయగా స్పందించలేదు.

• వలకు చిక్కిన భారీ చేప



లోయర్ మానేరు జలాశయంలో కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం ఇందిరానగర్ పరిధి సంగెంపల్లికి చెందిన మత్స్యకారుడు తిరుపతి వలకు 30 కిలోల భారీ చేప చిక్కింది. రోజులాగే సోమవారం చేపల వేటకు వెళ్లిన తిరుపతి.. తన వలలను తీస్తుండగా భారీ చేప కనిపించడంతో తిరుపతి ఆనందం వ్యక్తం చేశాడు. ఈ చేపను రామకృష్ణ కాలనీలో రూ.5 వేలకు విక్రయించాడు. -తిమ్మాపూర్

2035 నాటికి 40వేల మోగావాట్ల గ్రీన్‌పవర్: భట్టి



హైదరాబాద్, సెప్టెంబర్ 16 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో 2035నాటికి 40వేల మెగావాట్ల గ్రీన్‌పవర్‌ను ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వెల్లడించారు. గ్రీన్ పవర్ ఉత్పత్తికి ప్రత్యేక పాలసీని రూపొందిస్తున్నామని తెలిపారు. సోమవారం గుజరాత్ రాజధాని గాంధీనగర్‌లో నిర్వహించిన నాలుగో ప్రపంచ గ్రీన్ ఎనర్జీ పెట్టుబడిదారుల సమ్మేళనానికి భట్టి రాష్ట్ర ప్రతినిధిగా హాజరయ్యారు. రాష్ట్రంలో గ్రీన్ పవర్ ఉత్పత్తికి ఉన్న అవకాశాలు, ప్రభుత్వ విధానాలను సదస్సులో భట్టి వివరించారు. ఏఐ సిటీ, ఫ్యూచర్ సిటీ, పారిశ్రామిక కారిడార్లు, ట్రిపుల్ ఆర్, మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టులను తమ ప్రభుత్వం ముందుకు తీసుకెళ్లుతున్నదని, ఇవి గ్రీన్‌పవర్ ఉత్పత్తికి ఎంతో దోహదపడతాయని తెలిపారు. రాష్ట్రంలో 1500 నుంచి 3వేల మోగావాట్ల హైడ్రోజన్, జియోథర్మల్, 250 మెగావాట్ల మినీ హైడల్ విద్యుదుత్పత్తికి అవకాశముందని వెల్లడించారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాలని పలు సంస్థల ప్రతినిధులను భట్టి విక్రమార్క కోరారు. సమావేశానికి హాజరైన గిజ్, టాటా పవర్, సెంకార్బ్, వెల్‌స్పన్, రెన్యూపవర్, ఇండియన్ ఆయిల్, ఎన్‌హెచ్‌పీసీ, వోఎన్‌వైఎక్స్, హీరోపవర్, ఊర్జా ఎనర్జీ, కేజీపీఎం సంస్థల ప్రతినిధులతోనూ భట్టి భేటీ అయ్యారు. డిప్యూటీ సీఎం వెంట విద్యుత్తు సంస్థల సీఎండీలు ముషారఫ్ ఫారూఖీ, వరుణ్‌రెడ్డి, డిప్యూటీ సీఎం స్పెషల్ సెక్రటరీ కృష్ణభాస్కర్ తదితరులు ఉన్నారు.

మరిన్ని వార్తలు ntnews.com లో చూడగలరు

ఏదీ ఆ దూకుడు?!

ఎన్డీఏ సంకీర్ణ సర్కారుకు వంద రోజులు

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, సెప్టెంబర్ 16: నమస్తే తెలంగాణ: ప్రధాని మోదీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వానికి సోమవారానికి వంద రోజులు పూర్తయ్యాయి. గడిచిన పదేండ్లలో కనిపించిన దూకుడు ఇప్పటి ఎన్డీఏ 3.0 సర్కారులో కనిపించట్లేదన్నది కాదనలేని సత్యం. ఇటీవలి లోక్‌సభ ఎన్నికల్లో ఊహించని స్థాయిలో సీట్లు తగ్గిపోయిన ప్రభావమో, మిత్రపక్షాలపై ఆధారపడి ప్రభుత్వాన్ని నడుపుతుండటం వల్లనో కానీ ఏదైనా నిర్ణయంపై వ్యతిరేకత వస్తే ఎన్డీఏ ప్రభుత్వం పీచేముడ్ అంటున్నది. ధరల నియంత్రణ, ఉద్యోగాల కల్పన, బడ్జెట్ విషయంలోనూ సర్కారు తన మార్క్‌ను చూపించలేకపోయింది. వెరసి ఎన్డీఏ 3.0 వంద రోజుల పాలనలో ఎలాంటి మెరుపులు కనిపించకపోయినా.. ప్రభుత్వాన్ని కాపాడుకోవాలన్న భయం మాత్రం కనిపిస్తున్నదన్న అభిప్రాయాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి.

మిత్రులను సంతోషపెట్టాలని..

- ఎక్కడ అసమ్మతి వచ్చినా మొగ్గలోనే తుంచేయడం లేదా వ్యతిరేకించిన వారిని పక్కనపెట్టడమే పాలసీగా ఇప్పటివరకూ అనుసరించిన ప్రధాని మోదీ తన వైఖరిని మార్చుకొన్నట్టు కనిపిస్తున్నది. జమ్ముకశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల కోసం విడుదల చేసిన అభ్యర్థుల తొలి జాబితాను వెనక్కి తీసుకోవడం ఇందులో భాగమే. అంతేకాదు. గడిచిన పదేండ్లలో సొంతమెజార్టీ ఉండటంతో మిత్రపక్షాలను లెక్కచేయని ప్రధాని మోదీ.. ఇప్పటి సంకీర్ణ సర్కారుకు కీలకంగా మారిన బీహార్, ఏపీకి బడ్జెట్‌లో పెద్దయెత్తున నిధులను మంజూరు చేయడం అందర్నీ ఆశ్చర్యపరిచింది. ఎన్డీఏ మిత్రులను సంతోషపెట్టి, సంకీర్ణ సర్కారును కాపాడుకోవడానికే మోదీ ఇలా చేశారని విశ్లేషకులు చెప్తున్నారు.



పాలసీల్లో యూటర్న్

- కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రసార సేవల (నియంత్రణ) చట్టం చేయాలనుకుంది. ముసాయిదా రూపొందించి స్టేక్‌హోల్డర్లకు పంపించింది. అయితే, ఈ బిల్లు స్వతంత్ర జర్నలిస్టుల గొంతునొక్కేలా ఉందనే విమర్శలు వచ్చాయి. దీంతో కేంద్రం ఈ ముసాయిదా బిల్లును వెనక్కు తీసుకుంటున్నట్టు ప్రకటించింది.
- వక్ఫ్(సవరణ) బిల్లు విషయంలోనూ ఇలానే జరిగింది. వక్ఫ్ బోర్డు వ్యవస్థలో కీలక మార్పులు చేస్తూ మోదీ ప్రభుత్వం చట్టం చేయాలనుకుంది. అయితే, వక్ఫ్ బోర్డులో ముస్లిమేతరులను చేర్చేందుకు కేంద్రం ప్రయత్నిస్తున్నదని పెద్ద ఎత్తున విమర్శలు వచ్చాయి. అనేక పార్టీలు ఈ బిల్లును వ్యతిరేకించాయి. దీంతో బిల్లును జాయింట్ పార్లమెంటరీ ప్యానెల్ పరిశీలనకు ప్రభుత్వం పంపించాల్సి వచ్చింది.
- స్థిరాస్తుల అమ్మకాలపై వచ్చే లాభాలపై విధించే మూలధన లాభాల పన్నులో ఇండెక్సేషన్ ప్రయోజనం విషయంలోనూ వ్యతిరేకత రావడంతో కేంద్రం వెనక్కు తగ్గింది. ఇండెక్సేషన్ ప్రయోజనం లేని కొత్త విధానం, పాత పన్ను విధానంలో ఏదైనా ఎంచుకునే వెసులుబాటును ప్రజలకు కల్పించింది.
- ల్యాటరల్ ఎంట్రీ విషయంలోనూ ఇదే జరిగింది. 2018లోనూ ఈ విధానంలో కేంద్రం పలు నియామకాలు చేపట్టింది. అప్పుడు విమర్శలు వచ్చినా పట్టించుకోలేదు. ఇప్పుడు మాత్రం చిరాగ్ పాశ్వాన్ వంటి ఎన్డీఏలోని నేతలే వ్యతిరేకించడంతో వెనక్కు తగ్గక తప్పలేదు.



రీల్స్ కోసం నడిరోడ్డుపై శవంలా!

యూపీలో యువకుల అరెస్ట్

లక్నో, సెప్టెంబర్ 16: యూపీ పోలీసులు నడిరోడ్డుపై పడి ఉన్న ఒక శవాన్ని అరెస్ట్ చేశారు. శవమంటే నిజంగా శవం కాదు. సామాజిక మాధ్యమంలో పేరు తెచ్చుకోవడానికి కస్గంజ్ జిల్లాలో నడిరోడ్డుపై శవంలా పడుకున్న ముకేశ్ కుమార్, స్నేహితులైన కొందరు యువకులను అరెస్ట్ చేశారు. ఇతడు ఎర్రటి చాపపై పడుకుని ఉండగా, మెడలో దండ వేసి ఒంటిపై తెల్లటి గుడ్డ కప్పారు. అతని ముక్కులో దూది కూడా పెట్టి అతడిని అచ్చం శవంలా నడిరోడ్డుపై ఉంచిన అతని స్నేహితులు ఇన్‌స్టాలో రీల్ కోసం దానిని వీడియో తీయడం ప్రారంభించారు. దీంతో పెద్దయెత్తున ట్రాఫిక్ జామ్ కావడంతో పోలీసులు రంగ ప్రవేశం చేసి ముకేశ్ కుమార్, స్నేహితులను అరెస్ట్ చేశారు. దీనిపై సామాజిక మాధ్యమంలో పలువురు విమర్శలతో విరుచుకుపడ్డారు. వ్యూలు, లైక్‌ల కోసం వీరు ఏమన్నా చేస్తారు అని ఒకరు, ఇలాంటి చర్యల ద్వారా వీరు సమాజానికి చాలా చెడు సందేశాన్ని ఇస్తున్నారు, ప్రపంచమంతా ఇలాంటి వింత, పిచ్చి మనుషులతో నిండిపోతున్నది అని మరికొందరు కామెంట్లు చేశారు.

ఇబ్బందుల్లో భారతీయ ముస్లింలు

- వారిని పట్టించుకోకపోతే మనం ముస్లింలమే కాము
- ఇరాన్ అధినేత ఖమేనీ వ్యాఖ్యలు
- ముందు మీ సంగతి చూసుకోండి
- ఘాటుగా స్పందించిన భారత్



న్యూఢిల్లీ: ఇరాన్ అధినేత అయతుల్లా ఖమేనీ భారతీయ ముస్లింలపై చేసిన వ్యాఖ్యలు దుమారం రేపుతున్నాయి. 'ఇస్లామిక్ సమాజంగా మన ఉమ్మడి గుర్తింపు పట్ల మనం ఉదాసీనంగా ఉండేలా చేయడానికి ఇస్లాం శత్రువులు ఎల్ల వేళలా ప్రయత్నిస్తున్నారు. మయన్మార్, గాజా, ఇండియా లేదా ఏదైనా ఇతర ప్రదేశంలో ఓ ముస్లిం అనుభవిస్తున్న ఇబ్బందులను పట్టించుకోకపోతే మనల్ని మనం ముస్లింలుగా పరిగణించుకోలేం' అని ఖమేనీ చెప్పారు. మహమ్మద్ ప్రవక్త జయంతి సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. దీనిపై భారత్ ఘాటుగా స్పందించింది. 'ఇరాన్ సుప్రీం లీడర్ భారత దేశంలోని మైనారిటీల గురించి చేసిన వ్యాఖ్యలు మమ్మల్ని తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేశాయి. అవి తప్పుడు సమాచారంతో కూడినవి. ఆమోదయోగ్యం కానివి. మైనారిటీల పట్ల వ్యవహరించడం గురించి విమర్శించే దేశాలు మొదట తమ దేశాల్లోని మానవ హక్కుల రికార్డులను పరిశీలించుకోవాలి' అని సలహా ఇచ్చింది.

విజయేంద్రను బీజేపీ అధ్యక్షుడిగా అంగీకరించం

మాజీ మంత్రి రమేశ్ జార్కిహోళి

బెంగళూరు, సెప్టెంబర్ 16: కర్ణాటక బీజేపీ అధ్యక్షుడిగా బీవై విజయేంద్ర నాయకత్వాన్ని తాము ఎంతమాత్రం ఒప్పుకోబోమని మాజీ మంత్రి, గోకక్ ఎమ్మెల్యే రమేశ్ జార్కిహోళి స్పష్టం చేశారు. విజయేంద్ర పార్టీలో జూనియరే కాక, అవినీతిపరుడన్న ముద్ర కూడా ఉందని ఆయన అన్నారు. పైగా అతనికి ఎలాంటి భావజాలం లేదని, ఈ క్రమంలో తదుపరి అధ్యక్షుడు ఎవరన్న దానిపై అధిష్ఠానం పునరాలోచన చేయాలని అన్నారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ అధ్యక్షుడిగా విజయేంద్ర కొనసాగడాన్ని వ్యతిరేకిస్తానని అన్నారు.

చైనాలో 'బెబింకా' బీభత్సం

బీజింగ్, సెప్టెంబర్ 16: గత 75 ఏండ్లలో ఎన్నడూ లేనంత భీకరమైన తుఫాన్ చైనాను తాకింది. సోమవారం ఉదయం టైఫూన్ 'బెబింకా' చైనా ఆర్థిక రాజధాని షాంఘైలో తీరాన్ని దాటింది. దాదాపు 2.5 కోట్ల జనాభా కలిగిన షాంఘై నగర జనజీవనం ఒక్కసారిగా స్తంభించిపోయింది. ఇక్కడి జాతీయ రహదారుల్ని మూసేయించారు. షాంఘైలో రెండు విమానాశ్రయాల నుంచి రాకపోకలు సాగించాల్సిన విమానాలన్నీ రద్దయ్యాయి. విమాన ప్రయాణికులకు తాత్కాలిక బస ఏర్పాటుచేసినట్టు అధికారులు ప్రకటించారు. ఆది, సోమ రెండు రోజులపాటు షాంఘై రైల్వే స్టేషన్ ప్యాసింజర్ రైళ్లను రద్దు చేసింది. తూర్పు చైనాలోని అహూయి ప్రావిన్స్‌కు లెవల్-4 స్థాయి, షాంఘై, ఝిజియాంగ్ నగరాలకు లెవల్-3 ప్రమాద హెచ్చరికలు జారీచేసినట్టు 'జిన్హువా' న్యూస్ ఏజెన్సీ తెలిపింది. తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో 4,14,000 మందిని అధికారులు సురక్షిత ప్రాంతాలకు తరలించారు.

ఎట్టకేలకు మమతతో జూడాల చర్చలు

సీఎం ముందు ఐదు డిమాండ్లు

కోల్‌కతా, సెప్టెంబర్ 16: పశ్చిమ బెంగాల్‌లో జూనియర్ డాక్టర్ల ఆందోళన కొలిక్కి వస్తున్నది. నాలుగుసార్లు రద్దు అయిన తర్వాత సోమవారం రాత్రి జూనియర్ డాక్టర్లు ముఖ్యమంత్రి మమతా బెనర్జీతో చర్చలు జరిపారు. 30 మంది వైద్యుల బృందం దాదాపు రెండున్నర గంటల పాటు సీఎం సహ ఉన్నతాధికారులతో సమావేశమైంది. చర్చల వివరాలను నమోదు చేసేందుకు తమతో పాటు ఇద్దరు స్టెనోగ్రాఫర్లను సైతం వైద్యులు వెంట తెచ్చుకున్నారు. ప్రభుత్వం ముందు వైద్యులు ఐదు కీలక డిమాండ్లను పెట్టారు. వైద్యురాలి హత్యాచార ఘటన, ఆధారాలు ధ్వంసం చేయడంలో ప్రమేయం ఉన్న అందరినీ శిక్షించాలని, ఆర్జీ కర్ ప్రిన్సిపల్‌పై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలి డిమాండ్ చేశారు. కోల్‌కతా పోలీస్ కమిషనర్, రాష్ట్ర ఆరోగ్య శాఖ కార్యదర్శి రాజీనామా చేయాలని, వైద్యుల భద్రతకు చర్యలు తీసుకోవాలని, దవాఖానల్లో బెదిరింపు ధోరణులను నిరోధించాలనే డిమాండ్లను ప్రభుత్వం ముందుంచారు. అయితే, వీటిపై ప్రభుత్వం స్పందించాల్సి ఉంది.

ప్రాసెస్డ్ ఫుడ్‌తో మధుమేహ ముప్పు

న్యూఢిల్లీ: అల్ట్రా ప్రాసెస్డ్ ఫుడ్స్‌లో ప్రతి 10 శాతం ఆహారం టైప్-2 మధుమేహం ముప్పును 17% పెంచుతుందని తేలింది. యూనివర్సిటీ కాలేజ్ లండన్, కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయం, ఇంపీరియల్ కాలేజ్ లండన్ పరిశోధకులు ఈ అధ్యయనాన్ని నిర్వహించారు. 3,11,892 మందిని పరిశీలించారు. 10.9 సంవత్సరాలపాటు ఈ పరిశోధన జరిగింది. ఆ సమయంలో 14,236 మందికి మధుమేహం సంక్రమించింది. ఈ అధ్యయనం ప్రకారం, తక్కువ ప్రాసెస్డ్ ఆహారాన్ని తీసుకోవడం వల్ల ముప్పు తగ్గుతుంది. అల్ట్రాప్రాసెస్డ్ ఫుడ్ (యూపీఎఫ్)ను అధికంగా వినియోగించే టాప్ 25 శాతం మంది వినియోగదారులు ఈ అధ్యయనంలో పాల్గొన్నారు. వీరు తినే మొత్తం ఆహారంలో యూపీఎఫ్ 23.5 శాతం. ఈ యూపీఎఫ్‌లో 40 శాతం స్వీటెన్డ్ బెవరేజెస్ ఉన్నాయి. ఇవి వారు తినే మొత్తం ఆహారంలో 9 శాతం. అయితే వీరు తినే యూపీఎఫ్‌లో 10 శాతాన్ని తగ్గించి, దానికి బదులుగా నామమాత్రంగా ప్రాసెస్ చేసిన గుడ్లు, పాలు, పండ్లు, ఉప్పు, పెరుగు, నూనె వంటివాటిని తినిపించారు. అప్పుడు వారికి మధుమేహం ముప్పు 14 శాతం వరకు తగ్గింది.

గతంలో భూమి చుట్టూ రింగ్!

శనిగ్రహానికి ఉన్నట్టు ఉండేదట

మెల్బోర్న్, సెప్టెంబర్ 16: సౌర వ్యవస్థలో అత్యంత అద్భుతమైన దృశ్యం శనిగ్రహం చుట్టూ కనిపించే రింగులు. బృహస్పతి, ఇంద్ర, వరుణ గ్రహాల చుట్టూ కూడా ఆ రింగులు ఉన్నాయి. అయితే అటువంటి వలయాలు ఒకప్పుడు భూమి చుట్టూ కూడా ఏర్పడి ఉండవచ్చని భావిస్తున్నారు. ఇందుకు తగిన సాక్ష్యాలు లభించినట్టు ఎర్త్ అండ్ ప్లానెటరీ సైన్స్ లెటర్స్‌లో గత వారం ప్రచురితమైన ఒక నివేదిక పేర్కొన్నది. 46.6 కోట్ల సంవత్సరాల క్రితం ఏర్పడిన ఒక రింగు కొన్ని లక్షల సంవత్సరాలపాటు భూమి చుట్టూ ఉండేదని తెలిపింది. 46 కోట్ల సంవత్సరాలకు పూర్వం భారీ సంఖ్యలో ఉల్కలు భూమిని ఢీకొనేవని పేర్కొంది. భౌగోళికంగా కొద్ది కాలంలో ఏర్పడిన అనేక అగ్ని బిలాలను బట్టి ఇది తెలుస్తున్నదని ఆ పత్రం వివరించింది. అదే కాలంలో చైనా, రష్యా, యూరోప్ ప్రాంతాలలోని సున్నపురాయి నిక్షేపాలలో ప్రత్యేకమైన ఉల్కా నుంచి పడిన వ్యర్థాలను కనుగొన్నామని పేర్కొంది. ఈ అవక్షేపణ శిలలలోని ఉల్కా శకలాలు అంతరిక్షం నుంచి వెలువడే రేడియేషన్‌కు గురయ్యాయని తెలిపింది. భూమి చుట్టూ పలుచోట్ల కుప్పలుగా పడి ఉన్న అవక్షేపన శిలలను బట్టి ఆ సమయంలో భారీ సంఖ్యలో సునామీలు సంభవించినట్టు తెలుస్తున్నదని పేర్కొంది.

ఒరుపైనా, వర్షమైనా.. జెట్టీలే దిక్కు

- ఏజెన్సీ గూడేలకు ప్రాథమిక వైద్యం నేటికీ అందని ద్రాక్షే
- పురిటినొప్పుల వేళ ఆదివాసీ గర్భిణులకు మరింత నరకం

చర్ల, సెప్టెంబర్ 16: ఏజెన్సీ గూడేలకు ప్రాథమిక వైద్యం నేటికీ అందని ద్రాక్షగానే మిగిలింది. నగరీకరణ, నాగరిక సమాజాలు విస్తరిస్తున్న వేళ ఆదివాసీ అతివలు అమ్మతనాన్ని ఆస్వాదించాలంటే.. అనంత కష్టాలు పడాల్సిందే. ముఖ్యంగా గిరిజన గర్భిణులు మరో బిడ్డకు జన్మనివ్వాలంటే.. ఒరుపైనా, వర్షమైనా జెట్టీల్లోనే దవాఖానకు చేరుకోవాలి. పురిటినొప్పుల వేళ వారు ప్రాథమిక వైద్యం పొందాలన్నా కిలోమీటర్ల మేర నడవాల్సిందే. గర్భిణులను జెట్టీలో పడుకోబెట్టి భుజాలు మార్చుకుంటూ అక్కడి యువకులు పరుగులు పెట్టాల్సిందే. అందుకు సోమవారం ఇద్దరు గర్భిణులు అనుభవించిన పురిటినొప్పుల వేదన అద్దం పడుతున్నది. భద్రాద్రి జిల్లా ఏజెన్సీ మండలమైన చర్లలోని బట్టిగూడెం గ్రామానికి చెందిన రవ్వ సుబ్బమ్మ, రవ్వ దేవిలకు పురిటినొప్పులు ప్రారంభయ్యాయి. అందుబాటులో వైద్యశాల లేదు. సత్యనారాయణపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వారిని తరలించేందుకు ఆదివాసీ యువకులు అనేక పాట్లు పడ్డారు. ఇద్దరినీ వేర్వేరు జెట్టీలపై మోసుకుంటూ మూడు కిలోమీటర్ల మేర నడిచి వచ్చారు. అటవీ మార్గం ద్వారా ప్రయాణించి రోడ్డు పాయింట్ ఉన్న తిప్పాపురం వద్దకు చేరుకున్నారు. అక్కడి నుంచి అంబులెన్స్ ద్వారా సత్యనారాయణపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం భద్రాచలం ఏరియా దవాఖానకు తీసుకెళ్లారు.



భద్రాద్రి జిల్లా బట్టిగూడెం గ్రామం నుంచి పురిటినొప్పులతో బాధపడుతున్న గర్భిణిని జెట్టీపై దవాఖానకు తరలిస్తున్న యువకులు

ల్యాబ్ టెక్నీషియన్ల పని నర్సులతో!

అదనంగా శాంపిళ్లు, రిపోర్టుల సేకరణ బాధ్యతలు

హైదరాబాద్, సెప్టెంబర్ 16 (నమస్తే తెలంగాణ): ల్యాబ్ టెక్నీషియన్లు చేయాల్సిన పనిని తమతో చేయిస్తున్నారంటూ నర్సులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ల్యాబ్ టెస్టుల కోసం రోగుల నుంచి రక్త, మూత్ర నమూనాల సేకరణ, ల్యాబ్‌లో అప్పగింత, రిపోర్టులను తీసుకొచ్చే బాధ్యత కూడా తమపైనే వేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నాగర్ కర్నూల్ జిల్లా దవాఖాన సూపరింటెండెంట్ ఇటీవలే సర్క్యులర్ కూడా జారీ చేశారు. అన్ని దవాఖానల్లో ఇదే పరిస్థితి ఉన్నదని నర్సులు వాపోతున్నారు. నిబంధనల ప్రకారం ఈ పనులు ల్యాబ్ టెక్నీషియన్లు చేయాల్సి ఉంటుంది. స్టాండింగ్ ఆర్డర్స్‌లోనూ స్పష్టంగా పేర్కొన్నారు. సరైన పద్ధతిలో శాంపిళ్ల సేకరణ, రవాణా, పరీక్షలు జరగాలంటే ల్యాబ్ టెక్నీషియన్లే చేయాల్సి ఉంటుందని నర్సులు చెబుతున్నారు. సరైన శిక్షణ లేని తమతో ఆ పనిచేయిస్తే, ఒకవేళ ఏదైనా తప్పిదం జరిగితే బాధ్యతెవరిదని ప్రశ్నిస్తున్నారు. 'నిబంధనల ప్రకారం ప్రతి 45 మంది పేషెంట్లకు ఒక నర్సు ఉండాలి. కానీ మా వార్డులో 73 మంది ఇన్ పేషెంట్లు ఉంటే.. నేను ఒక్కదాన్నే ఉన్నాను' అని ములుగు జిల్లాకు చెందిన ఓ నర్సు వాపోయారు. దీంతో పేషెంట్ కేర్‌పై ప్రభావం పడుతున్నట్టు తెలిపారు. ఇప్పటికే ఫార్మసీ విధులు నిర్వహిస్తున్నామని, ఇప్పుడు ల్యాబ్ టెక్నీషియన్ బాధ్యతలు కూడా అప్పగించడం సరికాదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి తమపై పనిభారం తగ్గించాలని కోరుతున్నారు.

ప్రపంచంలోనే వృద్ధ మార్జాలం మృతి



లండన్, సెప్టెంబర్ 16: ప్రపంచంలోనే అత్యంత వృద్ధ మార్జాలం రోజీ మరణించింది. యూకేలో నార్విచ్‌లోని ఆ పిల్లి యజమానురాలు లిలా బ్రిసెట్ ఇటీవల దానికి అంతిమ వీడ్కోలు పలికారు. ప్రపంచంలోనే అత్యంత వృద్ధ పిల్లిగా భావించే ఈ పిల్లి వయసు 33 ఏండ్లు. ప్రస్తుతం అత్యంత వృద్ధ పిల్లులలో కెంట్‌కు చెందిన ఫ్లాసీకి 28 ఏండ్లు కాగా, 1991లో జన్మించిన రోజీ 33వ ఏట మరణించింది. మానవుల ఆయుష్షుతో పోలిస్తే ఇది 152 ఏండ్లతో సమానం. కాగా, ఇప్పటివరకు అతి ఎక్కువ కాలం జీవించిన రికార్డు టెక్సాస్‌లోని ఆస్టిన్‌కు చెందిన క్రీమ్ పఫ్ పేరున ఉంది. ఆ పిల్లి 38 ఏండ్లు జీవించి 2005లో చనిపోయింది.



రేవంత్‌రెడ్డికి చెక్కు అందజేస్తున్న చిరంజీవి

వరద బాధితులకు 'చిరు' విరాళం

సీఎం రేవంత్‌రెడ్డికి చెక్కుల అందజేత

హైదరాబాద్, సెప్టెంబర్ 16(నమస్తే తెలంగాణ): వరద బాధితుల సహాయార్థం సినీ నటుడు చిరంజీవి రూ. 50 లక్షల విరాళం అందించారు. ఆయన తనయుడు సినీ హీరో రాంచరణ్ తరుపున మరో రూ. 50 లక్షలు వితరణ చేశారు. ఇందుకు సంబంధించిన చెక్కులను సోమవారం సీఎం రేవంత్‌రెడ్డిని ఆయన నివాసంలో కలిసి అందజేశారు. అమర్‌రాజా గ్రూ ప్ తరుపున రూ. కోటి చెక్కును మాజీ మంత్రి గల్లా అరుణకుమారి సీఎం రేవంత్‌కు అందజేశారు. గరుడపల్లి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కంపెనీ డైరెక్టర్ సంజయ్ రూ. 25లక్షలు, మాజీ ఎం పీ రాజమోహన్‌రెడ్డి రూ. 25 లక్షలు, సినీ నటులు విశ్వక్‌సేన్ రూ.10 లక్షలు, సాయిధరమ్‌తేజ్ రూ. 10లక్షలు, అలీ రూ. 3లక్షలు విరాళంగా ఇచ్చారు.

కలప కటకట

- అడవుల జిల్లాల్లోనూ అదే పరిస్థితి
- కొన్నేండ్లుగా తగ్గుతున్న ఉత్పత్తి
- హోం ఫర్నిచర్‌లో 80% విదేశీ దిగుమతులే
- రాష్ట్ర అవసరాలను తీరుస్తున్న నాగ్‌పూర్ మార్కెట్
- భారతీయ టేకుకు ప్రపంచంలోనే అధిక డిమాండ్

హైదరాబాద్, సెప్టెంబర్16 (నమస్తే తెలంగాణ): రాష్ట్రవ్యాప్తంగా కొన్నేండ్లుగా కలప ఉత్పత్తి తగ్గింది. గృహ నిర్మాణాలు పెరగడంతో డిమాండ్‌కు సరిపడా కలప దొరకడంలేదు. దీంతో కలప అవసరాలు తీర్చుకునేందుకు విదేశీ దిగుమతులపై ఆధారపడాల్సి వస్తున్నది. అటవీప్రాంతాలు దండిగా ఉన్న ఉమ్మడి ఆదిలాబాద్, ఖమ్మం, మహబూబ్‌నగర్ జిల్లాల్లోనూ ఇలాంటి వాతావరణం నెలకొనడం ఆందోళన కలిగిస్తున్నది. స్థానిక కలప లభ్యత తగ్గిపోవడంతో ధర కూడా పెరిగింది. విదేశాల నుంచి భారీగా టేకు కర్ర దిగుమతి అవుతుండటం, వాటి ధర కొంత తక్కువగా ఉండటంతో వ్యాపారులంతా దానినే ఉపయోగిస్తున్నారు.

80% విదేశాల నుంచి దిగుమతి

ప్రస్తుతం వినియోగించే టేకు కలపలో 80 శాతానికిపైగా విదేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్నారు. మరికొంత ఉత్తరాఖండ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర నుంచి వస్తున్నది. విదేశాల నుంచి ఏటా లక్షన్నర క్యూబిక్ మీటర్లకుపైగా కలప దిగుమతి అవుతున్నట్టు అధికారులు చెప్తున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోనే ఎనిమిది వేల క్యూబిక్ మీటర్లకుపైగా టేకు కలప అమ్ముడవుతున్నట్టు తెలిపారు.

విదేశాల నుంచి కలప

భారత్‌కు ఇండోనేషియా, సూడాన్, గనా, బ్రెజిల్, ఈక్వెడార్, శ్రీలంకతోపాటు పలు ఆఫ్రికన్ దేశాల నుంచి కలప దిగుమతి అవుతున్నది. సముద్ర మార్గంలో కోల్‌కతా, గుజరాత్, ముంబై, చెన్నై, విశాఖపట్టణం పోర్టులకు ఓడల ద్వారా కలపను పంపిస్తున్నారు. అక్కడినుంచి ట్రక్కులు, కంటెయినర్లలో వివిధ ప్రాంతాలకు రవాణా చేస్తున్నారు. గుజరాత్‌లోని కాండ్లా పోర్టు నుంచి సమీపంలోని గాంధీధామ్‌లో ఉన్న ప్రధాన వాణిజ్య కేంద్రానికి కర్రను పంపిస్తారు. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో మహారాష్ట్రలోని నాగ్‌పూర్, హైదరాబాద్‌కు టేకు రవాణా అవుతున్నది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ కలప అవసరాలను నాగ్‌పూర్ మార్కెటు తీరుస్తున్నది. ఈ నగరంలో 300కుపైగా కలప మిల్లులున్నాయి. ఇక్కడి వ్యాపారులు అవసరమైతే ఆయా దేశాలకు స్వయంగా వెళ్లి నాణ్యతను పరిశీలించి, కావాల్సిన సరకును ఆర్డర్ చేసి తీసుకుంటారు. గతంలో బర్మా (మయన్మార్) టేకును ఎక్కువగా ఉపయోగించేవారు. ప్రస్తుతం ఆ దేశం తన అవసరాల దృష్ట్యా ఎగుమతులు నిలివేయడంతో మిగతా దేశాలు ఎగుమతులను పెంచాయి.

మూడు గ్రేడ్‌ల్లో కలప నాణ్యత

ప్రస్తుతం టేకు కలపను 3 గ్రేడ్‌లుగా వ్యాపారులు విభజించారు.

- గ్రేడ్-ఏ టేకు కలప ధర క్యూబిక్ ఫీట్‌కు రూ.1,500 నుంచి రూ.9,000 వరకు పలుకుతున్నది.
- గ్రేడ్-బీ రకం రూ.1,200 నుంచి రూ.5,500 వరకు ఉంటుంది.
- గ్రేడ్-సీ రకం రూ.600 నుంచి రూ.3,500 వరకు పలుకుతున్నది.
- ప్రీమియం క్వాలిటీ టేకు కలప గోధుమ, తెలుపు-పసుపు రంగుల్లో ఉంటుంది. దీనిని ఎక్కువగా సముద్ర పరిశ్రమల్లో ప్రధాన ముడి పదార్థంగా వినియోగిస్తారు. అధికంగా చమురు స్వభావం ఉండటంతో నీటిని గ్రహించదు. దీని వాసన పాత చర్మం వాసనను పోలి ఉంటుంది. పడవల తయారీకి ప్రధానంగా ఈ రకం కలపను వినియోగిస్తారు. దీని నాణ్యతను వాసన ద్వారా గుర్తించవచ్చు.
- నాణ్యమైన టేకు చెక్క బంగారం రంగులో గోధుమ షేడ్స్‌తో ఉంటుంది. చెట్టు పెరిగిన స్థలం భౌగోళిక స్థితిపై దాని రంగు ఆధారపడి ఉంటుందని అటవీశాఖ అధికారులు చెప్తున్నారు.

మార్కెట్‌లోఆరు రకాల టేకు కలప

మార్కెట్‌లో ప్రస్తుతం ప్రధానంగా ఆరు రకాల టేకు కలప ఎక్కువగా దొరుకుతున్నది. వాటిలో ప్రతి ఒక్కటి విభిన్న లక్షణాలను కలిగి ఉంటుంది.

- బర్మా టేకు 50 ఏండ్లు పెరుగుతుంది. దీనిని బర్మాలో గుర్తించడంతో ఆ పేరు వచ్చింది. ఇది గోల్డ్ టోన్డ్ కలర్‌ను పోలి ఉంటుంది. దీనిలో అధిక నూనె పదార్థం ఉంటుంది.
- నిజానికి ప్రపంచంలోనే అత్యంత నాణ్యమైనది భారతీయ టేకు. అడవుల్లో పెరిగేందుకు అనుకూలం. చమురు స్వభావం ఎక్కువ. అంతర్జాతీయ మార్కెట్‌లో దీనికి అధిక డిమాండ్ ఉంటుంది.
- ఇండోనేషియా టేకును అంతర్జాతీయ ప్రమాణాల ప్రకారం గ్రేడ్-ఏ కింద గుర్తించారు. ఇది తేనె-టోన్ రంగులను కలిగి ఉంటుంది. ఎక్కువ కాలం మన్నికగా ఉండటంతో ప్రపంచంలోనే అత్యంత ఖరీదైనది. దీనితో తయారుచేసిన ఫర్నిచర్‌కు తరచూ నూనెతో మెరుగుపరచాలి.
- థాయిలాండ్ టేకును గుర్తించడం కష్టం. అందువల్ల దీనిని అంతరించిపోతున్న జాతిగా గుర్తించారు. దీనిని ప్రధానంగా అవుట్‌డోర్ ఫర్నిచర్‌ను తయారు చేయడానికి ఉపయోగిస్తారు.
- ఆఫ్రికన్ టేకు నాసిరకం కలప. ఇది సాధారణంగా తక్కువ నూనె కలిగి ఉంటుంది. తెగులు, చెదపురుగులు చేరే అవకాశం ఉంటుంది. ఇది 15 నుంచి 20 ఏండ్ల వరకు మాత్రమే పెరుగుతుంది.
- దక్షిణ అమెరికా టేకు చమురు, రంగు, బరువులో ఆఫ్రికన్ టేకు మాదిరిగానే డిజైన్ పరిశ్రమలో ఉపయోగిస్తారు. కఠినమైన వాతావరణానికి గురైనప్పుడు తక్కువ సంకోచం కలిగి ఉంటుంది.

స్థానిక టేకు నాణ్యమైనది

దేశీయ, విదేశీ టేకు కలప రకాల మధ్య నాణ్యతలో స్వల్పంగా తేడా ఉంటుంది. విదేశీ కలపతో పోలిస్తే స్థానిక కలప నాణ్యతలో మెరుగ్గా ఉంటుంది. ఆదిలాబాద్, ఖమ్మం, మహబూబ్‌నగర్‌లోని వాతావరణ పరిస్థితులతో ఇక్కడ పెరిగే టేకు నాణ్యంగా ఉంటుంది.

-ఆర్‌ఎం దోబ్రియల్, అటవీశాఖ ప్రధాన రక్షణాధికారి

నిజాలేంటో చెప్తున్నారుగా..

సెబీ చీఫ్ వ్యవహారంపై కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 16: సెబీ చైర్‌పర్సన్ మాధబి పురి బచ్ దంపతుల వ్యవహారంపై కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ తొలిసారి స్పందించారు. మాధబి పురి బచ్, ఆమె భర్త ధవల్ బచ్ తమను తాము రక్షించుకొంటూనే, తమపై వచ్చిన ఆరోపణలకు ధీటుగా స్పందిస్తున్నారన్నారు. సోమవారం న్యూస్18 ఇండియా కార్యక్రమంలో మాట్లాడుతూ.. 'చాలా ఆరోపణలకు సమాధానాలు వస్తున్నాయ్. ఈ నిజాలను పరిగణనలోకి తీసుకుంటారనే అనుకుంటున్నాను' అని ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్‌నుద్దేశించి పరోక్షంగా మంత్రి వ్యాఖ్యానించారు. దీంతో ఈ అంశంలో మాధబి పురి బచ్ సమాధానాలపట్ల మీరు సంతృప్తికరంగా ఉన్నారా? అన్న ప్రశ్నకు 'నేనిక్కడ ఉన్నది దాన్ని నిర్ధారించేందుకు కాదు' అని నిర్మలా సీతారామన్ బదులిచ్చారు. బచ్ దంపతులు అక్రమాలకు పాల్పడ్డారని, లాభాపేక్ష నిర్ణయాలు తీసుకున్నారన్న ఆరోపణలు వస్తున్న సంగతి విదితమే. అదానీ వ్యవహారంలో బచ్ అవినీతికి దిగారని హిండెన్‌బర్గ్ ఆరోపించినదీ తెలిసిందే.

రేపట్నుంచి ఎన్‌పీఎస్ వాత్సల్య

నేషనల్ పెన్షన్ సిస్టమ్ (ఎన్‌పీఎస్) వాత్సల్య పథకాన్ని బుధవారం నిర్మలా సీతారామన్ ప్రారంభించనున్నారు. ఈ ఆర్థిక సంవత్సరానికి (2024-25)గాను జూలైలో పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్‌లో ఎన్‌పీఎస్ వాత్సల్య స్కీంను ప్రకటించిన విషయం తెలిసిందే.

బీఎండబ్ల్యూ రిటైల్.నెక్స్ట్

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 16: అన్ని వాహనాలను ఒకచోట కొనుగోలుదారులకు అందించే ఉద్దేశంలో భాగంగా జర్మనీకి చెందిన లగ్జరీ కార్ల తయారీ సంస్థ బీఎండబ్ల్యూ..నూతనంగా రిటైల్.నెక్స్ట్ పేరుతో సరికొత్త సేవలకు శ్రీకారం చుట్టింది. ఈ సేవల్లో భాగంగా బీఎండబ్ల్యూ, మినీ, బీఎండబ్ల్యూ మోటరాడ్ మాడళ్లు ఒకే షోరూంలో లభించనున్నాయి. ఈ నూతన సేవలకోసం వచ్చే మూడేండ్లకాలంలో బీఎండబ్ల్యూతో పాటు డీలర్లు రూ.365.6 కోట్ల మేర పెట్టుబడులు పెట్టబోతున్నట్లు బీఎండబ్ల్యూ గ్రూపు ఇండియా ప్రెసిడెంట్, సీఈవో విక్రమ్ పవాహ్ తెలిపారు.

70కి వచ్చి.. 165లో నిలిచి

బజాజ్ హౌసింగ్ ఫైనాన్స్ బంపర్ హిట్

- స్టాక్ మార్కెట్ ఎంట్రీ అదుర్స్
- తొలిరోజు 136 శాతం ఎగిసిన షేర్
- ఎగబడి కొన్న మదుపరులు
- అప్పర్ సర్క్యూట్‌ను తాకిన స్టాక్స్
- రూ.1.37 లక్షల కోట్లకు మార్కెట్ విలువ



సోమవారం ముంబైలోని ఎన్‌ఎస్‌ఈలో బజాజ్ హౌసింగ్ ఫైనాన్స్ లిస్టింగ్ సందర్భంగా బజాజ్ ఫైనాన్స్ ఎండీ రాజీవ్ జైన్, బజాజ్ హౌసింగ్ ఫైనాన్స్ ఎండీ అతుల్ జైన్, బజాజ్ ఫిన్‌సర్వ్ సీఎండీ సంజీవ్ బజాజ్‌లు.



న్యూఢిల్లీ, సెప్టెంబర్ 16: ఐపీవో బిడ్డింగ్‌లో సంచలనం సృష్టించిన బజాజ్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ (బీహెచ్‌ఎఫ్ఎల్).. స్టాక్ మార్కెట్ల ఎంట్రీలోనూ రికార్డుల్ని నెలకొల్పింది. సోమవారం కంపెనీ షేర్ల కోసం మదుపరులు ఎగబడిపోయారు. దీంతో ఇష్యూ ధరపై 114.28 శాతం ఎగిసి లిస్టింగ్ జరిగింది. రూ.70 ధరతో వచ్చి రూ.150 వద్ద నమోదైంది. ఇన్వెస్టర్ల నుంచి ఈ ఆదరణ అలాగే కొనసాగడంతో అప్పర్ సర్క్యూట్ లిమిట్‌ను తాకింది. బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ)లో 135.70 శాతం పుంజుకొని 164.99 వద్ద ముగిసింది. నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ)లోనూ 135.71 శాతం ఎగబాకి రూ.165 వద్ద నిలిచింది.

ఎం-క్యాప్ హై జంప్

దేశీయ స్టాక్ మార్కెట్లలో బ్రహ్మాండంగా లిస్టింగైన బజాజ్ హౌసింగ్ ఫైనాన్స్ సంస్థ మార్కెట్ విలువ భారీ ఎత్తున పెరిగింది. రూ.1,37,406.09 కోట్లకు చేరింది. కంపెనీ షేర్లకు మదుపరులు బ్రహ్మరథం పట్టడంతో విలువ ఇష్యూ ధరపై 136 శాతం పుంజుకున్నది. ఇక ఒక్కో షేర్ ధర రూ.66-70 శ్రేణితో రూ.6,560 కోట్ల ఇనీషియల్ పబ్లిక్ ఆఫర్ (ఐపీవో)కు వచ్చిన కంపెనీ.. ఏకంగా 63.60 రెట్లు అధికంగా బిడ్లను అందుకున్న విషయం తెలిసిందే. వీటి విలువ రూ.3.23 లక్షల కోట్లపైనే కావడం గమనార్హం. దీంతో దేశీయ స్టాక్ మార్కెట్ల చరిత్రలోనే ఓ పబ్లిక్ ఇష్యూకు ఈ స్థాయిలో బిడ్డింగ్ రావడం ఇదే తొలిసారైంది.

ఆల్‌టైమ్ హైకి సెన్సెక్స్

బీఎస్ఈ సూచీ సెన్సెక్స్ ఆల్‌టైమ్ హైలో ముగిసింది. సోమవారం 97.84 పాయింట్లు లేదా 0.12 శాతం పెరిగి మునుపెన్నడూ లేనివిధంగా 82,988.78 వద్ద స్థిరపడింది. ఒకానొక దశలోనైతే 83,184.34 పాయింట్లను తాకింది. దీంతో నూతన ఇంట్రా-డే హై నమోదైంది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 27.25 పాయింట్లు లేదా 0.11 శాతం అందుకుని 25,383.75 వద్ద ఉన్నది. ఆల్‌టైమ్ హైకి కేవలం 5 పాయింట్ల దూరంలో ఆగింది. అయినప్పటికీ ఇంట్రా-డేలో గతంలో ఎప్పుడూ లేనట్టుగా 25,445.70 స్థాయిని తాకింది. రంగాలవారీగా చూస్తే.. యుటిలిటీస్, పవర్, మెటల్, క్యాపిటల్ గూడ్స్, కన్జ్యూమర్ డ్యూరబుల్స్ షేర్లు పెరిగాయి. ఎన్టీపీసీ షేర్ విలువ అత్యధికంగా 2.44 శాతం ఎగిసింది. జేఎస్‌డబ్ల్యూ స్టీల్, ఎల్ అండ్‌టీ, ఐసీఐసీఐ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్, నెస్లే, మహీంద్రా అండ్ మహీంద్రా, టాటా స్టీల్ షేర్లూ పరుగులు పెట్టాయి. బజాజ్ ఫైనాన్స్ షేర్ విలువ మాత్రం 3 శాతానికిపైగా క్షీణించింది.

టాప్-10 హౌసింగ్ ఫైనాన్స్‌ల్లో (రూ.కోట్లలో)

సంస్థ	మార్కెట్ విలువ
బజాజ్ హెచ్‌ఎఫ్ఎల్	1,37,406.09
హడ్కో	49,476.96
ఎల్ఐసీ హెచ్‌ఎఫ్ఎల్	37,434.54
పీఎన్‌బీ హెచ్‌ఎఫ్ఎల్	27,581.41
ఆధార్ హెచ్‌ఎఫ్ఎల్	20,045.16
ఆప్టస్ వాల్యూ	16,598.17
ఆవాస్ ఫైనాన్షియర్స్	14,278.33
కెన్ ఫిన్ హోమ్స్	11,983.87
సమ్మాన్ క్యాపిటల్	11,773.23
హోమ్ ఫస్ట్ ఫైనాన్స్	10,602.99

మహీంద్రా తేలికపాటి వాణిజ్య వాహనాలు

'వీరో' ఎల్‌సీవీ పరిచయం.. ప్రారంభ ధర రూ.7.99 లక్షలు

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 16: మహీంద్రా అండ్ మహీంద్రా తాజాగా లైట్ కమర్షియల్ సెగ్మెంట్‌లోకి అడుగుపెట్టింది. 2-3.5 టన్నుల లోపు సామర్థ్యం కలిగిన 'వీరో' లైట్ కమర్షియల్ వాహనాలను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ వాహనాలు రూ.7.99 లక్షల నుంచి రూ.9.56 లక్షల ధరల శ్రేణిలో లభించనున్నాయి. ఈ ధరలు ఢిల్లీ షోరూంనకు సంబంధించినవి. ఈ సందర్భంగా మహీంద్రా అండ్ మహీంద్రా ప్రెసిడెంట్ ఆటోమోటివ్ డివిజన్ విజయ్ నక్రా మాట్లాడుతూ..దేశంలో అత్యధిక వృద్ధిని నమోదు చేసుకుంటున్న ఎల్‌సీవీ సెగ్మెంట్‌ను మరింత బలోపేతం చేయడానికి ఈ కొత్త వెర్షన్ మాడళ్లను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు చెప్పారు. ఇందుకోసం రూ.900 కోట్ల వరకు పెట్టుబడులు పెట్టినట్లు చెప్పారు. డీజిల్, సీఎన్‌జీ ఇంజిన్‌తో తయారైన ఈ వాహనాలతో పాటు భవిష్యత్తులో ఈవీని కూడా విడుదల చేయబోతున్నట్లు ఆయన ప్రకటించారు. రెండు రకాల్లో లభించనున్న ఈ మాడల్ లీటర్ డీజిల్‌కు 18.4 కిలోమీటర్లు, కిలో సీఎన్‌జీకి 19.2 కిలోమీటర్ల మైలేజీ ఇవ్వనున్నది. ఈ ఎల్‌సీవీలో ఎయిర్‌బ్యాగ్ ఆప్షన్ కూడా ఉన్నదని, ఇందుకోసం రూ.15 వేలు అదనంగా చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. 10.25 అంగుళాల టచ్‌స్క్రీన్, రివర్స్ పార్కింగ్ కెమెరా వంటి ఫీచర్స్ ఉన్నాయి.



హోండా బైకుల రీకాల్

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 16: హోండా మోటర్‌సైకిల్ పలు బైకులను రీకాల్ చేస్తున్నట్లు ప్రకటించింది. వీల్ స్పీడ్ సెన్సార్, క్యామ్‌షాఫ్ట్‌లో సాంకేతిక సమస్యలు తలెత్తడంతో సీబీ300ఎఫ్, సీబీ300ఆర్, సీబీ350, హెచ్‌నెస్ సీబీ 350, సీబీ350 ఆర్ఎస్ వెనక్కిపిలిపిస్తున్నట్లు తెలిపింది. అక్టోబర్ 2020 నుంచి ఏప్రిల్ 2024 లోపు తయారైన ఈ మాడళ్లను రీకాల్ చేస్తున్నట్లు వెల్లడించింది.

బెనెల్లీ బైకులపై రాయితీలు

హైదరాబాద్, సెప్టెంబర్ 16: వచ్చే పండుగ సీజన్‌లో బెనెల్లీ, జోంటస్ సూపర్ బైకులను కొనుగోలు చేసినవారికి రూ.30 వేల వరకు ఆర్థిక ప్రయోజనాలు కల్పిస్తున్నట్లు తెలిపింది. జోంటస్ 350 సీసీ బైకులను కొనుగోలు చేసిన వారికి రూ.20 వేల విలువైన రెండేండ్ల పాటు సర్వీస్ వ్యారంటీ, బెనెల్లీ బైకులపై రూ.30 వేల రెండేండ్ల పాటు సర్వీసు ప్రయోజనాలు కల్పించనున్నది.

అటకెక్కిన ఏరోస్పేస్ వర్సిటీ!

బీఆర్ఎస్ హయాంలో కసరత్తు • ప్రభుత్వం మారాక మూలనపడ్డ ప్రతిపాదన

హైదరాబాద్, సెప్టెంబర్ 16(నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో ఏరోస్పేస్ యూనివర్సిటీ ఏర్పాటు ప్రతిపాదన అటకెక్కినట్లే కనిపిస్తున్నది. తెలంగాణను ఏరోస్పేస్ హబ్‌గా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పలు దేశ, విదేశీ దిగ్గజ కంపెనీల భాగస్వామ్యంతో ఈ యూనివర్సిటీ ఏర్పాటుకు ప్రణాళికలు ప్రకటించారు. అంతేకాదు, రాష్ట్రంలో అనేక అంతర్జాతీయ సంస్థల ఏర్పాటు ద్వారా ఏరోస్పేస్ రంగ అభివృద్ధికి అవసరమైన పర్యావరణ వ్యవస్థను కూడా నెలకొల్పింది. కానీ రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో ఈ కీలక ప్రతిపాదనను కాంగ్రెస్ సర్కార్ మూలనపడేసింది. దీనిపై ప్రభుత్వ ఉన్నతాధికారులు స్పందించడానికి నిరాకరిస్తున్నారు. నిజానికి గత ప్రభుత్వ కృషితో అమెరికాకు చెందిన లాక్‌హీడ్ మార్టిన్, టాటా గ్రూపు సంయుక్తంగా తయారీ కేంద్రాన్ని నెలకొల్పాయి. ఇక్కడ తయారవుతున్న హెలీకాప్టర్ క్యాబిన్‌లు సహా ఇతర విడిభాగాలు విదేశాలకు ఎగుమతి అవుతున్నాయి. అలాగే బోయింగ్, జీఈ, ప్రాట్ అండ్ విట్నీ, శాఫ్రాన్, జీఎమ్మార్ తదితర కంపెనీలు హైదరాబాద్‌లో తయారీ కేంద్రాలతోపాటు ఎంఆర్‌వో(మెయింటనెన్స్, రిపేర్ అండ్ ఓవరాల్)లను ఏర్పాటు చేశాయి. వీటికి అనుబంధంగా వెయ్యికి పైగా చిన్న సంస్థలు వెలిశాయి.

ఆదిబట్లలోనే అంకురార్పణ

దేశంలోనే మొట్టమొదటి ఏరోస్పేస్ క్లస్టర్‌ను గత బీఆర్ఎస్ ప్రభుత్వం హైదరాబాద్‌కు సమీపంలోని ఆదిబట్లలో ఏర్పాటు చేసింది. ఈ నేపథ్యంలోనే ఏరోస్పేస్ యూనివర్శిటీని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. గత ఏడాది కేటీఆర్ అమెరికా పర్యటన సందర్భంగా పలు ఏరోస్పేస్ కంపెనీలు రాష్ట్రంలో తమ పెట్టుబడులను విస్తరించడంతోపాటు వర్శిటీ ఏర్పాటుకు ముందుకొచ్చాయి. మారిన రాజకీయ పరిణామాల నేపథ్యంలో ఈ ప్రతిపాదన ముందుకు సాగకపోవడంతో ఆ సంస్థలు కూడా వెనుకంజ వేసినట్లు తెలుస్తున్నది. ఈ యూనివర్శిటీ ఏర్పాటువల్ల ఇక్కడే పరిశ్రమకు అవసరమైన నైపుణ్యాలు అందుబాటులోకి వస్తాయని, తద్వారా ఏరోస్పేస్ రంగం విస్తరించే అవకాశముంటుందని అధికారవర్గాలు చెబుతున్నాయి.

హెచ్‌సీఎల్ టెక్నాలజీ నం.1

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 16: దేశీయ ఐటీ సంస్థ హెచ్‌సీఎల్ టెక్నాలజీ మరోసారి తన సత్తాను చాటింది. దేశవ్యాప్తంగా ఉన్న అత్యుత్తమ కంపెనీల్లో హెచ్‌సీఎల్ తొలి స్థానంలో నిలిచిందని టైమ్ మ్యాగజైన్ విడుదల చేసిన 'ప్రపంచ అత్యుత్తమ కంపెనీలు 2024' జాబితాలో వెల్లడించింది. నోయిడా కేంద్రంగా ఐటీ సేవలు అందిస్తున్న ఈ సంస్థ వృత్తిపరమైన సేవలు అందించే అంతర్జాతీయ టాప్-10 జాబితాలో కూడా చోటు దక్కించుకోవడం విశేషం. అంతర్జాతీయంగా కంపెనీల పనితీరు, ఉద్యోగుల సంతృప్తి, ఆదాయ వృద్ధి, స్థిరత్వం ఆధారంగా టైమ్స్ ఈ నివేదికను రూపొందించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో హెచ్‌సీఎల్ టెక్ రూ.28 వేల కోట్ల ఆదాయంపై రూ.4,257 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని గడించింది. ప్రస్తుతం సంస్థలో 2.19 లక్షల మంది ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు.

జినోమ్ వ్యాలీలో లారస్ పరిశోధన కేంద్రం

రూ.250 కోట్లతో ఏర్పాటు చేసిన సంస్థ

హైదరాబాద్, సెప్టెంబర్ 16 (నమస్తే తెలంగాణ): రాష్ట్రానికి చెందిన ప్రముఖ ఔషధ సంస్థ లారస్ ల్యాబ్స్ లిమిటెడ్.. జినోమ్ వ్యాలీలో నూతన పరిశోధన, అభివృద్ధి కేంద్రాన్ని(ఆర్ అండ్ డీ) ప్రారంభించింది. షామీర్‌పేట్‌లోని ఐకేపీ నాలెడ్జ్ పార్క్‌లో రూ.250 కోట్లతో ఏర్పాటు చేసిన ఈ సెంటర్‌తో 800 మందికి ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయి. 2 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన ఈ యూనిట్‌ను రాష్ట్ర ఐటీ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా లారస్ ల్యాబ్స్ ఫౌండర్, సీఈవో సత్యనారాయణ చావా మాట్లాడుతూ..ఈ నూతన ఆర్‌అండ్‌డీ సెంటర్‌ను కలుపుకొని మొత్తంగా ఐదు పరిశోధన కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు అయిందని, ఈ సెంటర్‌తో మరిన్ని ఔషధాలపై దృష్టి సారించడానికి వీలుపడనున్నదన్నారు. వచ్చే నాలుగేండ్లలో రూ.2,500 కోట్ల పెట్టుబడి పెట్టబోతున్నారు.

3జీవీ ఎక్సలెన్స్ సెంటర్ ప్రారంభం

3జీవీ జినోమ్ వ్యాలీలో ఏర్పాటు చేసిన ఐఎఫ్‌సీ-ఎడ్జ్ అడ్వాన్స్‌డ్ సర్టిఫైడ్ సైన్సెస్ సెంటర్‌ను శ్రీధర్ బాబు ప్రారంభించారు. 1.50 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన ఈ సెంటర్ కోసం సంస్థ రూ.105 కోట్ల నిధులు వెచ్చించింది.

పసివాడికి క్యాన్సరా?

పిల్లల పెంపకం

మా బాబు వయసు ఐదేండ్లు. పుట్టినప్పటి నుంచి ఆరోగ్యంగానే ఉన్నాడు. సమయానికి టీకాలు కూడా వేయించాం. చలాకీగా ఉండేవాడు. అయితే, కొద్దివారాలుగా బాబు కొంచెం నీరసంగా ఉంటున్నాడు. ఎప్పుడు చూసినా పడుకుంటున్నాడు. ఎందుకైనా మంచిదని వైద్యుణ్ని సంప్రదించాం. రెండుసార్లు బలానికి సిరప్‌లు రాసిచ్చారు. కానీ, గతవారం చెకప్ కోసం వెళ్లినప్పుడు.. పలు పరీక్షలు చేసి, బ్లడ్ క్యాన్సర్ ఉందేమోనన్న అనుమానం వ్యక్తంచేశారు. ఆ మాట వినడంతోనే మాకు గుండె ఆగినంత పనైంది. ఇంత చిన్నపిల్లలకు క్యాన్సర్ వస్తుందా? ట్రీట్‌మెంట్‌తో ఈ వ్యాధి నయమవుతుందా? మా అబ్బాయి మాకు దక్కుతాడా?

• **శ్రావణి,** మహబూబ్‌నగర్



కన్నబిడ్డకు క్యాన్సర్ అని తెలిసినప్పుడు ఏ తల్లిదండ్రులూ తట్టుకోలేరు. మీ బాధను అర్థం చేసుకోగలను. వైద్యులు మీ అబ్బాయికి బ్లడ్ క్యాన్సర్ ఉందని చెప్పారు. అక్యూట్ లుకేమియా అయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. చిన్నపిల్లలకూ క్యాన్సర్ రావొచ్చు. కాకపోతే, ఇప్పుడున్న చికిత్సా విధానాల కారణంగా పిల్లల్లో బ్లడ్ క్యాన్సర్‌ను పూర్తిగా తగ్గించవచ్చు. అయితే, ముందుగా అది ఏ రకమైన క్యాన్సరో నిర్ధారించాల్సి ఉంటుంది. మీరు ఏ మాత్రం ఆలస్యం చేయకుండా పీడియాట్రిక్ ఆంకాలజిస్ట్ (పిల్లల క్యాన్సర్ స్పెషలిస్ట్)ను సంప్రదించండి. వాళ్లు అవసరమైన పరీక్షలు చేయించి, వ్యాధిని నిర్ధారించి.. సరైన చికిత్స అందిస్తారు. వైద్యరంగంలో విప్లవాత్మకమైన మార్పులు వచ్చాయి. అత్యాధునిక చికిత్సా విధానాలు ఇప్పుడు అందుబాటులో ఉన్నాయి. వీటి సాయంతో మీ అబ్బాయిని రక్షించుకోవచ్చు. కాకపోతే, చికిత్స రెండేండ్లపాటు కొనసాగవచ్చు. ఒక క్రమపద్ధతిలో చికిత్స అందిస్తారు. కొన్ని కాంప్లికేషన్స్ కూడా తలెత్తవచ్చు. వాటిని నివారిస్తూ.. చికిత్స ఇస్తారు. వారు చెప్పిన నియమాలకు అనుగుణంగా ట్రీట్‌మెంట్ ఇప్పించాలి. మొదటిసారి కొద్ది రోజులు ఆస్పత్రిలో ఉండాల్సి వస్తుంది. తర్వాత అవసరానికి తగ్గట్టు వారానికో, రెండువారాలకో, నెలకో మళ్లీ సంప్రదించాల్సి ఉంటుంది. మొదట్లో తరచుగా వైద్యులను సంప్రదించాలి. తర్వాతర్వాత అడపాదడపా వెళ్లాల్సి ఉంటుంది. వైద్యులు సూచించిన పరీక్షలు చేయిస్తూ, చికిత్స తీసుకుంటే మీ అబ్బాయికి వ్యాధి పూర్తిగా నయమవుతుంది. ప్రస్తుతం కొన్ని ప్రభుత్వ దవాఖానల్లోనూ ఈ చికిత్స అందుబాటులో ఉంది. ఉదాహరణకు ఎం.ఎన్.జె ఆస్పత్రిలో పిల్లల క్యాన్సర్‌కు చికిత్స అందిస్తున్నారు. మీ వసతులు, పరిస్థితులకు అనుగుణంగా, క్యాన్సర్ స్పెషలిస్ట్ సూచనలు పాటిస్తూ నాణ్యమైన చికిత్స తీసుకోగలరని సలహా.



డాక్టర్ విజయానంద్
నియోనేటాలజిస్ట్ అండ్ పీడియాట్రీషియన్
రెయిన్‌బో చిల్డ్రన్స్ హాస్పిటల్స్

పిల్లల్లో మైగ్రేన్ నివారణ ఇలా

మైగ్రేన్ (పార్శ్వపునొప్పి) చిన్నపిల్లలకు ఓ సవాలు లాంటిది. పార్శ్వపునొప్పి కారణంగా బడి వేళల్లో పిల్లలు చాలా ఇబ్బందిపడతారు. తరగతిలో ఏకాగ్రత కుదరదు. మూడ్ పాడైపోతుంది. దీన్ని తట్టుకోవడం పిల్లలకు తలకు మించిన పనైపోతుంది. కొన్ని చిట్కాలను అనుసరిస్తే పిల్లలు మైగ్రేన్ బాధ, అసౌకర్యం నుంచి తప్పించుకోవచ్చు.



కారణాలు గుర్తించాలి

మైగ్రేన్ కొన్ని ప్రత్యేకమైన కారణాల వల్ల వస్తుంది. తీవ్రమైన కాంతి, పెద్ద శబ్దాలు, శరీరంలో డీహైడ్రేషన్ వంటివాటితోపాటు చాక్లెట్లు, ప్రాసెస్ చేసిన పదార్థాలతో తయారుచేసిన స్నాక్స్ లాంటివీ కారణం కావొచ్చు. వీటిని గుర్తించి తగినచర్యలు తీసుకోవాలి. తీవ్రమైన కాంతినిచ్చే బల్బులకు దూరంగా కూర్చోవడం, తక్కువ శబ్దం వచ్చేలా పరిసరాలను మార్చుకోవడంతో బడి వేళల్లో మైగ్రేన్ ముప్పును తగ్గించుకోవచ్చు.

తగినంత హైడ్రేషన్

పిల్లలు తరగతులు, ఆటల్లో పడిపోయి సరిగ్గా నీళ్లు తాగడం మర్చిపోతారు. కాబట్టి బడికి వెళ్లేటప్పుడు నీళ్ల సీసా వెంట తీసుకెళ్లమని గుర్తుచేయాలి. రోజులో తరచుగా నీళ్లు తాగుతూ ఉండమని సూచించాలి. బడిలో కూడా నీళ్లు తాగడానికి విరామం ఇవ్వాలి. శరీరంలో తగినంత హైడ్రేషన్ ఉంటే తలనొప్పికి ఆస్కారం ఉండదు.

విరామం తీసుకోవాలి

తలనొప్పిగా అనిపించినప్పుడు పిల్లలు కాసేపు విరామం తీసుకోవాలి. నిశ్శబ్దంగా ఉండే ప్రదేశంలో కూర్చోవాలి. నొప్పి పోయేవరకు కండ్లకు విశ్రాంతినివ్వాలి.

ఉపశమన పద్ధతులు

మైగ్రేన్స్‌కు ఒత్తిడి కూడా ఓ కారణమే. బళ్లలో కూడా పిల్లలకు ఒత్తిడి వాతావరణం ఉంటుంది. కాబట్టి, గట్టిగా గాలి పీల్చుకోవడం, విజువలైజ్ చేసుకోవడం లాంటి వ్యాయామాలను పిల్లలు చేస్తూ ఉండాలి. దీంతో ఒత్తిడి కాస్త తగ్గిపోతుంది. తలనొప్పి నుంచి ఉపశమనం లభిస్తుంది.

ఆరోగ్యకరమైన స్నాక్స్

తిండి సరిగ్గా తినకపోవడం, చక్కెరలు ఉన్న ఆహారం, ప్రాసెస్డ్ చిరుతిండ్లు కూడా మైగ్రేన్‌కు దారితీస్తాయి. అందుకని పిల్లలకు ఆరోగ్యకరమైన పోషకాలతో కూడిన ఆహారాన్నే పెట్టాలి. మెగ్నీషియం పుష్కలంగా ఉండే గింజలు, ఆకుకూరలు లాంటివి మైగ్రేన్‌ను నివారిస్తాయి. మంచి ఆహారాన్ని నియమిత వేళల్లో తీసుకుంటే తలనొప్పి ముప్పు తగ్గిపోతుంది.

శ్వాస వ్యవస్థపై ఇన్‌ఫ్లూయెంజా.. పంజా

వానకాలంలో జ్వరాలు పీడించడం సహజం. వీటిలో ప్రధానంగా ఇన్‌ఫ్లూయెంజా ప్రభావం అధికంగా ఉంటుంది. శ్వాస వ్యవస్థలో భాగమైన ముక్కు, గొంతు, ఊపిరితిత్తులకు వైరస్ ఇన్ఫెక్షన్ కారణంగా ఇన్‌ఫ్లూయెంజా సంభవిస్తుంది. దీన్ని క్లుప్తంగా ఫ్లూ అని పిలిచినప్పటికీ కొన్ని రకాలైన ఫ్లూ వైరస్‌లు పొట్టకు ఇబ్బందికరంగా ఉంటాయి. వీటి కారణంగా అతిసారం, వాంతులు లాంటి సమస్యలు తలెత్తుతాయి. కాబట్టి శ్వాసవ్యవస్థకు సోకే ఫ్లూ, పొట్టకు సమస్యగా ఉండే ఫ్లూ వేర్వేరని గ్రహించాలి. ఇక ఇన్‌ఫ్లూయెంజా బారినపడిన చాలామంది తమంతట తామే కోలుకుంటారు. కానీ, కొన్ని సందర్భాల్లో మాత్రం దీనివల్ల తలెత్తే లక్షణాలు తీవ్రంగా ఉంటాయి. ముఖ్యంగా పిల్లలు, వృద్ధులు, గర్భిణులు ఇన్‌ఫ్లూయెంజా విషయంలో చాలా జాగ్రత్తగా ఉండాలి.






ఇన్‌ఫ్లూయెంజా... వానకాలం, చలికాలంలో వచ్చే సీజనల్ వ్యాధుల్లో ప్రధానమైంది. ప్రస్తుతం తెలంగాణలో సీజనల్ వ్యాధిగ్రస్తుల్లో దాదాపు 80 శాతం మంది ఇన్‌ఫ్లూయెంజా బాధితులే. సాధారణంగా వానకాలంలో పరిసరాలు చిత్తడిగా తయారవుతాయి. పైగా గాలిలో తేమ శాతం కూడా ఎక్కువగా ఉంటుంది. దీనివల్ల వాతావరణంలోని వైరస్‌లు చురుగ్గా మారిపోతాయి. గాలిలో తేలుతూ ఉండే వైరస్‌లను శ్వాస ద్వారా పీల్చినప్పుడు మనుషులకు సోకుతాయి. ఫలితంగా ఆయా వైరస్‌లకు సంబంధించిన జ్వరాలు, జబ్బులు వస్తాయి. సాధారణంగా పొడి వాతావరణంలో వైరస్‌ల వ్యాప్తి తక్కువగా ఉంటుంది. కారణం వైరస్ బలహీనంగా ఉండి వాతావరణంలో కిందిభాగాన ఉంటుంది. ఎక్కువ దూరం ప్రయాణించలేదు. అంతే కాకుండా ఎవరైనా వైరల్ ఇన్ఫెక్షన్ ఉన్న రోగి తుమ్మినప్పుడు లేదా దగ్గినప్పుడు అతని నోటి తుంపర్ల నుంచి బయటికి వచ్చిన వైరస్ అక్కడికక్కడే కిందపడిపోతుంది. అదే వాతావరణం తేమగా ఉన్నప్పుడయితే వైరస్ వ్యాప్తి ఎక్కువగా ఉంటుంది. ఇన్ఫెక్టెడ్ రోగి తుమ్మినప్పుడు, దగ్గినప్పుడు నోటి తుంపర్ల నుంచి వైరస్ ఎక్కువ దూరం వ్యాప్తి చెందుతుంది. దీంతో ఒకరినుంచి మరొకరికి సులభంగా వైరస్ సోకుతుంది. కాబట్టి, ఒక ఇంట్లో ఎవరికైనా వైరల్ ఫీవర్ వచ్చిందంటే వెంటవెంటనే ఒకరి నుంచి ఒకరికి సోకుతుంది. అక్కడితో ఆగకుండా ఇరుగు పొరుగు ఇండ్లవారికి కూడా వ్యాపిస్తుంది. అలా వానకాలంలో ఇన్‌ఫ్లూయెంజా ప్రభావం అధికంగా ఉంటుంది.

ఇదో అంటువ్యాధి

ప్రస్తుతం రాష్ట్రంలో సీజనల్ కేసులు ఎక్కువగా నమోదవుతున్నాయి. అందులో డెంగీ, చికున్‌గున్యా, ఇన్‌ఫ్లూయెంజా తదితర జ్వరాల కేసులే అధికంగా ఉంటున్నాయి. ఇకపోతే సాధారణంగా సీజనల్ వ్యాధులు అంత ప్రమాదకరమైనవేమీ కాదు. కానీ సకాలంలో చికిత్స తీసుకోకుండా నిర్లక్ష్యం చేయకూడదు. రిస్క్ ఎక్కువగా ఉన్నవాళ్లకు తీవ్రమైన ఇన్‌ఫ్లూయెంజా ప్రాణాంతకంగా మారే ప్రమాదం ఉంది. ఇన్‌ఫ్లూయెంజా అనేది కరోనా తరహా అంటువ్యాధి. ఒకరి నుంచి మరొకరికి వ్యాపిస్తుంది. ఫ్లూ ఉన్నవారు తుమ్మినా, దగ్గినా లేదా వారి నోటి తుంపర్ల ద్వారా ఇతరులకు వ్యాపిస్తుంది. ఇంట్లో ఒకరికి వస్తే దాదాపు అందరినీ చుట్టేస్తుంది. ఇన్‌ఫ్లూయెంజాలో 4 రకాలు ఉన్నాయి. అవి...



ఈ జాగ్రత్తలు తప్పనిసరి

- సీజనల్ వ్యాధుల్లో 90 శాతం వరకు జాగ్రత్తలతో తప్పించుకోవచ్చు.
- ముఖానికి మాస్క్ ధరించడం ద్వారా ఫ్లూ నుంచి రక్షణ పొందవచ్చు.
- చేతులను తరచుగా శుభ్రంగా కడుక్కుంటూ ఉండాలి.
- ఫ్లూ రోగుల నుంచి వైరస్ సోకకుండా భౌతిక దూరం పాటించాలి.
- సాధ్యమైనంత వరకు చల్లటి పదార్థాలు తీసుకోకూడదు.
- ఎప్పటికప్పుడు వండిన వేడివేడి ఆహారమే తినాలి.
- ఊపిరితిత్తుల వ్యాధిగ్రస్తులు, ఆస్తమా, ఎలర్జిక్ వ్యాధులు ఉన్నవాళ్లు తెల్లవారుజామున, రాత్రి సమయాల్లో బయటికి వెళ్లకపోవడం మంచిది.
- పిల్లలు, వృద్ధులను సాధ్యమైనంత వరకు వెచ్చని వాతావరణంలో ఉండేలా చూడాలి.

ఎ- రకం ఇన్‌ఫ్లూయెంజా

ఇది వానకాలం, చలికాలంలో ఎక్కువగా ప్రభావం చూపుతుంది. ఈ ఫ్లూ సోకిన వారిలో జలుబు, జ్వరం, దగ్గు, ఒంటి నొప్పులు వంటి లక్షణాలు కనిపిస్తాయి.

బి- రకం ఇన్‌ఫ్లూయెంజా

ఇది కూడా చల్లటి వాతావరణంలో అంటే వానకాలం, చలికాలంలోనే ప్రభావం చూపుతుంది. దీని లక్షణాలు కూడా దాదాపు ఎ-రకం ఇన్‌ఫ్లూయెంజా లక్షణాలనే పోలి ఉంటాయి. సాధారణంగా వానకాలంలో ఎ, బి రకం ఫ్లూలే అధికంగా వస్తుంటాయి.

సి- రకం ఇన్‌ఫ్లూయెంజా

ఈ తరహా ఇన్‌ఫ్లూయెంజా చాలా అరుదుగా వస్తుంది. అయితే ఇది పెద్ద ప్రమాదకారి కాదు.

డి- రకం ఇన్‌ఫ్లూయెంజా

ఈ రకం జంతువులకు సోకుతుంది. మనుషులకు రాదు.

వీరికి ప్రమాదకరం

సాధారణంగా ఇన్‌ఫ్లూయెంజా అనేది ఎవరికైనా ఓ వారం పది రోజుల్లో తగ్గిపోతుంది. అయితే, రోగ నిరోధక శక్తి తక్కువగా ఉన్నవారిలో మాత్రం ఇది తీవ్ర ప్రభావం చూపే అవకాశాలు ఎక్కువ. ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధులు, గర్భిణులు, డయాబెటిస్, క్షయ (టీబీ), హెచ్‌ఐవీ, ఆస్తమా, ఊపిరితిత్తుల ఇన్ఫెక్షన్ తదితర దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు ఇన్‌ఫ్లూయెంజా ప్రమాదకరంగా మారడానికి ఆస్కారం ఉంది. లక్షణాలను బట్టి ఇచ్చే చికిత్స (సింప్టమాటిక్ ట్రీట్‌మెంట్)తోనే తగ్గిపోయినప్పటికీ సకాలంలో సరైన చికిత్స తీసుకోకపోతే వైరస్ గుండె, ఊపిరితిత్తులు, కిడ్నీలు వంటి అవయవాలపై ప్రభావం చూపే అవకాశం ఉంటుంది. ఫలితంగా ప్రధాన అవయవాలు దెబ్బతిని ప్రాణాంతకంగా మారే ప్రమాదం ఉంటుంది. అందుకని ఇన్‌ఫ్లూయెంజా లాంటి సీజనల్ జ్వరాలను నిర్లక్ష్యం చేయకుండా చికిత్స తీసుకోవడం శ్రేయస్కరం.

లక్షణాలు
- తీవ్రమైన జ్వరం (100–104 డిగ్రీల వరకు ఉండవచ్చు)
- దగ్గు, జలుబు
- ఒళ్లు నొప్పులు
- గొంతునొప్పి
- ఆయాసం

పిల్లలు, వృద్ధులకు న్యుమోనియా ముప్పు

ఇన్‌ఫ్లూయెంజా బారినపడ్డప్పుడు ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధులు, గర్భిణులు చాలా జాగ్రత్తగా ఉండాలి. దీని కారణంగా న్యుమోనియా దాడిచేసే ప్రమాదం ఉంటుంది. చిన్నారులు, వృద్ధుల్లో దీనివల్ల న్యుమోనియా వచ్చి ఊపిరితిత్తులు మొత్తం ఇన్‌ఫెక్ట్ అయిపోతాయి. దీంతో శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది ఏర్పడటమే కాకుండా సకాలంలో సరైన చికిత్స అందించకపోతే పరిస్థితి చేయిదాటిపోవచ్చు. ప్రతి పదిమంది ఇన్‌ఫ్లూయెంజా రోగుల్లో ఇద్దరు న్యుమోనియాకు గురవుతుంటారు. కాబట్టి ఇన్‌ఫ్లూయెంజాను తేలికగా తీసుకోకూడదు. లక్షణాలు కనిపించిన వెంటనే వైద్యులను సంప్రదించి తగిన చికిత్స తీసుకోవాలి. ఇన్‌ఫ్లూయెంజా నిర్ధారణకు త్రోట్ స్వాబ్ పరీక్ష చేస్తారు. దీని ద్వారా సోకింది ఏ రకం వైరస్ అనేది కూడా గుర్తించవచ్చు.

...మహేశ్వర్‌రావు బండారి



డాక్టర్ పరంజ్యోతి
పల్మనాలజీ విభాగ అధిపతి
నిజాం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్
హైదరాబాద్

వంటింటి స్పాంజ్‌తో బ్యాక్టీరియా ముప్పు

మనకు విరేచనాలు, జ్వరం లాంటివి తలెత్తినప్పుడు సాధారణంగా కలుషిత ఆహారం, కలుషిత నీటి వల్ల వచ్చిన రోగాలని పొరబడుతుంటాం. అంతేతప్ప వాటికి మూలం వంటింట్లో పాత్రల్ని కడిగే స్పాంజ్‌గా అనుమానించం. కానీ, స్పాంజ్ మన ఆరోగ్యానికి హాని కలిగించే వివిధ రకాలైన బ్యాక్టీరియాకు నెలవని ఓ అధ్యయనం వెల్లడించింది. కాబట్టి స్పాంజ్‌ను ఎలా వాడాలో తెలుసుకుని ఉండాలి.



వంటగదిలో ఉండే స్పాంజ్ టాయిలెట్ బౌల్ కంటే ఎక్కువ బ్యాక్టీరియాకు ఆశ్రయంగా ఉంటుందట. అంటే టాయిలెట్ కంటే సూక్ష్మక్రిములతో నిండిపోయిన స్పాంజ్ మన ఆరోగ్యానికి ఎక్కువ హాని కలిగిస్తుందన్నమాట. అంకెల్లో చెప్పడం కష్టమే కానీ, మనం వాడే స్పాంజ్ మీద ఒక్క ఘనపు సెంటీమీటర్‌కు 54 బిలియన్ల బ్యాక్టీరియా ఉంటుందట. అలా మనం పాత్రల్ని కడిగే ప్రతిసారి స్పాంజ్ మనం వాడే వస్తువుల్ని కలుషితం చేస్తూనే ఉంటుంది. ఫుడ్ పాయిజనింగ్ ముప్పును పెంచుతూ ఉంటుంది. పైగా వంటగదిలో వాడే స్పాంజ్‌లు వాటి నిర్మాణం రీత్యా సహజంగానే సూక్ష్మజీవులు పెంపొందడానికి అనువుగా ఉంటాయని ఆ అధ్యయనం వెల్లడించింది.

కలుషితమైన స్పాంజ్ ఓ మోస్తరు గ్యాస్ట్రో ఎంటరైటిస్‌తోపాటు మెనింజైటిస్, న్యుమోనియా, తీవ్రమైన జ్వరాలు, రక్త విరేచనాలు, కిడ్నీ సమస్యలు, ప్రాణాంతకంగా పరిణమించే ఫుడ్ పాయిజనింగ్ లాంటి తీవ్రమైన రోగాలకు దారితీయొచ్చు. మనం వండుకునే పదార్థాలను బట్టి స్పాంజ్‌ల మీద కాంపిబ్యాక్టర్, ఎంటరోబ్యాక్టర్ క్లోసే, ఈ.కొలి, క్లెబ్సియెల్లా, మొరాగ్జెల్లా ఓస్లోయెన్సిస్, సాల్మొనెల్లా, స్టెఫలోకోకస్, ఎసినెటోబ్యాక్టర్ తదితర బ్యాక్టీరియాలు పేరుకుపోతాయి.

ఏం చేయాలి?

బ్యాక్టీరియా ముప్పు తగ్గించుకోవాలంటే ఒకే స్పాంజ్‌తో వివిధ రకాలైన పాత్రలను కడగకూడదు. వేర్వేరు వాటిని ఎంచుకోవాలి. అంతేకాకుండా స్పాంజ్‌ను నిల్వ నీటిలో అలానే ఉంచేయకూడదు. బ్యాక్టీరియా, ఇతర సూక్ష్మక్రిముల బెడద తగ్గించుకోవడానికి మైక్రోవేవ్‌లో రెండు నిమిషాల పాటు ఉంచాలి. దీంతో దాదాపు 99.9 శాతం బ్యాక్టీరియా నశించిపోతుంది. ఇక పాత్రలు కడిగేటప్పుడు చేతులకు డిష్ గ్లవుజులు వేసుకుంటే మంచిది. పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టిక్ స్పాంజ్‌లను వాడకూడదు. సెల్యులోజ్ ఆధారిత స్పాంజ్‌లను ఉపయోగించాలి. స్పాంజ్‌లు వద్దనుకుంటే స్క్రబ్ బ్రష్‌లు, సిలికాన్ బ్రష్‌లు, వేడినీటిలో ముంచి పాత్రల్ని కడగడం, వంటపాత్రల్ని తుడిచేందుకు, కడిగేందుకు వాడే డిష్ ర్యాగ్స్‌ను (బట్టలు) తరచుగా లాండ్రీకి ఇవ్వడం లాంటివి మంచి ప్రత్యామ్నాయాలుగా నిలుస్తాయి.

సిద్ధ ఔషధ మిశ్రమంతో రక్తహీనతకు చెక్



సిద్ధ విధానంలో తయారుచేసిన ఓ ఔషధ మిశ్రమం కౌమార వయసు అమ్మాయిల్లో రక్తహీనతను (ఎనీమియా) తగ్గిస్తుందని తాజా అధ్యయనం ఒకటి వెల్లడించింది. అన్నపేటిసెంటురం, బావన కటుక్కాయ్, మాతులై మాణప్పుకు, నెల్లికాయ్ లేకియం (ఎబీఎంఎన్) అనే ఔషధ మిశ్రమం రక్తహీనతతో బాధపడుతున్న కౌమార బాలికల్లో హిమోగ్లోబిన్ స్థాయులు పెరిగేలా చేయగలదని ఆ అధ్యయనం తెలిపింది. ఈ మిశ్రమం ఎనీమియాకు సంబంధించిన లక్షణాలైన అలసట, జుట్టు రాలడం, తలనొప్పి, నిరాసక్తిగా ఉండటం, నెలసరి సమస్యలను గణనీయంగా తగ్గించిందని, హిమోగ్లోబిన్ స్థాయులను, రక్తానికి సంబంధించిన ఇతర గుణాలను మెరుగుపర్చిందని ఆ అధ్యయనం పేర్కొన్నది. కాబట్టి రక్తహీనత గురించి కౌమార వయసు అమ్మాయిల్లో అవగాహన పెంచడంతోపాటు పోషకాహారం, సమస్య నివారణ చర్యలు తీసుకోవడంతోబాటు సిద్ధ ఔషధాల చికిత్స ప్రయోజనం గురించి కూడా తెలియజేయాలని సిద్ధ విధాన వైద్యులు సూచిస్తున్నారు. ఈ అధ్యయనాన్ని 2,648 మంది అమ్మాయిల మీద నిర్వహించారు. వీరిలో 2,300 మంది 45 రోజుల కోర్సు పూర్తిచేయడం గమనార్హం.

గుకేశే టైటిల్ ఫేవరేట్-డింగ్ లిరెన్

బుడాపెస్ట్: ఈ ఏడాది నవంబర్‌లో సింగపూర్ వేదికగా జరగాల్సి ఉన్న వరల్డ్ చెస్ చాంపియన్‌షిప్ మ్యాచ్‌లో భారత యువ గ్రాండ్‌మాస్టర్ దొమ్మరాజు గుకేశే ఫేవరేట్ అని డిఫెండింగ్ చాంపియన్ డింగ్ లిరెన్ (చైనా) వ్యాఖ్యానించాడు. బుడాపెస్ట్ వేదికగా జరుగుతున్న 45వ చెస్ ఒలింపియాడ్ సందర్భంగా లిరెన్ మాట్లాడుతూ.. 'ఈ టోర్నీలో గుకేశ్ చాలా బాగా ఆడుతున్నాడు. త్వరలో జరగనున్న వరల్డ్ చెస్ చాంపియన్‌షిప్ మ్యాచ్‌లోనూ అతడే ఫేవరేట్. ప్రస్తుతం అతడు నాకంటే ఎక్కువ రేటింగ్ పాయింట్లు కలిగి ఉన్నాడు. గత ఏడాది కాలంగా నేను ఆశించిన స్థాయిలో రాణించలేకపోతున్నా. కానీ రేటింగ్ వ్యత్యాసాన్ని తగ్గించేందుకు నేను శ్రమిస్తా' అని అన్నాడు.

అర్జున్ ఆరో గెలుపు

ప్రతిష్ఠాత్మక చెస్ ఒలింపియాడ్‌లో భారత యువ గ్రాండ్‌మాస్టర్ అర్జున్ ఇరిగేసి వరుస విజయాల జోరు కొనసాగుతున్నది. అర్జున్ వరుసగా ఆరో విజయంతో సోమవారం జరిగిన పోరులో భారత్ 3-1తో రష్యాను ఓడించింది. టోర్నీలో ఇప్పటి వరకు ఓటమి ఎరుగని అర్జున్..సుగిరోవ్ సనాన్‌పై అద్భుత విజయం సాధించాడు. మహిళల విభాగంలో భారత్ 2.5-1.5తో అర్మేనియాపై గెలిచింది.

గ్లాస్గోలో కామన్వెల్త్ గేమ్స్?

లండన్: 2026లో జరుగనున్న కామన్వెల్త్ క్రీడలకు స్కాట్లాండ్ రాజధాని గ్లాస్గో ఆతిథ్యమివ్వనున్నట్టు సమాచారం. వాస్తవానికి వచ్చే ఎడిషన్ గేమ్స్‌కు విక్టోరియా(ఆస్ట్రేలియా) ఆతిథ్యమివ్వాల్సి ఉండగా వ్యయభారం కారణంగా ఆ నగరం తాము రేసు నుంచి వైదొలుగుతున్నామని గతేడాదే ప్రకటించింది. గ్లాస్గో ఇదివరకే 2014 లో ఈ క్రీడలను నిర్వహించింది.

హర్మన్‌ప్రీత్‌సింగ్ కెప్టెన్సీ షో

ఫైనల్‌కు భారత్

సెమీస్‌లో దక్షిణ కొరియాపై ఘన విజయం • తుదిపోరులో చైనాతో అమీతుమీ • పాక్‌కు చైనా షాక్

ఏషియన్ చాంపియన్స్ ట్రోఫీలో డిఫెండింగ్ చాంపియన్‌గా బరిలోకి దిగిన భారత జట్టు జైత్రయాత్ర అప్రతిహతంగా కొనసాగుతోంది. ఇప్పటిదాకా టోర్నీలో ఓటమన్నదే లేకుండా సెమీస్ చేరిన హర్మన్‌ప్రీత్ సింగ్ సేన.. సోమవారం జరిగిన రెండో సెమీస్‌లో దక్షిణ కొరియాను చిత్తుచేసి వరుసగా రెండోసారి, ఈ టోర్నీలో ఆరోసారి ఫైనల్ చేరింది. భారత హాకీ అభిమానులు ముద్దుగా పిలుచుకునే 'సర్పంచ్ సాబ్' (కెప్టెన్ హర్మన్‌ప్రీత్) రెండు గోల్స్‌తో అదరగొట్టగా ఉత్తమ్ సింగ్, జర్మన్‌ప్రీత్ సింగ్ తలా ఓ గోల్ కొట్టారు. ఈ విజయంతో భారత్ మంగళవారం జరిగే ఫైనల్‌లో ఆతిథ్య చైనాతో అమీతుమీ తేల్చుకోనుంది. తొలి సెమీస్‌లో చైనా.. మాజీ చాంపియన్ పాకిస్థాన్‌ను ఓడించి ఈ టోర్నీలో తొలిసారి ఫైనల్ చేరింది.





హులన్‌బుయిర్ (చైనా): భారత హాకీ జట్టు మరోసారి అద్భుత ప్రదర్శనతో ఏషియన్ చాంపియన్స్ ట్రోఫీ ఫైనల్‌లోకి ప్రవేశించింది. సోమవారం హులన్‌బుయిర్ వేదికగా జరిగిన రెండో సెమీస్‌లో భారత్.. 4-1తో దక్షిణ కొరియాను ఓడించి వరుసగా రెండోసారి ఫైనల్స్‌కు దూసుకెళ్లింది. ఈ టోర్నీలో ఓటమన్నదే లేకుండా సాగుతున్న 'మెన్ ఇన్ బ్లూ'.. సెమీస్‌లో అదే దూకుడుతో ఆడింది. ఇది వరకే లీగ్ దశలో దక్షిణ కొరియాను చిత్తుచేసిన మన కుర్రాళ్లు సెమీస్‌లోనూ అదే ఫలితాన్ని పునరావృతం చేశారు. భారత్ తరఫున ఉత్తమ్ సింగ్ (13వ నిమిషంలో), జర్మన్‌ప్రీత్ సింగ్ (32) తలా ఓ గోల్ చేయగా సారథి హర్మన్‌ప్రీత్ సింగ్ (19, 45) రెండు పెనాల్టీ కార్నర్‌లను గోల్స్‌గా మలిచి తిరుగులేని ఆధిక్యాన్ని అందించాడు. ప్రత్యర్థి జట్టు తరఫున యంగ్ జిహున్ (33) ఒక్కడే గోల్ కొట్టగలిగాడు.

ఆది నుంచే దూకుడు..

ఆట ఆరంభం అయిన కొద్దిసేపటికే తొలి క్వార్టర్ 13వ నిమిషంలోనే అరిజీత్ సింగ్ అందించిన బంతిని నేరుగా గోల్ పోస్ట్‌లోకి పంపి భారత్‌కు తొలి గోల్ అందించాడు. తొలి క్వార్టర్ ముగిసిన వెంటనే కొరియాకు రెండు పెనాల్టీ కార్నర్ అవకాశాలు వచ్చినా వాటిని వినియోగించుకోవడంలో ఆ జట్టు సఫలీకృతం కాలేదు. కానీ 19వ నిమిషంలో భారత్‌కు వచ్చిన అవకాశాన్ని మాత్రం సర్పంచ్ సాబ్ వృథా చేయలేదు. ఆట అర్ధ భాగం ముగిసేసరికి 2-0 ఆధిక్యంలో ఉన్న భారత్.. తర్వాత కూడా అదే జోరును కొనసాగించింది. 32వ నిమిషంలో ఔట్ సైడ్ సర్కిల్ నుంచి బంతిని తన అధీనంలో ఉంచుకుంటూ జర్మన్‌ప్రీత్ సూపర్ గోల్ కొట్టాడు. కానీ ఆ మరుసటి నిమిషానికే వచ్చిన పెనాల్టీ కార్నర్‌ను జిహున్ గోల్‌గా మలవడంతో కొరియా బోణీ కొట్టింది. 45వ నిమిషంలో హర్మన్‌ప్రీత్ మరో పెనాల్టీ కార్నర్ గోల్ సాధించాడు. ఈ టోర్నీలో అతడికి ఇది 7వ గోల్. ప్రత్యర్థి గోల్ పోస్ట్‌పైకి దండెత్తడంతో పాటు కొరియన్ల గోల్ ప్రయత్నాలను అడ్డుకోవడంలో మన డిఫెన్స్ శ్రేణి విజయవంతమైంది.

పాక్‌కు షాక్..

తొలి సెమీస్‌లో చైనా.. మాజీ చాంపియన్ పాకిస్థాన్‌కు ఊహించని షాకిచ్చింది. ఆట నిర్దేశిత సమయంలో ఇరు జట్లూ తలా ఓ గోల్ (1-1)తో సమానంగా నిలువడంతో మ్యాచ్ పెనాల్టీ షూటౌట్‌కు దారితీసింది. షూటౌట్‌లో చైనా 2-0తో గెలిచి ఈ టోర్నీలో తొలిసారి ఫైనల్స్‌కు అర్హత సాధించింది.



కుస్తీ వీరుల రెజ్లింగ్ లీగ్

సాక్షి, అమన్, గీత ఆధ్వర్యంలో చాంపియన్‌షిప్

తమకు సంబంధం లేదన్న డబ్ల్యూఎఫ్ఐ

ఢిల్లీ: ఒలింపిక్స్‌లో భారత్‌కు పతకాలు అందించిన సాక్షి మాలిక్ (రియో), అమన్ సెహ్రావత్ (పారిస్)తో పాటు మాజీ వరల్డ్ చాంపియన్‌షిప్ కాంస్య పతక విజేత గీతా ఫోగాట్ (వినేశ్ ఫోగాట్ సోదరి) కలిసి కొత్త రెజ్లింగ్ చాంపియన్‌షిప్ లీగ్‌ను ప్రారంభించనున్నారు. ఈ మేరకు సోమవారం సోషల్ మీడియా ద్వారా ఈ విషయాన్ని వెల్లడించారు. యువ, వర్ధమాన రెజ్లర్లను ప్రోత్సహించేందుకు గాను తాము ముగ్గురం కలిసి రెజ్లింగ్ చాంపియన్స్ సూపర్ లీగ్ (డబ్ల్యూసీఎస్ఎల్)ను ప్రారంభించనున్నట్టు వారు తెలిపారు. ఈ సందర్భంగా గీత మాట్లాడుతూ.. 'సాక్షి, నేను చాలాకాలంగా ఈ లీగ్‌ను ప్రారంభించాలని అనుకుంటున్నాం. త్వరలోనే ఇది తుది రూపును సంతరించుకోనుంది. భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఐ)తో మేం ఇప్పటిదాకా అయితే సంప్రదింపులు జరుపలేదు. కానీ మాకు ప్రభుత్వంతో పాటు సమాఖ్య మద్దతు కావాలి. క్రీడాకారులే నిర్వహించబోతున్న తొలి లీగ్ మాదే కాబోతుంది. దీనిని మేం పూర్తిగా యువ రెజ్లర్ల కోసం ప్రారంభించబోతున్నాం. ఇందులోకి ఎవరైనా రావొచ్చు. మేం ఎవరినీ వద్దనం. రెజ్లర్లు కూడా ఎవరి బలవంతం లేకుండా ఈ లీగ్‌లో పాల్గొనవచ్చు' అని తెలిపింది. అయితే దీనిపై డబ్ల్యూఎఫ్ఐ చీఫ్ సంజయ్ సింగ్ స్పందిస్తూ.. 'మేం దానిని ఆమోదించబోం. మేము మా రెజ్లింగ్ లీగ్‌ను పునరుద్ధరించే పనిలో ఉన్నాం. రెజ్లర్లు తమ సొంత లీగ్‌ను నిర్వహించుకునేందుకు మాకు ఎలాంటి అభ్యంతరమూ లేదు. వాళ్లు ఆటను ప్రమోట్ చేసుకోవచ్చు. కానీ దానితో మాకు సంబంధమూ లేదు' అని తెలపడం గమనార్హం.

ప్రాక్టీస్..ప్రాక్టీస్

చెమటోడ్చిన టీమ్ఇండియా క్రికెటర్లు



చెన్నై: బంగ్లాదేశ్‌తో తొలి టెస్టు కోసం భారత క్రికెటర్లు ప్రాక్టీస్‌లో మునిగిపోయారు. చెన్నై చిదంబరం స్టేడియం వేదికగా ఈనెల 19 నుంచి ఇరు జట్ల మధ్య తొలి టెస్టుకు తెరలేవనుంది. ఇందుకోసం సోమవారం టీమ్ఇండియా క్రికెటర్లు నెట్స్‌లో తీవ్రంగా చెమటోడ్చారు. తొలుత యశస్వి జైస్వాల్, విరాట్ కోహ్లీ..బుమ్రా, అశ్విన్ బౌలింగ్‌లో బ్యాటింగ్ ప్రాక్టీస్ చేశారు. ఆ తర్వాత కెప్టెన్ రోహిత్‌శర్మ, శుభ్‌మన్ గిల్, సర్ఫరాజ్ వీరిని అనుసరించారు. జడేజా, పంత్, సిరాజ్‌కు లోకల్ బౌలర్లు బౌలింగ్ చేశారు. ఇటీవల పాకిస్థాన్‌తో జరిగిన టెస్టు సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేసి జోరుమీదున్న బంగ్లా జట్టును భారత్ సీరియస్‌గా తీసుకుంటున్నది. కొత్తగా ఎర్రమట్టితో తయారుచేసిన పిచ్‌పై ప్రత్యర్థికి సవాల్ విసరనుంది. చెన్నై పిచ్ సాధారణంగా స్పిన్‌కు అనుకూలించనున్న నేపథ్యంలో ముగ్గురు స్పిన్నర్లు, ఇద్దరు పేసర్లతో బరిలోకి దిగనుంది. ఇదిలా ఉంటే టీమ్ఇండియా క్రికెటర్లు గ్రూపులుగా విడిపోయి దిలీప్ ఆధ్వర్యంలో ఫీల్డింగ్ ప్రాక్టీస్ చేశారు. పాక్‌పై సిరీస్ విజయంతో ఆత్మవిశ్వాసంతో ఉన్న బంగ్లా..భారత్‌కు పోటీనివ్వాలని చూస్తున్నది. బంగ్లా క్రికెటర్లు సోమవారం ప్రాక్టీస్ సెషన్‌లో పాల్గొన్నారు.

భార్యపై హత్యాయత్నం

జింబాబ్వే మాజీ క్రికెటర్ అరెస్ట్



మసకంద

హరారే: కట్టుకున్న భార్యపై హత్యాయత్నానికి పాల్పడ్డందుకు గాను జింబాబ్వే మాజీ క్రికెటర్ తరిసాయ్ మసకందను పోలీసులు అరెస్టు చేశారు. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. రెండ్రోజుల క్రితం మసకంద భార్య టినో డివనషె మకునికెపై హత్యాయత్నానికి పాల్పడ్డాడు. డబ్బుల వ్యవహారంలో తలెత్తిన ఓ గొడవలో ఇద్దరి మధ్య మాటామాటా పెరగడంతో అతడు వంటగదిలో ఉండే కత్తితో ఆమెపై దాడికి దిగాడు. ఈ ఘటనలో ఆమె చేతులు, వీపు భాగంలో తీవ్ర గాయాలైనట్టు స్థానిక పోలీసులు తెలిపారు. మసకంద జింబాబ్వే తరఫున 5 టెస్టులు, 16 వన్డేలు, 12 టీ20లు ఆడాడు.

బంగ్లా సిరీస్ రద్దు చేయండి


బీసీసీఐకి హిందూ జాగరణ సమితి డిమాండ్



ముంబై: స్వదేశంలో బంగ్లాదేశ్‌తో జరిగే క్రికెట్ సిరీస్‌ను వెంటనే రద్దు చేయాలని హిందూ జాగరణ సమితి..బీసీసీఐని డిమాండ్ చేసింది. బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులకు నిరసనగా బీసీసీఐ నిర్ణయం తీసుకోవాలని కోరింది. ఈ మేరకు సోమవారం హిందూ జాగరణ సమితి ప్రతినిధులు..బోర్డు స్పెషల్ ఎగ్జిక్యూటివ్ అధికారికి ఫిర్యాదు చేశారు. ఈ కాపీని ప్రధాని నరేంద్రమోదీతో పాటు విదేశాంగ మంత్రి జైశంకర్‌కు కూడా పంపిస్తామని ప్రతినిధులు పేర్కొన్నారు. భారత పర్యటనలో బంగ్లా టీమ్ రెండు టెస్టులు, మూడు టీ20 మ్యాచ్‌లు ఆడనుంది. మాజీ ప్రధాని షేక్ హసీన రాజీనామా తర్వాత బంగ్లాలో హిందువులపై ఊచకోత కొనసాగుతున్నది. మైనార్టీ హిందువులపై అమానుష రీతిలో దాడులు చేస్తూ ప్రాణాలు తీస్తున్న సంగతి తెలిసిందే. దీనికి నిరసనగా హిందూ జాగరణ సమితి నేతలు బీసీసీఐ వైఖరిని తప్పుబడుతున్నారు.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.

ఆర్‌సీ 16 లోడింగ్




అగ్ర హీరో రామ్‌చరణ్ తన 16వ సినిమా కోసం కసరత్తులు ఆరంభించారు. బుచ్చిబాబు సానా దర్శకత్వంలో మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్ సంస్థలు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్న విషయం తెలిసిందే. త్వరలో రెగ్యులర్ షూటింగ్‌ను మొదలుపెట్టబోతున్నారు. గ్రామీణ క్రీడా నేపథ్యంలో పవర్‌ఫుల్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రాన్ని తెరకెక్కించబోతున్నారు. ఈ సినిమా కోసం రామ్‌చరణ్ సరికొత్త మేకోవర్‌తో సిద్ధమవుతున్నారు. శారీరకంగా మరింత దృఢంగా కనిపించేందుకు ప్రత్యేకంగా శిక్షణ తీసుకుంటున్నాడు. ఈ సినిమాలో ఆయన స్పోర్ట్స్ కోచ్‌గా కనిపిస్తాడని, పాత్రకు అనుగుణంగా సూపర్‌ఫిట్‌గా కనిపిస్తాడని చెబుతున్నారు. ఈ సందర్భంగా ఫిట్‌నెస్ ట్రైనర్స్‌తో కలిసి శిక్షణ తీసుకుంటున్న ఓ ఫొటోను రామ్‌చరణ్ తన సోషల్‌మీడియాలో షేర్ చేశారు. 'ఆర్‌సీ16 లోడింగ్' అంటూ ఆ ఫొటోకు క్యాప్షన్‌ను జత చేశారు. దీంతో ఈ సినిమాలో రామ్‌చరణ్ మేకోవర్ ఎలా ఉంటుందో, ఆయన ఎలాంటి లుక్స్‌తో కనిపిస్తాడోనని అభిమానుల్లో ఆసక్తి పెరిగింది. రామ్‌చరణ్ తాజా చిత్రం 'గేమ్ చేంజర్' డిసెంబర్‌లో విడుదలకు సిద్ధమవుతున్నది.

'ధూమ్-4'లో విలన్‌గా?



'ధూమ్' ఫ్రాంచైజీకి ప్రత్యేకంగా అభిమానులున్నారు. మరుగున పడిన మల్టీస్టారర్ ట్రెండ్‌కి మళ్లీ ఊతాన్నిచ్చిన ఫ్రాంచైజీగా 'ధూమ్'ని చెప్పుకోవాలి. 'ధూమ్' తొలి పార్ట్‌లో అభిషేక్ బచ్చన్, జాన్ అబ్రహం నటించగా, 'ధూమ్ 2'లో అభిషేక్ బచ్చన్, హృతిక్‌రోషన్ తలపడ్డారు. ఇక 'ధూమ్ 3' విషయానికొస్తే.. ఏసీపీ దీక్షిత్‌గా అభిషేక్ సేమ్ కేరక్టర్‌ని ప్లే చేయగా, కరుడుగట్టిన దొంగలైన సహీర్‌ఖాన్, సమర్‌ఖాన్‌గా మిస్టర్ పర్‌ఫెక్ట్ ఆమిర్‌ఖాన్ ద్విపాత్రాభినయం చేసి బాలీవుడ్ రికార్డులన్నింటినీ కొల్లగొట్టారు. భారీ ఎత్తులో రాబరీలకు తెగబడుతూ దేశ సంపదను కొల్లగొడుతున్న కరుడుగట్టిన దొంగని క్రైమ్ బ్రాంచ్ ఏసీపీ దీక్షిత్ ఎలా పట్టుకున్నాడు? అనేదే మూడు సినిమాల్లో కథ. ఈ ఫ్రాంచైజీలో ప్రతి సినిమా ఒకదాన్ని మించి ఒకటి ఉండటానికి కారణం దర్శకుడు ఆదిత్య చోప్రా కథనం. భారీ నిర్మాణ విలువలు. ఇదిలావుంటే.. ఈ ఫ్రాంచైజీలోనే త్వరలో 'ధూమ్-4' పట్టాలెక్కనున్నదట. చిత్ర నిర్మాణసంస్థ యశ్‌రాజ్ ఫిల్మ్స్ ఈ మేరకు సన్నాహాలు చేస్తున్నట్టు వార్తలు వస్తున్నాయి. మొదటి మూడు పార్టులకు కథలను అందించిన ఆదిత్య చోప్రానే 'ధూమ్-4'కు కూడా వర్క్ చేస్తున్నారని, మారిన ట్రెండ్‌కు అనుగుణంగా భారీ స్థాయిలో ఈ సినిమాను నిర్మించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయని సమాచారం. ఈ ఫ్రాంచైజీలో నెగటీవ్ రోల్సే హైలైట్. తొలిభాగంలో జాన్ అబ్రహం, రెండో భాగంలో హృతిక్‌రోషన్, మూడో భాగంలో ఆమిర్‌ఖాన్ ఈ రోల్స్ అదరగొట్టారు. ఇప్పుడు 'ధూమ్-4'లో ఈ నెగిటీవ్ రోల్‌ని కోలీవుడ్ నటుడు సూర్య పోషిస్తారని బీటౌన్‌లో బలంగా వినిపిస్తున్నది. ఈ విషయంపై చిత్రబృందం ఇప్పటికే ఆయన్ని సంప్రదించినట్టు వార్తలు వస్తున్నాయి. సూర్య కూడా ఆ పాత్ర పోషించేందుకు ఆసక్తి చూపించారట. సూర్య నెగటీవ్ రోల్స్ చేస్తే ఎలా ఉంటుండో 24, విక్రమ్ సినిమాలు చెప్పేశాయి. ఇక 'ధూమ్-4'లో ఆయన చేస్తే ఎలా ఉంటుందో ప్రత్యేకించి చెప్పాల్సిన పనిలేదు. ఈ పరిణామంపై సినీప్రియులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. యష్ రాజ్ సంస్థ నుంచి త్వరలోనే అధికారిక ప్రకటన వస్తుందని సమాచారం.



మన బంధం శాశ్వతం

సినీ తారలు సిద్ధార్థ్, అదితిరావు హైదరీ వివాహబంధంలోకి అడుగుపెట్టారు. వనపర్తి జిల్లా శ్రీరంగాపురంలోని రంగనాథస్వామి ఆలయంలో సోమవారం ఈ జంట వివాహం నిరాడంబరంగా జరిగింది. ఇరు కుటుంబాలకు చెందిన పెద్దలు, సన్నిహితుల సమక్షంలో సిద్ధార్థ్, అదితిరావు హైదరీ పెళ్లిపీటలెక్కారు. పెళ్లికి సంబంధించిన ఫొటోలను అదితిరావు హైదరీ తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో పంచుకుంది. 'నువ్వే నా సూర్యుడివి, చంద్రుడివి.. నువ్వే నా తారాలోకం.. మన ప్రేమబంధం శాశ్వతంగా నిలిచిపోయి నవ్యకాంతుల్ని వర్షిస్తుంది. మిసెస్ అండ్ మిస్టర్ అదు-సిద్ధు' అంటూ ఫొటోలకు క్యాప్షన్‌ను జతచేసింది. ప్రస్తుతం ఈ ఫొటోలు సోషల్‌మీడియాలో వైరల్‌గా మారాయి. పలువురు సినీ తారలతో పాటు అభిమానులు నూతన జంటకు శుభాకాంక్షలందజేశారు. ఈ ఏడాది మార్చిలో సిద్ధార్థ్, అదితిరావు హైదరీ నిశ్చితార్థం జరుపుకున్నారు. 'మహా సముద్రం' సినిమా షూటింగ్ సమయంలో వీరిద్దరి మధ్య ఏర్పడిన పరిచయం క్రమంగా ప్రేమగా మారింది. అదితిరావు హైదరీ తల్లిదండ్రులిద్దరూ రాజకుటుంబాలకు చెందిన వారు. అదితిరావు తల్లి విద్యారావు వనపర్తి సంస్థానానికి చెందిన జానంపల్లి రామేశ్వరరావు కుమార్తె. దాంతో వనపర్తి సంస్థానానికి వారసురాలిగా అదితిరావుకు గుర్తింపు ఉంది. అలాగే వనపర్తి జిల్లా రంగనాథ స్వామి ఆలయంతో అదితిరావు కుటుంబానికి ఎంతో అనుబంధం ఉంది. తమ కుటుంబంలో ఎలాంటి శుభకార్యాన్నైనా ఆ ఆలయంలోనే నిర్వహిస్తామని అదితిరావు హైదరీ పలు సందర్భాల్లో చెప్పింది. తన కుటుంబ మూలాలు, వారసత్వాన్ని గౌరవిస్తూ వివాహాన్ని కూడా అదే ఆలయంలో జరుపుకుంది.



మనిషి ఆకలి.. గొర్రె ఆత్మరక్షణ

సుహాస్ హీరోగా రూపొందిన చిత్రం 'గొర్రె పురాణం'. బాబీ దర్శకుడు. ప్రవీణ్‌రెడ్డి నిర్మాత. ఈ నెల 20న ఈ చిత్రం విడుదల కానుంది. ప్రమోషన్‌లో భాగంగా ఈ సినిమా ట్రైలర్‌ని సోమవారం మేకర్స్ విడుదల చేశారు. 'నాపేరు రామ్.. అలియాస్ యేసు. గొర్రె జైల్లో వుండటం ఏందీ.. ఆడికెళ్లి తప్పించుకోవడం ఏందీ?.. ఇదంతా మీకు వింతగా వుంది కదా..' అనే వాయిస్ ఓవర్‌తో ట్రైలర్ మొదలైంది. ఒక గొర్రె గ్రామంలోని రెండు మతాలమధ్య చిచ్చుపెట్టిన నేపథ్యాన్ని ట్రైలర్‌లో ఆవిష్కరించారు. గొర్రె వల్ల జరిగిన పరిణామాలు సినిమాలో ఆసక్తికరంగా ఉంటాయని మేకర్స్ చెబుతున్నారు. ట్రైలర్‌లో సుహాస్ ఖైదీగా కనిపించారు. 'మనం బతకటం కోసం వాటిని చంపేయొచ్చు.. మనది ఆకలి. మరి అవి బతకడం కోసం మనల్ని చంపేస్తే.. అది ఆత్మ రక్షణే కదా..' అని సుహాస్ చెప్పిన డైలాగ్ ఆలోచన రేకెత్తించేలా ఉంది. పోసాని కృష్ణమురళి, రఘు కీలక పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: సురేష్ సారంగం, సంగీతం: పవన్ సీహెచ్.



ఆ బాధ అందరికీ ఉంది

అమితాబచ్చన్, తాప్సీ ప్రధాన పాత్రలు పోషించిన బాలీవుడ్ సెన్సేషన్ 'పింక్' సినిమా విడుదలై సెప్టెంబర్ 16కి సరిగ్గా ఎనిమిదేండ్లు. ఈ సందర్భంగా నాటి సంగతులను నటి తాప్సీ గుర్తు చేసుకున్నది. 'భారతీయ సినీ చరిత్రలోనే గొప్ప సినిమాల్లో 'పింక్' ఒకటిగా నిలుస్తుంది. ఆ సినిమా చేస్తున్నప్పుడు ఆ స్థాయిని మేం ఊహించలేదు. అలాంటి గొప్ప సినిమాలో భాగమైనందుకు ఇప్పటికీ గర్వంగా ఫీలవుతా. అయితే.. ఏ సమస్యను ప్రశ్నిస్తూ ఎనిమిదేండ్ల క్రితం ఆ సినిమా చేశామో.. ఆ సమస్య ఇప్పటికీ అలాగే ఉంది. ఇంకా మాట్లాడితే ఇంకా జటిలమైంది. స్త్రీలకు సమాజంలో ఏమాత్రం రక్షణ లేకుండా పోయింది. ఈ సినిమాలో నటించిన అందరికీ ఆ బాధ ఉంది.' అంటూ చెప్పుకొచ్చింది. 2016లో విడుదలైన 'పింక్' సినిమా భారీ వసూళ్లతో పాటు, ఎన్నో పురస్కారాలను కూడా చేజిక్కించుకున్నది. 'బెస్ట్ ఫిల్మ్ ఆన్ సోషల్ ఇష్యూస్' కేటగిరిలో జాతీయ పురస్కారాన్ని కూడా అందుకున్నది.



ఎం.ఎస్.సుబ్బులక్ష్మిగా విద్యాబాలన్?

భారతీయ సంగీత ప్రపంచ సామ్రాజ్ఞి ఎంఎస్ సుబ్బులక్ష్మి 108వ జయంతి సందర్భంగా బాలీవుడ్ నటి విద్యాబాలన్ ఆమెకు విభిన్నంగా నివాళులర్పించింది. ఎం.ఎస్.సుబ్బులక్ష్మి గెటప్ ధరించి, ఆ ఫొటోలను సోషల్‌మీడియాలో ఆమె పోస్ట్ చేయడంతో అవి ఓ రేంజ్‌లో వైరల్ అవుతున్నాయి. ఈ ఫొటోల్లో విద్యాబాలన్ అచ్చుగుద్దినట్టు ఎం.ఎస్.సుబ్బులక్ష్మిలా కనిపిస్తుండటం విశేషం. ఈ విధంగా ఆ లెజెండరీ సింగర్‌పై తనకున్న అభిమానాన్ని మరోసారి చాటుకున్నది విద్యాబాలన్. ఎం.ఎస్.సుబ్బులక్ష్మి అంటే తనకెంతో ఇష్టమని, ఆ దిగ్గజ గాయని పాత్రలో నటించాలనేది తన జీవిత కాంక్ష అని ఈ సందర్భంగా విద్యాబాలన్ పేర్కొన్నారు. ఇంకా చెబుతూ 'ఊహ తెలిసిన నాటి నుంచి పొద్దున్నే నిద్ర లేవగానే వేంకటేశ్వర సుప్రభాతం వినడం అలవాటు. ఆ సుప్రభాతంలో వినిపించే గొంతు ఎం.ఎస్.సుబ్బులక్ష్మిగారిదే. ఆమె ఓ ఆధ్యాత్మిక శక్తి. ఈ రోజు ఆమె పుట్టినరోజు. అందుకే ఈ నివాళి.' అన్నారు విద్యాబాలన్. ఇదిలావుంటే.. ఎం.ఎస్.సుబ్బులక్ష్మిలా ఉన్న విద్యాబాలన్ ఫొటోలు సోషల్ మీడియాలో వెలుగు చూడడంతో సుబ్బులక్ష్మి బయోపిక్ మరోసారి చర్చనీయాంశమైంది. ఎం.ఎస్.సుబ్బులక్ష్మి బయోపిక్‌లో విద్యాబాలన్ నటిస్తున్నట్టు గతంలో ఓసారి వార్తలు వచ్చాయి. ఆ తర్వాత కీర్తి సురేశ్ పేరు కూడా తెరపైకి వచ్చింది. మళ్లీ ఇప్పుడు విద్యాబాలన్ పేరు బలంగా వినిపిస్తుంది. అయితే.. అధికారిక ప్రకటన మాత్రం రాలేదు.



ఈ అభిమానం ఇలాగే ఉండాలి

విజయ్ 'గోట్' సినిమాలో ఓ ప్రత్యేక పాత్రలో కనిపించింది మీనాక్షి చౌదరి. సినిమా ఫలితం ఎలా వున్నా ఈ ముద్దుగుమ్మ అందచందాలకు మాత్రం మంచి మార్కులే పడ్డాయి. మెకానిక్ రాకీ, విశ్వంభర, లక్కీభాస్కర్, మట్కా.. ప్రస్తుతం మీనాక్షి చేతిలో ఉన్న సినిమాల లిస్ట్ ఇది. తెలుగులోనే కాక, ఇతర భాషల్లోనూ నిదానంగా బిజీ అవుతున్నది మీనాక్షి చౌదరి. ఓ పక్క సినిమాలతో బిజీగా ఉంటూ మరో పక్క తన ఇన్‌స్టాగ్రామ్‌లో కొత్త కొత్త పోజులతో ఫొటోలను పోస్ట్ చేస్తూ, యువతకు కనులవిందు చేస్తున్నది ఈ హర్యానా అందాల భామ. రీసెంట్‌గా వైట్ అవుట్‌ఫిట్‌తో ఉన్న ఫొటోలను తన ఇన్‌స్టాలో షేర్ చేసింది. ఈ ఫొటోల్లో సింపుల్‌గా కనిపించినా, ఆమె లుక్ దెబ్బకు అందరూ మంత్రముగ్ధులవుతున్నారు. అందుకు తగ్గట్టుగానే కామెంట్లు వస్తున్నాయి. దీనిపై మీనాక్షి స్పందిస్తూ 'అందంగా కనిపించడంలో నేనెంత నిజాయితీగా ఉంటానో.. ఆ అందాన్ని అభినందించడంలో నా అభిమానులు కూడా అంతే నిజాయితీగా ఉంటారు. ఈ అభిమానం ఇలాగే ఉండాలని ఆశిస్తున్నా' అని ఇన్‌స్టాలో షేర్ చేసింది మీనాక్షీ చౌదరి.

సైకలాజికల్ థ్రిల్లర్ 'కలి'



యువ హీరోలు ప్రిన్స్, ఆగస్త్య ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'కలి. శివ శేషు దర్శకుడు. రుద్ర క్రియేషన్స్ పతాకంపై లీలా గౌతమ్ వర్మ నిర్మిస్తున్నారు. సైకలాజికల్ థ్రిల్లర్‌గా తెరకెక్కిన ఈ చిత్రం అక్టోబర్ 4న ప్రేక్షకుల ముందుకురానుంది. దర్శకుడు చిత్ర విశేషాలు తెలియజేస్తూ 'కలి పాత్ర చుట్టూ అల్లుకున్న కథాంశమిది. ఆద్యంతం అనూహ్య మలుపులతో సాగుతుంది. థ్రిల్లింగ్, సస్పెన్స్ అంశాలతో ప్రేక్షకులకు ఉత్కంఠను పంచుతుంది. యాక్షన్ ఘట్టాలు ప్రధానాకర్షణగా నిలుస్తాయి' అన్నారు. నేహా కృష్ణన్, గౌతంరాజు, గుండు సుదర్శన్, కేదార్ శంకర్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: నిశాంత్ కటారి, రమణ జాగర్లమూడి, సంగీతం: జీవన్‌బాబు, సమర్పణ: కె.రాఘవేంద్రరెడ్డి, రచన-దర్శకత్వం: శివ శేషు.



సాహసాల సుబ్రహ్మణ్య

ప్రముఖ డబ్బింగ్ ఆర్టిస్ట్, నటుడు పి.రవిశంకర్ తన కుమారుడు అద్వయ్‌ని హీరోగా పరిచయం చేస్తూ స్వీయ దర్శకత్వంలో తెరకెక్కిస్తున్న సోషియో ఫాంటసీ అడ్వెంచర్ 'సుబ్రహ్మణ్య'. తిరుమల్‌రెడ్డి, అనిల్ కడియాల నిర్మాతలు. దుబాయ్‌లో జరిగిన ప్రముఖ అవార్డు ఫంక్షన్‌లో ఈ సినిమా గ్లింప్స్‌ని మేకర్స్ లాంచ్ చేశారు. విషపూరిత పాములతో నిండిన బావిలోకి అద్వయ్ జంప్ చేయడంతో టీజర్ ఓపెన్ అయ్యింది. అతను దొంగచాటుగా లోపలికి ప్రవేశించి, ఓ పురాతన పుస్తకాన్ని చేతిలోకి తీసుకున్నాడు. ఇంతలో పాములన్నీ అతడ్ని వెంబడించాయి. అద్వయ్ పరిగెత్తడం మొదలుపెట్టాడు. వీఎఫ్‌ఎక్స్, ఎనిమేషన్స్ హైలైట్‌గా ఆద్యంతం ఈ గ్లింప్స్ సాగింది. ఈ గ్లింప్స్‌లో భగవాన్ శ్రీరాముడు కనిపించిన చివరి సీక్వెన్స్ ప్రత్యేకంగా నిలుస్తుంది. తెలుగు, కన్నడ, తమిళ, మలయాళ, హిందీ భాషల్లో పానిండియా స్థాయిలో విడుదల కానున్న ఈ సినిమాకు కెమెరా: విఘ్నేష్ రాజ్, సంగీతం: రవి బస్రూర్, సమర్పణ: ప్రవీణ కడియాల, రామలక్ష్మి, నిర్మాణం: ఎస్.జి.మూవీ క్రియేషన్స్.

మహిళలపై దాడుల నేపథ్యంలో

ప్రవీణ్ కె.వి, యషిక, పృథ్వీరాజ్, వైష్ణవి ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'మహీష'. స్క్రీన్‌ప్లే పిక్చర్స్ పతాకంపై ప్రవీణ్ కె.వి దర్శకత్వంలో ఈ చిత్రం రూపొందింది. సెన్సార్ వారు ఈ చిత్రానికి యు/ఏ సర్టిఫికెట్ అందించారు. త్వరలోనే థియేటర్లలో సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో ఈ సినిమా టీజర్ లాంచ్ కార్యక్రమం నిర్వహించారు. అతిథిగా విచ్చేసిన దర్శకుడు కొండా విజయ్‌కుమార్ టీజర్‌ని విడుదల చేసి చిత్ర యూనిట్‌కి శుభాకాంక్షలు అందించారు. ప్రస్తుతం మహిళలపై జరుగుతున్న దాడుల నేపథ్యంలో ఈ సినిమా తీశామని, 'యధా యధా హి ధర్మస్య' అనే పేరుతో ఈ సినిమా సీక్వెల్ చేయనున్నామని చిత్ర దర్శకుడు, నటుడు ప్రవీణ్ కె.వి తెలిపారు. ఇంకా పీపుల్ మీడియా ఫ్యాక్టరీ రామకృష్ణ, సంగీత దర్శకుడు శ్రీవెంకట్ కూడా మట్లాడారు. మౌనిక, విజయ్, పి.రమణారెడ్డి తదితరులు ఇతర పాత్రలు పోషించిన ఈ చిత్రానికి కెమెరా: వివేక్, సతీష్.





అక్టోబర్‌లో 'లగ్గం'

సాయిరోనాక్, ప్రగ్యా నగ్రా జంటగా నటిస్తున్న చిత్రం 'లగ్గం'. రమేష్ చెప్పాల దర్శకత్వం వహిస్తున్నారు. వేణుగోపాల్ రెడ్డి నిర్మాత. ప్రస్తుతం పోస్ట్‌ప్రొడక్షన్ దశలో ఉంది. తెలంగాణలో జరిగే పెళ్లి నేపథ్యంలో కుటుంబ విలువలకు దర్పణంలా ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. ఈ చిత్రాన్ని అక్టోబర్ 18న విడుదల చేయబోతున్నట్లు మేకర్స్ తెలిపారు. ఇప్పటికే విడుదల చేసిన ప్రచార చిత్రాలకు అద్భుతమైన స్పందన లభిస్తున్నదని, తెలంగాణదనం ఉట్టిపడే ఈ కథలో పెళ్లి ప్రాశస్త్యాన్ని, కుటుంబ విలువల గొప్పతనాన్ని ఆవిష్కరించామని, పెళ్లి ఘట్టం కన్నులపండువగా ఉంటుందని దర్శకుడు రమేష్ చెప్పాల పేర్కొన్నారు. రాజేంద్రప్రసాద్, రోహిణి, సప్తగిరి, ఎల్బీ శ్రీరామ్, కృష్ణుడు, రఘుబాబు, రచ్చ రవి తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: బాల్‌రెడ్డి, సంగీతం: చరణ్ అర్జున్, దర్శకత్వం: రమేష్ చెప్పాల.